V3 NEWS

www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

ఆదివారం

15-09-2024

సంపుటి : 01 | సంచిక : 133 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్



డా॥ కాచం సత్యనారాయణ
CMD



# వినాయక నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశాం

- 16న అన్ని విగ్రహాలు నిమర్జనం పూర్తి చేయాలి
- గణేష్ నిమర్జనం ప్రదేశాలను పరిశీలించిన ఎస్పీ సన్ ప్రీత్ సింగ్



**విశ్వంభర, సూర్యాపేట :** వినాయక నిమజ్జనానికి పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని సూర్యాపేట ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఐపీఎస్ అన్నారు. శనివారం ఆయన సూర్యాపేట డివిజన్ డీఎస్పీ రవి, పట్టణ ఇన్స్పెక్టర్ రాజశేఖర్, సూర్యాపేట రూరల్ సీఐ సురేందర్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ వీర రాఘవులు, ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాంలతో కలిసి సద్దల చెరువు మినీ ట్యాంక్ బండ్ వద్ద గణేష్ విగ్రహాల నిమర్జనం ప్రదేశాన్ని పరిశీలించారు. ప్రజలకు, భక్తులకు, ఉత్సవ కమిటీలకు నిమజ్జన సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని, అన్ని శాఖల అధికారులతో సమన్వయంతో ఏర్పాట్లు చేసి ఎలాంటి సంఘటనలు జరగకుండా ఉత్సవాలను జరుపుకునేల క్రేన్లు, లైటింగ్, నిమర్జనం హెల్పర్స్, గజ ఈతగాళ్లు, శానిటేషన్ ఏర్పాటు చేయాలని ఎస్పీ స్థానిక అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో గణేష్ నిమర్జనం ఊరేగింపు ఉత్సవాలకు జిల్లా పోలీస్ శాఖ పటిష్టమైన భద్రత ఏర్పాటు చేసిందని ప్రజలు, భక్తులు, ఉత్సవ కమిటీలు పోలీసు వారికి సహకరిస్తూ నిమర్జనం ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, ప్రమాదాలకు దూరంగా ఉండాలని కోరారు. సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా సూర్యాపేట పట్టణంలో మినీ ట్యాంక్ బండ్, సూర్యాపేట రూరల్ పరిధిలో మూసి ప్రాజెక్టు, కోదాడలో కోదాడ పెద్ద చెరువు, అనంతగిరి మండలం పాలేరు వాగు, చింతలపాలెం లో బుగ్గ మాదారం పుష్కర ఘాటు, మట్టపల్లి వద్ద కృష్ణానది, మహంకాళి గూడెం పుష్కర ఘాటు, మండలాలలో స్థానిక చెరువులు మొదలగు జిల్లా వ్యాప్తంగా 38 నిమజ్జన ప్రదేశాలను గుర్తించినట్లు తెలిపారు. అధికారులు చూపిన విధంగా జాగ్రత్తలు తీసుకొని ఊరేగింపు ఆలస్యం చేయకుండా గణేష్ విగ్రహాలను త్వరగా నిమజ్జనం చేసుకోవాలని ఎస్పీ కోరారు. ఊరేగింపు ఉత్సవాలను పోలీసులు నిశితంగా పరిశీలన చేస్తారని, సీసీ కెమెరాలతో నిఘా ఉంచి వీడియో రికార్డింగ్, ఫొటోస్ తీయడం చేయడం జరుగుతుందన్నారు. ఊరేగింపు ఉత్సవాలకు ఉపయోగించే వాహనాలు పూర్తి కండిషన్లో ఉండాలని డ్రైవర్ జాగ్రత్తలు పాటించాలని పిల్లలను వృద్ధులను వాహనాల్లో ఎక్కించవద్దని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా 2700 విగ్రహాలు అనుమతి ఇచ్చామని, జిల్లాలో 16వ తేదీ రోజున అన్ని గణేష్ విగ్రహాల నిమర్జనం పూర్తి కావాలని కోరారు. మద్యం తాగి ఇతరులకు అసౌకర్యం కల్పించవద్దు, వికృతమైన సినిమా పాటులు పెట్టి డ్యాన్స్ లు చేయొద్దు, భక్తి పాటలతో ఊరేగింపు నిర్వహించాలి, డీజేలు పెట్టవద్దు, భనాసంచా పెల్చవద్దు, హాస్పటల్, మసీదులు, చర్చీలు, స్కూల్స్, వృద్ధ ఆశ్రమాలు ఉన్న చోట శబ్దాలు చేయవద్దు అన్నారు. సోదరభావంతో అందరూ కలిసిమెలిసి ఉత్సవం చేసుకోవాలి, మనోభావాలను గౌరవించాలి అని అన్నారు.

# నేడు వైశ్య వికాస వేదిక ఆధ్వర్యంలో గురుపూజోత్సవం వేడుకలు



**విశ్వంభర, ఎల్బీనగర్ :** వైశ్య వికాస వేదిక ఆధ్వర్యంలో గురుపూజోత్సవం2024 కార్యక్రమం ఉంటుందని వైశ్య వికాస వేదిక ఫౌండర్ చైర్మన్ కాచం సత్యనారాయణ గుప్త తెలిపారు. శనివారము ఆయన మాట్లాడుతూ ఈనెల 15 తేది (ఆదివారము) కర్మన్ ఘాట్ ఆంజనేయ స్వామి గుడి దగ్గరలోని లక్ష్మీ కన్వెన్షన్ హాల్లో కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ ఎం కోదండరాం, విశిష్ట అతిథులుగా తెలంగాణ రాష్ట్ర డైరీ డెవలప్మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ మాజీ చైర్మన్ సోమ భరత్ కుమార్, జలవనుల అభివృద్ధి సంస్థ చైర్మన్ వీరమల్ల ప్రకాష్, ముఖ్యమంత్రి ఓ ఎస్ డి వేముల శ్రీనివాసులు, యాంటీ నార్కోటిక్ బ్యూరో అడిషనల్ సూపర్ అండి పాలాది కృష్ణమూర్తి గుప్త హాజరవుతున్నట్లు తెలిపారు.

# వైభవంగా గోవిందరాజస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు ప్రారంభం



**విశ్వంభర, తిరుపతి :** తిరుపతి గోవిందరాజస్వామి వారి ఆలయంలో పవిత్రోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపి, తోమాలసేవ, సహస్రనామార్చన నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామివారి ఉత్సవర్లను యాగశాలకు వేంచేపు చేసి వైదిక కార్యక్రమాలు నిర్వహించారు.అనంతరం స్నపన తిరుమంజనం జరిగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంలతో అభిషేకం నిర్వహించారు. సాయంత్రం ఆలయంలోని యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించి పవిత్ర ప్రతిష్ఠ చేశారు.యాత్రీకుల వల్లగానీ, సిబ్బంది వల్ల గానీ తెలియక జరిగే దోషాల నివారణకు ప్రతి ఏడాది మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో శాంతి, ఏఈవో మునిక్రిష్ణారెడ్డి, సూపరింటెండెంట్ మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.




# నలుగురు దొంగల అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు

- 19 ట్రాక్టర్ ట్రాలీలు, ఒక బైక్, ఒక స్వరాజ్ ఇంజన్ స్వాధీనం
- సీజ్ చేసిన వాహనాల మొత్తం విలువ రూ.22,92,000



**విశ్వంభర, సూర్యాపేట :** జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేసు వివరాలను ఎస్పి సన్ ప్రీత్ సింగ్ ఐపీఎస్ వెల్లడించారు. నిందితులు గ్రామాల్లో, పొలాల వద్ద రక్కి చేసి పొలాల వద్ద, రోడ్ల పక్కన రైతులు పెట్టిన ట్రాక్టర్ ట్రాలీలను గుర్తించి దొంగతనాలకు పాల్పడుతున్నారని తెలిపారు. దొంగలించిన ట్రాలీలను తక్కువ ధరకు ఇతర రైతులకు అమ్మడం చేస్తున్నారని గుర్తించాన్నారు. శుక్రవారం సాయంత్రం మద్దిరాల ఎస్ఐ తన సిబ్బందితో మద్దిరాల అడ్డ రోడ్డు వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా కుంటపల్లి వైపు నుంచి TS 05 FS 5840 నంబర్ గల పల్సర్ బైక్‌పై ఇద్దరు, స్వరాజ్ ట్రాక్టర్ ఇంజన్‌పై ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా వస్తుండగా, వారిని గమనించిన మద్దిరాల ఎస్ఐ తన సిబ్బందితో కలిసి 4 గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించారు. నల్గొండ జిల్లాకు చెందిన నిందితులు 4 గురు సంపంగి మహేశ్, సంపంగి సత్యం, ఒర్సు వెంకన్న, అలకుంట్ల మహేశ్ కలిసి 2023 అక్టోబర్ నెలలో పోలుమళ్ల గ్రామం నుంచి చిల్పకుంట్ల గ్రామానికి వెళ్లే మార్గంలో పొలాల్లో షేడ్స్‌లో ఉంచిన 2 ట్రాక్టర్ ట్రాలీలను దొంగతనం చేసినట్లు అంగీకరించారు. దీనిపైపోలుమల్ల గ్రామానికి చెందిన ఎల్లు జగన్, రామారెడ్డి మద్దిరాల పీఎస్‌లో పిర్యాధు చేశారు. బాధితుల పిర్యాధు మేరకు మద్దిరాల పీఎస్‌లోని నేరం సంఖ్య 206/2023, సెక్షన్ 379 ఐపీసీ ప్రకారం కేసు నమోదు చేశారు. నింధితులు నేరాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారు. ట్రాలీల చోరీ కేసులో 4 గురు నిందితులను ఆధుపులోకి తీసుకుని దర్యాప్తు చేశారు. విచారణలో భాగంగా నింధితులు మునగాల, పెన్‌పజడ్, మిర్యాలగూడ రూరల్, నాగారం, మద్దిరాల, గుర్రంపోడు, నూతనకల్, మోతె, గరిడేపల్లి, శాలిగౌరారం, సూర్యాపేట రూరల్, కేతేపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో చోరీ చేసిట్లు నిందితులు అంగీకరించారు. గుర్తించిన కేసుల్లో 19 ట్రాక్టర్ ట్రాలీలు, ఒక ఇంజన్, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకుని వీరిని రిమాండ్‌కు తరలించారు. నల్గొండ జిల్లా హాలియా మండలం మారేపల్లి గ్రామం ఏ1 ఇంటి నుంచి 20 లక్షల 92 వేలు విలువగల మొత్తం 19 ట్రాలీలు, నింధితులు పట్టుబడి సమయంలో ఉపయోగించిన 2 లక్షల విలువగల ఒక స్వరాజ్ ట్రాక్టర్ ఇంజన్, ఒక పల్సర్ బైక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సూర్యాపేట జిల్లాలో 11 దొంగతనాలు, నల్గొండ జిల్లాలో 7 దొంగతనాలకు పాల్పడ్డారు. ఈ 18 కేసులు కాకుండా నింధితులు A1సంపంగి మహేశ్, A2సంపంగి సత్యం, A3ఒర్సు వెంకన్న గతములో 12 కేసుల్లో నేర చరిత్ర కలిగి ఉన్నారు. A1 మహేష్, A3 వెంకన్న లను రాచకొండ కమిషనరేట్ ఆదిభట్ల పోలీసు స్టేషన్ వారు ట్రాక్టర్ ట్రాలీ కేసులో జైలుకు పంపారు. ఈ కేసుల చేదించిన సీసీఎస్ ఇన్స్పెక్టర్ శివ కుమార్, తుంగతుర్తి సీఐ శ్రీను, సీసీఎస్ ఎస్ఐ శ్రీకాంత్, మద్దిరాల ఎస్ఐ వీరన్న, పర్యవేక్షణ చేసిన డీఎస్పీ రవి, సీసీఎస్ సిబ్బంది వెంకన్న, శ్రీనివాస్, గురు స్వామి, మల్లేష్, ఆనంద్, శివ, సతీష్, ప్రభాకర్‌లను ఎస్పీ అభినందించి రివార్డ్ అందించారు. ఈ సమావేశంలో ఏఆర్ అదనపు ఎస్పీ జానార్ధన్ రెడ్డి, సూర్యాపేట డీఎస్పీ రవి, తుంగతుర్తి సీఐ శ్రీను, సీసీఎస్ ఇన్స్పెక్టర్ శివ కుమార్, ఎస్ఐలు శ్రీకాంత్, వీరన్న, సీసీఎస్ సిబ్బంది ఉన్నారు.



మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ దామోదర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా సమాచార హక్కు వికాస్ సమితి సభ్యులు జిల్లా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉన్నం సత్యనారాయణ, అధ్యక్షుడు గుంతకండ్ల ముకుందా రెడ్డి, ప్రధాన కార్యదర్శి చేకురి శివ, నియోజకవర్గ అధ్యక్షులు దండ వెంకటరెడ్డి, పట్టణ అధ్యక్షుడు బంగారు శ్రీధర్ గౌరవ అధ్యక్షులు లక్ష్మీనారాయణ తదితరులు దామోదర్ రెడ్డికి పూల మొక్క అందజేసి, శాలువాతో సన్మానించారు.

- విశ్వంభర, సూర్యాపేట



సికింద్రాబాద్ పార్సిగుట్ట సౌరాల బస్తీలో జై బజరంగ్దళ్ యూత్ అసోసియేషన్ ఆర్గనైజర్ వెంకట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ వినాయకుడి మండప వద్ద 11 రోజులు నిత్యం అన్నదానం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా వినాయకుడికి ప్రత్యేక పూజ చేస్తున్న యూత్ సభ్యులు.

- విశ్వంభర, సికింద్రాబాద్



సికింద్రాబాద్ వారసిగూడలో ఏకే అసోసియేషన్, బీఆర్ఎస్ సీనియర్ లీడర్ సాయి యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపంలో పూజలు నిర్వహించిన ఏకే అసోసియేషన్ సభ్యులు, భక్తులు.

- విశ్వంభర, సికింద్రాబాద్



పద్మారావు నగర్‌లో కాంగ్రెస్ సీనియర్ లీడర్ కృష్ణ ముదిరాజ్ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రుల్లో ముఖ్య అతిథిగా సనత్ నగర్ డివిజన్ కోట నీలిమ, బీఆర్ఎస్ లీడర్ రామేశ్వరం గౌడ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారిని నిర్వాహకులు సన్మానించారు.

- విశ్వంభర, సికింద్రాబాద్




# అనాథ పిల్లలకు శ్రీ వసుదైక ఫౌండేషన్ చేయూత



**విశ్వంభర, దిల్‌సుఖ్‌నగర్ :** శ్రీ వసుదైక ఫౌండేషన్ తన మొదటి వార్షికోత్సవ వేడుకల సందర్భంగా ప్రిన్స్ టాన్ హై స్కూల్‌లో చదువుతున్న అనాథ పిల్లల ఫీజు కోసం రూ.10,000/ ల చెక్‌ను అందజేశారు. శ్రీ వసుదైక ఫౌండేషన్ గత కొంతకాలంగా సమాజ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ.. సమాజానికి మేలు చేస్తుంది. అనాథ శరణాలయాలకు సహాయం, రక్తదాన శిబిరాలు, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు ఇలా అనేక రకాల కార్యక్రమాలను నిర్వహిస్తుంది. ఫౌండేషన్ తన సేవా కార్యక్రమాలతో సమాజానికి ఆదర్శంగా నిలుస్తోందని, ప్రతి ఒక్కరు తమ వంతు సహాయంతో సమాజాన్ని మార్చవచ్చని ఫౌండేషన్ సభ్యులు, స్వచ్ఛంద సేవకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్ర్యమంలో ఫౌండేషన్ మెంబర్స్ ఉదయ్, రవి కిరణ్, రజిని సూర, శ్రీనివాస్, శరత్, శివ, విశ్వ తేజ పాల్గొన్నారు.

V3 NEWS
www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
ఆదివారం
15-09-2024
సంపుటి : 01 | సంచిక : 133 | పేజీలు : 12 | వెల : 5/-  తెలంగాణ / ఆంధ్రప్రదేశ్


డా॥ కాచం సత్యనారాయణ CMD

కాంగ్రెస్‌ను విమర్శించినా
## సంతోషంగా అనిపించేది
అసదుద్దీన్ ఓవైసీ నా సోదరుడే కాబట్టి..
నగర అభివృద్ధికి కలిసి పని చేయాలి
'ప్రొఫెట్ ఫర్ ద వరల్డ్' పుస్తకాన్ని ఆవిష్కరించిన సీఎం రేవంత్


2

## దేశం మొత్తం ఆంధ్రప్రదేశ్ వైపు చూసేలా..
కనెక్టివిటీ పెంచుతున్నాం
గన్నవరం విమానాశ్రయం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
దేశంలో మరో 200 విమానాశ్రయాల ఏర్పాటుకు కృషి
కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు


2


ఈ ఎన్నికలు జమ్మూకశ్మీర్

# భవిష్యత్తును నిర్ణయిస్తాయి
### వారసత్వ రాజకీయాలు ఈప్రాంత అభివృద్ధిని దెబ్బతీశాయి

- కొత్త నేతలకు అవకాశం ఇవ్వలేదు
- యువత ఉగ్రవాదంతో బాధపడింది
- ప్రజాస్వామ్యాన్ని క్షేత్రస్థాయికి చేర్చడమే అసలు లక్ష్యం
- కాంగ్రెస్ హయాంలో అప్రకటిత కర్ఫ్యూలు ఉండేవి
- కేంద్రంలో హోంమంత్రికూడా వెళ్లలేని పరిస్థితి
- అలా భయపడే రోజులు ముగిశాయి
- జమ్మూకశ్మీర్ ఎన్నికల ప్రచారంలో మోదీ

**జమ్మూ/శ్రీనగర్:** అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రధాని మోదీ శనివారం జమ్మూకశ్మీర్ లోని దోడా జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా వారసత్వ రాజకీయాలను వ్యతిరేకించారు. ఆ తరహా పార్టీలు ఈ ప్రాంతంలో అభివృద్ధిని దెబ్బతీశాయని విమర్శించారు. అప్రకటిత కర్ఫ్యూలు ఉండవని, ఆరోజులు ముగిశాయని చెప్పారు. అలాగే బీజేపీ కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేశారు. "ఈ ఎన్నికలు జమ్మూకశ్మీర్ భవిష్యత్తును నిర్ణయించనున్నాయి. స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి మిగతా2లో...

## వ్యవసాయ మోటార్లకు సోలార్ పంపుసెట్లు

- ప్రయోగాత్మకంగా చేపట్టబోతున్నాం
- కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి నాణ్యమైన విద్యుత్ ఇస్తున్నాం
- ప్రభుత్వ ఖర్చుతో ఇళ్లకు సోర విద్యుత్ సౌకర్యం కల్పిస్తాం: డిప్యూటీ సీఎం భట్టి
- సాంకేతిక సమస్యలతో కొందరికి రూ.2లక్షల రుణమాఫీ కాలేదు
- అర్హులైన రైతులందరికీ చేసి తీరుతాం: మంత్రి శ్రీధర్ బాబు



**విశ్వంభర, ధర్మారం:** ప్రజల ఆశీర్వాదంతో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం వచ్చిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ప్రజల లక్ష్యాలను రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలుగా మార్చుకున్నామని చెప్పారు. పెద్దపల్లి జిల్లా ధర్మారంలో మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.." ప్రజా ఆకాంక్షలను చట్టాలుగా మార్చాం. 15 రోజుల్లో రైతుల ఖాతాల్లో రూ.18 వేల కోట్లు వేశాం. దేశంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా రుణమాఫీ చేశాం. అర్హత ఉన్న ప్రతి రైతుకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తాం. మిగతా2లో...

**బాధ్యతగల ఎమ్మెల్యేలు బజారున పడి తన్నుకోవడం బాధ కలిగించింది: భట్టి** 2

రాష్ట్ర వ్యాప్తంగా 773 చోట్ల కాల్వలు,
## చెరువులకు గండ్లు
- తాత్కాలిక మరమ్మతులకు రూ.75 కోట్లు
- శాశ్వత పునరుద్ధరణకు రూ.483 కోట్లు
- అవసరమవుతాయని అంచనా
- కేంద్ర ప్రభుత్వ సాయం కోరుతూ తెలంగాణ నీటిపారుదల శాఖ నివేదిక


2

## హైడ్రాకు విశేష అధికారాలు రాబోతున్నాయి
- చట్టబద్ధతకు త్వరలోనే ఆర్డినెన్స్
- 6 వారాల తర్వాత అసెంబ్లీలో హైడ్రా బిల్లు
- గ్రేహౌండ్స్, టాస్క్‌ఫోర్స్ తరహాలో పనిచేస్తుంది
- కమిషనర్ రంగనాథ్ వెల్లడి
- 20న కేబినెట్ భేటీలో ఈఅంశంపై చర్చించనున్న మంత్రి వర్గం



**విశ్వంభర, హైదరాబాద్:** నగరంలో ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, విపత్తుల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన హైడ్రాకు వచ్చే నెలలో ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకురాబోతుందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు. మంత్రివర్గ ఆమోదంతో విశేష అధికారాలతో హైడ్రా ఉండబోతుందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో క్రెడాయ్ నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రంగనాథ్ హైడ్రా వల్ల స్థిరాస్తి రంగంపై ఎలాంటి ప్రతికూల ప్రభావం ఉండబోతుందని వివరించారు. మిగతా2లో...



## 20న కేబినెట్ భేటీ
- వరదలు, కేంద్ర సాయం, హైడ్రా చట్టబద్ధత, బీసీ రిజర్వేషన్, కులగణన, 200 పంచాయతీల ఏర్పాటు అంశాలపై జరగనున్న చర్చ

విశ్వంభర, హైదరాబాద్: మంత్రివర్గం సమావేశం ఈ నెల 20న జరుగనుంది. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో మంత్రిమండలి భేటీ అవుతుంది. ఈ సందర్భంగా మిగతా2లో...

## పాలమూరు ఎత్తిపోతల పూర్తిచేస్తే.. కేసీఆర్‌కు పేరొస్తుంది
### అందుకే ఆపనులు నిలిపివేశారు
- బీఆర్ఎస్ ప్రభుత్వం 95శాతం పూర్తి చేసింది
- వలసల జిల్లా పచ్చగా చేయాలనే శరవేగంగా చేపట్టాం
- పాలమూరు బిడ్డను అని చెప్పుకునే నీకు దానిపై ఎందుకు ప్రేమ లేదు
- రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ధ్వజం



**విశ్వంభర, నాగర్‌కర్నూల్ :** పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు పనులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం 95 శాతం పూర్తి చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. మిగిలిన 5 శాతం పనులు పూర్తి చేస్తే కేసీఆర్‌కు పేరొస్తుందని రేవంత్ రెడ్డికి భయం పట్టుకుందని, అందుకే మిగతా2లో...

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి


నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 115 | ₹ 137 |
| స్కిన్ | స్కిన్ లెస్ |
| ₹ 199 | ₹ 226 |



## 20వేల మందితో పోలీస్ బందోబస్తు
- నగరంలో గణేష్ నిమజ్జనాల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశాం
- విమోచన దినం ఉన్నందున అదనపు బలగాలు ఉంచనున్నాం
- బాలాపూర్ నుంచి ట్యాంక్ బండ్ వరకు మార్గాన్ని పరిశీలించిన డీజీపీ జితేందర్

2

## తెలంగాణ పామ్ ఆయిల్ రైతులకు భారీ ఊరట
మంత్రి తుమ్మల విన్నపం మేరకు స్పందించిన కేంద్ర ప్రభుత్వం
దిగుమతి సుంకాన్ని 5.5% నుండి 27.5%కు పెంచుతూ కేంద్రం ఉత్తర్వులు


2

సెప్టెంబర్ 15


ఇంజనీర్లకు, భావి ఇంజనీర్లకు
ఇంజనీర్స్ డే శుభాకాంక్షలు
మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి
ఎన్నో అద్భుతాలు.. మరెన్నో ఆవిష్కరణలు
ప్రపంచాన్ని ముందుకు తీసుకెళ్లడంలో
ఇంజనీర్ల ప్రత్యేక పాత్ర.

ఎల్.అరుణోదయ్ కుమార్
డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ - ఇరిగేషన్ సబ్ డివిజన్ నెం. 4, మెట్‌పల్లి

# ప్రతిపక్షంతో పొలిటికల్ మైండ్ గేమ్ ఆడుతున్న సీఎం రేవంత్

**తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పాలన ప్రధానంగా ప్రభుత్వ పాలసీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పాలిటిక్స్ వంటి మూడు అంశాలపై సమపాళ్లలో సాగింది. గత ప్రభుత్వంతో పోల్చితే చాలామేరకు ఆశాజనకంగానే పాలన సాగుతుందని చెప్పుకోవచ్చు. రాజకీయంగా రేవంత్ వేసే ఒక్కో ఎత్తుగడ ప్రతిపక్ష పార్టీ నేతలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. గత ప్రభుత్వం పెట్టుబడుల విషయంలో పెద్ద ఎత్తున ప్రచారానికే పరిమితమైందని, వాటిని గ్రౌండ్ చేయడంలో దృష్టి కేంద్రీకరించలేదు. భారీ పెట్టుబడులు... వేల ఉద్యోగాలు అంటూ ప్రకటనలు గుప్పించేది. కానీ అవి వాస్తవం రూపం దాల్చినట్లు కనిపించలేదు. పైగా ఆ కంపెనీలకు అవసరమైన మానవ వనరులకు ఉండాల్సిన నైపుణ్యాల విషయంలోనూ ఎటువంటి శ్రద్ధా పెట్టలేదు. అందుకు భిన్నంగా సీఎం రేవంత్ ఆయా కంపెనీలకు కావాల్సిన నిపుణులను అందించేందుకు వీలుగా స్కిల్ యూనివర్సిటీని రంగారెడ్డి జిల్లాలోని భ్యాగరికంచెలో ప్రారంభించారు. ఏ అంశంపైనైనా ఒక స్పష్టత ఉన్నప్పుడు ఇటువంటి నిర్మాణాత్మకమైన చర్యలుంటాయి.**



ప్రస్తుతం రేవంత్ రెడ్డి వేస్తున్న రాజకీయ ఎత్తుగడలకు ప్రతిపక్ష పార్టీలు చిత్తు చిత్తవుతున్నాయని చెప్పకతప్పదు. ప్రతిపక్ష పార్టీలో ఆయన మైండ్ గేమ్ ఆడుతున్నారు. అందుచేత, బీఆర్ఎస్ పార్టీ తికతికపడుతున్నది. ఆ పార్టీ అధినేత బయటికి రావడం లేదు. కేటీఆర్, హరీష్ రావు రేవంత్ పొలిటికల్ గా ఎదుర్కొలేక... నీకు ఇంగ్లీష్ రాదు. నీకు అది రాదు.. ఇది రాదు అంటూ హేళన చేస్తున్న. అదే విధంగా.., ఇక అసెంబ్లీ ఎన్నికల వేడి పతాకస్థాయిలో ఉన్నప్పుడు రేవంత్ రెడ్డి అంటే పొడగిట్టని ప్రత్యర్థులు పలు రకాల దుష్ప్రచారాలు చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే హైదరాబాద్ ఖాళీ అవుతుందని అబద్ధాలు చెప్పారు. సోషల్ మీడియా, మీడియా... పత్రికా ప్రకటనలు ఇలా అన్ని వేదికల్లో చాలా నెగటివ్ ప్రచారం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే తాము కష్ట పడి తీసుకొచ్చిన పరిశ్రమలు తరలిపోతాయన్నారు. కొత్తవి అసలు రానే రావంటూ మోత మోగించారు. అయినా, అబద్ధాలను దాటుకొని రాష్ట్రంలో కాంగ్రెస్ గెలుపొందింది. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ప్రమాణ స్వీకారం చేసిన మరుక్షణం నుంచే పనిలో పడ్డారు. ఇచ్చిన హామీల అమలుకు శ్రీకారం చుట్టడంతో పాటు పెట్టుబడుల సాధనపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆ క్రమంలోనే తొలుత దావోస్, తాజాగా అమెరికా, దక్షిణ కొరియా వెళ్లారు. ఐటీ, పరిశ్రమల రంగంలో ఇప్పటికే తెలంగాణలో పని చేస్తున్న కంపెనీల విస్తరణకు ఒప్పించడంతో పాటు పలు నూతన కంపెనీల పెట్టుబడులు పెట్టేలా యత్నించారు. రాష్ట్రావతరణ జరిగిన 2014లో తెలంగాణ నుంచి ఐటీ ఉత్పత్తులు, సేవల ఎగుమతులు రూ.57,000 కోట్లు ఉంటే అవి ప్రస్తుతం రెట్టింపు కన్నా ఎక్కువై ఈ ఏడాది రూ.1,45,000 కోట్లకు చేరుకున్నాయంటే దానికి ప్రధాన కారణం ఒక వ్యక్తి కానే కాదు. హైదరాబాద్ లో ఉన్న అనువైన వాతావరణం అని సీఎం రేవంత్ ఇటీవల క్రెడా ప్రోగ్రాంలో చెప్పడం చూస్తే... నిజమే అనిపించింది. ప్రభుత్వాలు మారినా హైదరాబాద్ ఎందుకు డెవలప్ మెంట్ అవుతుందంటే... ఈ ప్రాంతంలో అన్ని రకాల వసతులు ఉండటం... వ్యాపార శక్తులకు అవసరమైన భూమి, కరెంటు, నీరు కావల్సినంత అందుబాటులో ఉండటమే ప్రధాన కారణమని చెప్పుకొచ్చారు. ప్రపంచంలోనే టాప్ పొజిషన్‌లో ఉండే టెక్ కంపెనీలు గూగుల్, ఆపిల్, అమెజాన్, అనేక ఫార్మా, ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్స్ కంపెనీలు ఇవ్వాళ తెలంగాణలో భారీ పెట్టుబడులు పెట్టడానికి కారణం ఇదే అని స్పష్టంగా చెప్పవచ్చు. రేవంత్ పాలన ప్రారంభించగానే, తెలంగాణ రైతాంగాన్ని ఆదుకునేందుకు ఏకకాలంలో రుణమాఫీ చేశారు. అందుకు రూ. 31 వేల కోట్లు కేటాయించారు. అందులో సుమారు రూ.18 వేల కోట్ల మాఫీతో 22 లక్షల రైతు కుటుంబాలు అప్పుల ఊబి నుంచి బయటపడ్డాయి. సాంకేతిక కారణాలతో పలువురి రైతుల అప్పులు మాఫీ కాలేదు. కానివాటిపైనా దృష్టి పెడతామని చెప్పడం స్వాగతించాల్సిన విషయం.

చివరగా సీఎం రేవంత్ రెడ్డి ఆంగ్ల భాషాపరిజ్ఞానం చుట్టూ సోషల్ మీడియాలో ప్రతిపక్ష నేతలు చేస్తున్న దుష్ప్రచారం చాలా జుగుప్సాకరంగా ఉన్నది. ఆయన ఇంగ్లీష్, హిందీ భాషానైపుణ్యాలు ఏ స్థాయిలో ఉన్నాయి అన్నది అవసరమైన చర్చేనా అసలు? అంతర్జాతీయ వేదికలపై ఆయన సరైన ఇంగ్లీష్ మాట్లాడలేకపోవడం వల్ల తెలంగాణను ప్రపంచం ఎలా చూస్తుందనే విషయాలపై సోషల్ మీడియాలో చర్చ మొదలుపెట్టారు. అదే సమయంలో, తెలంగాణలో ప్రభుత్వం నడపడానికి ముఖ్యమంత్రికి కావాల్సింది ఇంగ్లీష్ భాషా? లేదంటే పరిపాలనా దక్షత, ఇతర సామర్థ్యాలా అన్నది గుర్తించకపోవడం వారి మనోవైకల్యతను సూచిస్తోంది. ఏ దేశపు పెట్టుబడిదారైనా చూసేది నాయకుడి ఇంగ్లీష్ లాంగ్వేజ్ కాదని.... తమ పెట్టుబడులకు సీఎం పరిపాలనపరంగా ఏ విధమైన సపోర్టు ఇస్తున్నారన్న విషయం అనే దానిని గుర్తుంచుకోవాలి. ఆయా దేశాలు, రాష్ట్రాల్లో రాజకీయ వాతావరణం ఎలా ఉంది? అక్కడ తమ పరిశ్రమ లేదా వ్యాపారానికి అనుకూల పరిస్థితులు ఉన్నాయా అన్నది చూస్తారు. అంతేకానీ, నాయకుల భాషా పరిజ్ఞానాన్ని చూడరన్నది తెలుసుకోవాలి. ఇంగ్లీష్ భాషా నైపుణ్యమే ప్రాతిపదిక అయితే ప్రపంచంలోని ఇన్వెస్టర్లంతా అమెరికాకో, బ్రిటన్‌కో లేదంటే ఇంగ్లీష్ మాట్లాడే నాయకులున్న ఇతర దేశాలకో క్యూ కట్టాలి కదా. ఒడిశా నిరాటంకంగా 22 ఏళ్ల పాటు నవీన్ పట్నాయక్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆయనకు ఒడియా సరిగా రాదు... ఆయన విద్యాభ్యాసమంతా ఇంగ్లీష్ మీడియంలోనే సాగింది. ఆయన ఫ్రెంచ్ అద్భుతంగా మాట్లాడతారు. ఇంగ్లీష్ భాషలో ఏకంగా మూడు పుస్తకాలు రాశారు.. కానీ నవీన్ పట్నాయక్ ఇంగ్లీష్, ఫ్రెంచ్ భాషల నైపుణ్యం ఒడిషాకు పెట్టుబడులు తీసుకురాలేదనే విషయం రేవంత్ గుడ్డి వ్యతిరేకులతో పాటు ఆ ప్రభావంలో పడే వారు గుర్తించాలి. గుజరాత్ కు ముఖ్యమంత్రి అయ్యే నాటికి నరేంద్ర మోదీకి ఇంగ్లీష్ అసలు ఏమాత్రం రానేరాదు అన్న విషయం తెలుసుకోవాలి. చివరగా ఇవన్నీ పక్కనబెడితే... సీఎంగా కేసీఆర్ ఉన్నప్పుడు చేయని పని.. రేవంత్ వచ్చాక జరిగిన ప్రధాన మార్పు ఏమిటంటే... ప్రజాస్వామికంగా ఉండటం. కేసీఆర్ హయాంలో ప్రజాస్వామ్యమా నువ్వెక్కడా అన్నట్టు పరిస్థితి ఉండేది. ప్రస్తుతం ప్రజాస్వామిక పాలన చూస్తున్నాం. అందుకే, మనలో వేధన ఏమాత్రం అక్కర్లేదని, రేవంత్ పాలన పరుగు చూశాక... పరివేదన పడాల్సింది ప్రతిపక్షాలే అన్న విషయం స్పష్టంగా కనిపిస్తోంది.



- మన్నారం నాగరాజు
తెలంగాణ లోక్ సత్తా పార్టీ, రాష్ట్ర అధ్యక్షుడు
ఫోన్ :9550844433

## భారతదేశం గర్వించదగ్గ ఇంజనీర్

# మోక్షగుండం విశ్వేశ్వరయ్య

ఏ దేశం అభివృద్ధి చెందాలన్నా ఆదేశం సాంకేతికంగా అభివృద్ధి చెందవలసిన అవసరం ఉంది. ఒక దేశం సాంకేతిక అవసరాలు తీరాలంటే దానికి నిపుణులైన ఇంజనీర్ల అవసరముంటుంది. సమాజానికి ఇంజనీర్లు చేసిన సేవలను గౌరవించేందుకు సెప్టెంబర్ 15న జాతీయ ఇంజనీర్ల దినోత్సవాన్ని జరుపుకుంటారు. భారతదేశపు గొప్ప ఇంజనీర్లలో ఒకరైన డాక్టర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య పుట్టిన రోజు అది. మోక్షగుండం విశ్వేశ్వరయ్య మైసూరు సంస్థానం లోని కోలారుజిల్లా చిక్కబళ్ళాపుర తాలూకాలోని ముద్దేనహళ్ళిలో 1861 సెప్టెంబరు 15 తేదీన జన్మించారు. తండ్రి శ్రీనివాసశాస్త్రి తల్లి వెంకటలక్ష్మమ్మ.



విశ్వేశ్వరయ్య పూర్వీ కులు కర్నూలుజిల్లా (ప్రస్తుతం ప్రకాశంజిల్లా) గిద్దలూరు సమీపంలోని మోక్షగుండం అనే గ్రామంలో ఉండేవారు. 17వ శతాబ్దంలో విశ్వేశ్వరయ్య తాత గారు కుటుంబంతోపాటు ముద్దేనహళ్ళి చేరారు. అక్కడే విశ్వేశ్వరయ్య జన్మించారు.

చిక్కబళ్ళాపురలో లోయర్ సెకండరి పరీక్ష లో ఉత్తీర్ణుడైన విశ్వేశ్వరయ్య పై చదువు సాగించడానికి ఆర్థిక యిబ్బంది ఏర్పడింది. మేనమామ రామయ్య బెంగళూరులో ఉండేవాడు. ఆయన సామాన్య కుటుంబీకుడు. అల్లుడు ప్రతిభా వంతుడని విన్నాడు. విశ్వేశ్వరయ్యను రప్పించుకొని 1875 లో వెస్లియన్ మిషన్ హైస్కూల్లో చేర్పించాడు.

విశ్వేశ్వరయ్య తన స్వగ్రామంలో పాఠశాల విద్యను పూర్తి చేసి, మద్రాసు విశ్వవిద్యాలయంలో బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్ చదివారు. ఆ తర్వాత పూణేలోని కాలేజ్ ఆఫ్ సైన్స్‌లో సివిల్ ఇంజినీరింగ్‌లో డిప్లొమా చదివారు. పువ్వు పుట్టగానే పరిమళించిన చందంగా చిన్ననాటి నుండే విశ్వేశ్వరయ్య తెలివితేటలతోపాటు పెద్దలపట్ల, గురువులపట్ల భక్తి శ్రద్ధలు కలవాడు విశ్వేశ్వరయ్య. చిక్కబళ్ళాపుర పాఠశాల ఉపాధ్యాయులుగ వుండిన కృష్ణగిరి రాఘవేంద్రరావుగారు విశ్వేశ్వరయ్యను ఎంతగానో ప్రోత్సహించేవారు.

ఇంజనీర్ గా ఉద్యోగం ప్రారంభించిన విశ్వేశ్వరయ్య ఇంజనీరింగ్ రంగంలో అద్భుతాలను సృష్టించాడు.బాంబే ప్రభుత్వం అతనికి నాసిక్‌లో అసిస్టెంట్ ఇంజనీర్ ఉద్యోగం ఇచ్చింది. ఇంజనీర్‌గా వివిధ ప్రాజెక్టులను విజయవంతంగా అమలు చేశాడు. నిజానికి మైసూర్‌లోని కృష్ణరాజ సాగర్ డ్యామ్ వెనుక ఆయన కృషి ఎంతో ఉన్నది.మైసూర్‌లోని కృష్ణ రాజ సాగర ఆనకట్ట నిర్మాణం, దక్కన్ పీఠభూమి నీటిపారుదల వ్యవస్థను ఏర్పాటు చేయడం మరియు 1908లో హైదరాబాదులో మూసీ నదికి వచ్చిన వరదల నుండి హైదరాబాదును రక్షించడం మొదలైనవి సర్ ఎం విశ్వేశ్వరయ్య యొక్క అత్యంత ప్రసిద్ధ విజయాలు.

భారతదేశ అభివృద్ధికి గణనీయమైన కృషి చేసిన ఒక మార్గదర్శక ఇంజనీర్ మరియు రాజనీతిజ్ఞుడిగా విశ్వేశ్వరయ్య సుప్రసిద్ధుడు. విశ్వేశ్వరయ్య సివిల్ ఇంజనీర్ గా అతను దేశ అభివృద్ధికి గణనీయమైన కృషి చేశాడు. కృష్ణ రాజ సాగర డ్యామ్, మైసూర్ ప్యాలెస్ మరియు బెంగుళూరు నీటి సరఫరా పథకంతో సహా అనేక ఐకానిక్ నిర్మాణాలను రూపొందించి, నిర్మించిన ఘనత ఆయనది.

విశ్వేశ్వరయ్య దక్కను ప్రాంతంలో సాగునీటి సమస్యపై తీవ్రంగా కృషి చేశారు. అంతేకాదు దేశంలోనే తొలిసారిగా 1903లో ఆటోమేటిక్ ఫ్లడ్ గేట్ల పద్ధతిని కనుగొన్నారు. అంతేకాదు వాటిని పూనెలోని ఖండక్వస్ల రిజర్వాయిర్‌లో నెలకొల్పారు. రిజర్వాయిర్‌లో భారీగా చేరే నీటిని నిలువవుంచగలిగే సదుపాయంతోపాటు డ్యామ్‌కు ఎటువంటి హాని తలపెట్టకుండా చూడటంలో ఈ ఫ్లడ్ గేట్లు ఎంతగానో ఉపయోగపడ్డాయి. ఈ సూత్రం విజయవంతం కావడంతో దేశంలో పలుచోట్ల ఇదే తరహా పద్ధతిని ప్రవేశపెట్టారుపూనాలోని దక్కన్ క్లబ్ స్థాపక సభ్యులు శ్రీయుతులు రానడే, కేల్కర్, తిలక్, గోఖలేగార్ల సాహచర్యం విశ్వేశ్వరయ్య తన వృత్తిలో సమున్నత స్థాయికి చేరుకోవడానికి ఎంతగానో దోహదపడింది. సుక్కూర్ నగరం ప్రజల దాహార్తిని తీర్చడానికి 1894లో అక్కడికి వెళ్లి పరిస్థితిని పూర్తిగా అంచనా వేసి సుక్కూర్ బరాజ్ నిర్మాణం పూర్తిచేసి నాటి సుకూర్ గవర్నర్ ప్రశంసలందుకోవటం జరిగింది. 1898లో జపాన్ దేశంలో పర్యటించి ఇంజనీరింగ్ విధానాలను అధ్యయనం చేశాడు వరద గేట్ల పద్ధతులపై సమగ్రమైన అవగాహన ఏర్పరచుకున్నారు. పూనా నగర జల విభాగం 1899 లో ఇంజనీర్ గా ఆయన ప్రవేశపెట్టిన 'బ్లాక్ సిస్టం ' - నిర్మాణంత రోజుల్లో ఒక విప్లవాత్మకమైన చర్య. పూనా జలనిర్గమన పథకం అమలు చేయడంలో విశ్వేశ్వరయ్య కీలకపాత్ర వహించారు. విశ్వేశ్వరయ్య ఇంజనీరింగ్ లో సాధించిన మరొక అద్భుతం ఆటోమేటిక్ సూసేట్ (స్వచ్ఛంద కవాటం) నిర్మాణం. కానీ దీనికి పేటెంట్ చేసుకోకపోవటం, ప్రభుత్వంనుండి ప్రతిఫలం కోరకపోవటం వల్ల అంతటా అమలు చేయడం సాధ్యం కాలేదు. కేవలం జాతీయస్థాయిలోనే కాక అంతర్జాతీయ స్థాయిలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఇంజనీరింగ్ నైపుణ్యం గొప్ప ప్రచారాన్ని పొందింది. అందుకే నాటి బ్రిటిష్ ప్రభుత్వం ఈజిప్టు సమీపంలోని ఏడెన్ జలనిర్గమన పథకం అమలు కొరకు విశ్వేశ్వరయ్య ను ఏడెన్ పంపించింది.

బెంగళూరులో విమాన కర్మాగార పథకం రూపొందించుటలో, అఖిల భారత ఉత్పత్తిదారుల సంఘ స్థాపనలో, గ్రామీణ పరిశ్రమల పథకం రూపకల్పనలో విశ్వేశ్వరయ్య కీలకపాత్ర పోషించారు.బీహార్ లో గంగానదిపై రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి తగిన స్థలం ఎంపికలోను విశ్వేశ్వరయ్య చూపిన ప్రతిభ అనన్య సామాన్యం. దేశవ్యాప్తంగా ప్రధాన పబ్లిక్ వర్క్స్ ప్రాజెక్టులలో పాత్ర పోషించిన తరువాత, అతను మైసూర్ 19వ దివాన్‌గా పనిచేశాడు.దివాన్‌గా ఉన్న సమయంలో, చెప్పుల నూనె ఫ్యాక్టరీ, సోప్ ఫ్యాక్టరీ, మెటల్స్ ఫ్యాక్టరీ, క్రోమ్ టానింగ్ ఫ్యాక్టరీ, అందువలన భద్రావతి ఐరన్ అండ్ స్టీల్ వర్క్స్ వంటి అనేక పరిశ్రమలు స్థాపించబడ్డాయి. మోక్షగుండం విశ్వేశ్వరయ్య మెమోయిర్స్ ఆఫ్ మై వర్కింగ్ లైఫ్' (ఆత్మకథ) అనే గ్రంథాన్ని ప్రచురించడంతోపాటు భారత ఆర్థిక వ్యవస్థపై రెండు పుస్తకాలు రాశాడు.

1917 లో బెంగుళూరులో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల స్థాపనలో విశ్వేశ్వరయ్య కృషి ఉన్నది. అందుకే ఆ కళాశాలకు అతని గౌరవార్థం విశ్వేశ్వరయ్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అని పేరు పెట్టారు.1915 లో అతను చేసిన కృషి మరియు సమాజానికి చేసిన కృషికి బ్రిటిష్ వారిచే కమాండర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది ఇండియన్ ఎంపైర్ గా బిరుదు పొందాడు. 1955 లో ఇంజనీరింగ్ మరియు విద్యా రంగాలలో అతని నిరంతర కృషికి భారత ప్రభుత్వం భారతదేశ అత్యున్నత గౌరవం ' భారతరత్న 'తో సత్కరించింది.

అతను " ఆధునిక మైసూర్ రాష్ట్ర పితామహుడు " అని కూడా పిలువబడ్డాడు . అతను 1962 లో మరణించాడు. దేశం నేటికీ విపత్కరమైన ప్రకృతి వైపరీత్యాలు ఎదుర్కొన్నప్పుడు గుర్తొచ్చే ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య. ఆయన ఇంజనీరింగ్ నిర్మాణాలు ఉన్నంతకాలం విశ్వేశ్వరయ్య భారతీయుల మనసుల్లో చిరస్థాయిగా నిలిచే ఉంటారు.

**(నేడు ఇంజనీర్స్ డే)**



- సాగర్ల సత్తయ్య
7989117415

## తెలుగు సాహిత్య చరిత్రలో చెరిగిపోని సంతకం

# అలిశెట్టి ప్రభాకర్

మరణం నా చివరి చరణం కాదు అని మరణాన్నే భయటపెట్టిన కవి అతడు. కల్లోల జీవితాలను, కన్నీటి అక్షరాలుగా మార్చి న శక్తి అతడు.చెంప చెల్లుమనే లా, గుండెల్లో బాకు దించినట్టుగా అక్షర విస్పోటనం సృష్టించిన కవి అతడు.ఇంటర్ కూడా చదవకుండా పేద గుండెల్లోకి ఎంటరైన అభ్యుదయకవి అతడు.కడుపులో పేగులు మెలిపెట్టి న బాధను రెండు లైన్ల తో మినీ కవిత్వం గా మార్చిన నికార్సైన కవి ఆతడు.ఒక పూట బియ్యం ఉంటే రెండో పూట కవిత్వాన్ని తిని బతికిన కన్నీటి కవి అతడు.అతడు లేని వాడి కవి. కూడు గూడు గుడ్డ లేని వాడి కవి. కష్టజీవికి రెండు వైపులా కాపు కాసిన కవిఅతడు. కలర్ సినిమా గ్లామర్ ని కూడా కాలి ధూళి తో సమానంగా చూసిన కవి.పండిత కవుల పేరును తన కవిత్వంతో పలుచన చేసిన , బక్కపలచని కవి అతడు. అతని "కలం" విప్లవ నినాదం . అతని" పదం"ఒక అగ్నికణం. అతని వాక్యం ఒక ఆరిపోని రక్తరేఖ . భావకవిత్వానికి ఎన్నో నిద్రలేని రాత్రులు మిగిల్చిన నిద్రలేచిన కవి అతడు. నోటి నుంచి రక్తం కక్కుతున్నా సరే తన కవిత్వాన్ని "ఎర్రపావురాలు" ఎగరేసి, బతుకుపోరాటం నేర్పిన కవి. ఆ మినీ కవిత్వం పేరే అలిశెట్టి ప్రభాకర్.



నిజమైన నికార్సైన , మానవత్వం ఉన్న కవి అలిశెట్టి . ఉన్నత చదువులు చదవకపోయినా ఉన్నత వ్యక్తిత్వం ఉన్న కవి .పక్క వాళ్ళు ఎదుటివాళ్ళు కష్టపడితే తన కష్టంగానే భావించేవాడు అలిశెట్టి . అతని పేరే ఒక సంచలనం. మినీ కవిత కు చిరునామాఅతడు. ఉన్నత చదువు లేని ఒక యువకుడు , కళాశాల , పాఠశాల పాఠ్యపుస్తకాల్లో ఒక పాఠ్యాంశమై, చరిత్ర పుటల్లో తొలి పొద్దై వెలిగిన అలిశెట్టి ప్రభాకర్. జనవరి 12, 1954లో ఉద్యమాల పోరు గడ్డ జగిత్యాల జిల్లా లో అతి పేద కుటుంబంలో జన్మించాడు. చిత్రకారుడిగా జీవితం ప్రారంభించిన ప్రభాకర్ పండుగలు ప్రకృతి, సినీనటుల బొమ్మలను దినపత్రికలకు ఆర్ట్ వేస్తుండేవాడు . అప్పుడే జగిత్యాల "సాహితీ మిత్రదీప్తి " సంస్థ పరిచయం కావడంతో కవిత్వ రంగప్రవేశం చేశాడు.

జగిత్యాల లో సొంత ఇల్లు సోదరుడు ఉన్నా "స్టూడియో పూర్ణిమ" బాగా నడుస్తున్నా ఆ జీవితం అతనికి సంతృప్తినివ్వలేదు. బతకడం గొప్ప కాదు సమాజాన్ని బతికించడం గొప్ప. సమాజ కష్టాలే తన కష్టాలు గా భావించి కరీంనగర్లో "స్టూడియోశిల్పి" నెలకొల్పాడు..... అప్పుడు మొదలైంది అతని కన్నీటి కష్టాలు జీవితం.

కవిత్వం రాస్తే కవులు అవుతారని తెలుసు కానీ , ఖాకీల కన్నుల్లో నలుసవుతారని ,ప్రభుత్వాల గుండెల్లో ఫిరంగి గుండ్ల అవుతారని ,అతనికి తెలియదు . మిత్రులు వారించినా, కుటుంబీకులు భాద పడ్డా తన అంతరంగాన్ని నమ్మి కవిత్వాన్ని నెచ్చెలిగా ప్రేమించిన వాడు అలిశెట్టి.

ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఆరు సంవత్సరాలుగా "సిటీలైఫ్" పేరుతో 1425 మినీ కవితలు రాయడం అలిశెట్టి కే చెల్లింది. 418 కవితలను సిటీ లైఫ్ పేరుతో 1992లో అచ్చు వేశాడు ఆ రోజుల్లో కవితలు నాలుగు లైన్లు చదవడం కోసమే ఆంధ్రజ్యోతి దినపత్రిక కొనేవారు అంటే అతిశయోక్తి కానే కాదు. డబ్బును రోగిష్టి ఉమ్మడిగా భావించి మనుషుల్ని, డబ్బు మనుషుల్ని, ఈసడించుకున్నాడు అలిశెట్టి.

అలిశెట్టి తానెప్పుడూ కవిగా ప్రపంచానికి తెలియాలని ఆరాటం పడలేదు, ఆవేశం అంతకన్నా పడలేదు. సన్మానాల కోసం ఎవరి దగ్గర పడిగాపులు కాసి, సాగిలపడలేదు. సత్కారాల కోసం చీత్కరించినా, తుడుచుకొని పోయే మనిషి అంతకన్నా కాదు. అభిప్రాయ భేదాలు వస్తే మిత్రులను కోపగించుకొని పోయి తన మానాన తను కవితలు రాసుకునే వాడే కానీ ఎవరినీ దూషించే వాడు కాదు అలిశెట్టి ప్రభాకర్.

ప్రభాకర్ అంటేనే ప్రభవించే వెలుగు అని అర్థం. దానిని సార్థకం చేయాలనుకున్నాడు.కానీ తన చుట్టూ పొంచిఉన్న దేగ కళ్ళను గ్రహించలేకపోయాడు. అలిశెట్టి ఏదో ఒక రోజు తన లాంటి వారికి మార్గం దొరకక పోతుందా అని తపించే తత్వం గలవాడు. ఒకరోజు రాత్రిపూట పని ముగించుకుని ఇంటికి వెళ్తున్న ప్రభాకర్ , వెనుక ఇనుప బూట్ల చప్పుడు, కన్నుమూసి తెరిచేలోగా తన శరీరాన్ని నుగ్గు ,నుగ్గు చేశాయి. చేతికి విరిగిన కట్టు వేసుకొని మనసు వికలమై, కరకు రాతి గుండెలకు సమాధానం చెప్పలేక , మమకారం ఉన్న తన సొంత గూటిని వీడలేక చివరకు హైదరాబాద్ పయనం అయ్యాడు అలిశెట్టి. ఆ విధంగా విద్యానగర్లో తనుపెట్టిన స్టూడియో పేరే "స్టూడియో చిత్రలేఖ ". పదిమందికి ఉపయోగపడే చిత్రాలను కవిత్వాలను ఏకకాలంలో కొనసాగించాడు. సంస్కృత కవులు, భావ కవిత్వం రాసేవారు తట్టుకోలేక, ఇది కవిత్వం కాదని పొద్దుపోక రాసే పోకిరి రాతలనీ, బాహాటంగానే తమ విషాన్ని కక్కారు. తన కవిత్వం అచ్చువేసే ముద్రణ సంస్థలు లేక చార్టులపై కవిత్వాలను స్కెచ్ పెన్ తో రాసి వాటికి అనుగుణంగాచిత్రాలు గీసి కవిత్వ గ్యాలరీ నిర్వహించిన బక్కపలచని మహామనీషి అలిశెట్టి ప్రభాకర్. తన కవిత్వమే తన అండ, అదే తన నిలువెత్తు ఆయుధం ,ఆశయం, ఆకాంక్షగా బతికాడు. పాఠకులలో ఆలోచనా దృక్పథాన్ని, సామాజిక చైతన్యాన్ని రగిలించే మినీ కవిత్వానికి అసలుసిసలైన బ్రాండ్ గా ఎదిగాడు . యువకుల గుండెల్లో కవితాజ్యోతులు వెలిగించి కరదీపం అయ్యాడు. జగిత్యాల ను వదిలి హైదరాబాద్ వచ్చిన తొలినాళ్లలో బాధపడ్డారు,.

వ్యాపారం కోసం డబ్బులు సంపాదించడం కోసం కవిత్వాలు రాసే మనిషి కాదు ప్రభాకర్. కవి సమ్మేళనాల్లో కవిత్వం చదివితే సీట్లోంచి లేచి వెళ్ళిపోయే కాలంలో కూడా ప్రభాకర్ కవిత్వ ప్రదర్శనను వినడానికి , చూడడానికి ,విద్యార్థులు, సాహితీప్రియులు పుట్ట పగిలి చీమలు వచ్చినట్టుగా , తెలంగాణ ఉద్యమంలో వచ్చిన జనసంద్రంలా కవిత్వాన్ని ప్రేమించారంటే కవి ప్రభావం గుండె లోతుల్లో కి వెళ్ళి వారందర్నీ ప్రశ్నించింది అని చెప్పాలి.

కట్టె పుల్ల లాంటి కరములతో చటాక్ మాంసం లేని ఒక బక్క పల్చటి మనిషికి ఇంతటి ధైర్యం ఎక్కడిదని పోలీసుల్ని ఆశ్చర్యపోయేలా చేసింది అతని ధైర్యం . ఆ ధైర్యం పేరే కవిత్వం. అని పోలీసులు తెలుసు కున్నారు. కన్నీటిని కవిత్వంగా మలిచే సమయంలో కూడా సహచరి భాగ్యం ను నవ్వించిన వ్యక్తి అలిశెట్టి. మహమ్మారి చేత పోరాటం సాగించి అలసిపోయిన వ్యక్తి అలిశెట్టి. "ఒకే రోజు జయంతిని వర్ధంతిని జరుపుకునే అరుదైన కవి, అలిశెట్టి ప్రభాకర్. జనవరి 12 , 1954 లో జన్మించిన అతడు జనవరి 12 ,1993 లో మరణించాడు.

జయధీర్ తిరుమలరావు గారి మాటల్లో ఒకసారి అలిశెట్టి ని స్మరించుకుంటే...

"పేద వాడు కాదు, కానీ పేదరికాన్ని ఆహ్వానించిన వాడు అనారోగ్య గ్రస్తుడుకానీ వాడు కానీ ఆరోగ్యాన్ని చేజేతులా పోగొట్టుకున్న వాడు స్వీయజీవితాన్ని మండించి, సమాజానికి వెలుగులు అందించిన వాడు బాధితుల పక్షాన అక్షరాలను సాయుధం చేసిన వాడు.." అందుకే తెలంగాణా తెగువ, పోరాటం, ప్రశ్నించే తత్వం , బాధితుల పక్షాన నిలబడే కలం గా వెలుగొందిన అలిశెట్టి కవిత్వం అజరామరం . తెలుగు సాహిత్య చరిత్రలో చెరిగిపోని సంతకం అలిశెట్టి ప్రభాకర్.

-డా.మెంతబోయిన సైదులు
9010910956

## వ్యాసాలు, కవితలకు ఆహ్వానం

**విశ్వంభర ఎడిటోరియల్ పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను, కవితలను ఆహ్వానిస్తున్నాం. ఈ కింది చిరునామాకు పోస్టులో లేదా ఈ-మెయిల్ ద్వారా పంపించగలరు. మీ వ్యాసం 1000 పదాలకు మించకుండా ఉండాలి. తెలుగు యునీకోడ్‌లో టైప్ చేసి పంపిన వాటికి ప్రాధాన్యం ఉంటుంది. రచయితలు విశ్వంభరకు మాత్రమే పంపుతున్నామని హామీపత్రం జత చేయాలి.**

**చిరునామా:**
V3 న్యూస్, విశ్వంభర తెలుగు దినప్రతిక కార్యాలయం, ప్లాట్ నంబర్ 204, రెండో అంతస్తు, బాదం కాంప్లెక్స్, మెట్రో పిల్లర్ నంబర్ 1560 ఎదురుగా, చైతన్యపురి ఎక్స్ రోడ్డు, హైదరాబాద్-500060

ఈ-మెయిల్: editpagevishwambhara@gmail.com
ఇతర వివరాలకు సెల్ నం: 9441222429 సంప్రదించగలరు.

# పాలమూరు ఎత్తిపోతల పూర్తి చేస్తే..
# కేసీఆర్‌కు పేరొస్తుంది

(మొదటి పేజీ తరువాయి)
ఆ పనులు నిలిపివేశాడని కేటీఆర్ ధ్వజమెత్తారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతలను కేసీఆర్ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టారు. వలసల జిల్లాగా పేరుపడ్డ పాలమూరును పచ్చగా చేయాలని చెప్పి పెండింగ్ ప్రాజెక్టులను శరవేగంగా రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కేసీఆర్ 8 లక్షల ఎకరాలకు నీళ్లు అందించారు. పాలమూరు జిల్లా శాశ్వతంగా ధాన్య భాండాగారంగా కావాలన్న ఉద్దేశంతో పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టును తీసుకున్నాం. కరివెన, ఉద్దండపూర్, ఏదుల, వట్టెం, నార్లపూర్ రిజర్వాయర్లు పూర్తయ్యాయి. పూర్తి కావడమే కాకుండా కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు నార్లాపూర్ వద్ద ఒక పంపు ఆన్ చేసి నీళ్లు వదిలారు. 95 శాతం పని పూర్తయింది. అక్కడక్కడ కాల్వల కోసం భూసేకరణ పని చేయాలి రేవంత్ రెడ్డి. కాల్వల భూసేకరణ కోసం ఆ టెండర్ మనమే పిలిచాం.. కానీ వీరు రద్దు చేశారు. కొల్లాపూర్ నుంచి జడ్చర్ల వరకు అన్ని పనులు పూర్తయ్యాయి. మిగిలిన 5 శాతం పనులు పూర్తి చేస్తే నీళ్లు వస్తాయి. నీళ్ల కోసం ఆశతో ప్రజలు ఉన్నారు. 95 శాతం పనులు పూర్తయిన పాలమూరు ఎత్తిపోతలను రేవంత్ రెడ్డి ఎందుకు పట్టించుకోవడం లేదు..? ఆ ప్రాజెక్టును పూర్తి చేస్తే కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందనే భయం ఉందా..? ప్రతి నీటి చుక్కలో కేసీఆర్‌ను చూసుకుంటారని భయపడుతున్నావా..? నీ బాధ.. భయం ఏంది..? పదేపదే పాలమూరు



బిడ్డను అని చెప్పుకునే నీకు పాలమూరు మీద ఎందుకు ప్రేమ లేదని రేవంత్ రెడ్డిని కేటీఆర్ నిలదీశారు.

**దొంగలు.. దొంగలు కలిసి ఊర్లు పంచుకున్నట్టు..**

నిజంగా నీవు పాలమూరు బిడ్డవు అయితే దీనికి సమాధానం చెప్పు. హైదరాబాద్ నగరానికి తాగు నీరందించే సుంకిశాల ప్రాజెక్టు వద్ద ప్రమాదం జరిగింది. ఆ ప్రాజెక్టు పనులు చేపట్టిన మేఘా ఇంజినీరింగ్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని ప్రతిపక్షంగా డిమాండ్ చేశాం. విచారణ చేయించండి.. ఒక్క వర్క్ కూడా ఇవ్వొద్దు అని చెప్పాం. అధికారుల మీద చర్యలు తీసుకుని వారిని బలి పశువులను చేయకండి అని కూడా చెప్పాం. ఇప్పటి వరకు మేఘా ఇంజినీరింగ్ మీద చర్య తీసుకోలేదు. ఇక నెల రోజుల కింద ఒక మాట చెప్పాను. కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును మేఘాకు కట్టబెడుతారని.. ఈ రోజు పొద్దున అదే వార్తలు వచ్చాయి.. దొంగలు దొంగలు కలిసి ఊర్లు పంచుకున్నట్టు.. రూ. 4350 కోట్ల ప్రాజెక్టును రూ. 80 కోట్ల నష్టం చేసినా మేఘా ఇంజినీరింగ్‌కు కట్టబెట్టారు. రూ. 4350 కోట్ల కాంట్రాక్ట్‌లో సగం మేఘా ఇంజినీరింగ్‌కు, మరో సగం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు అప్పజెప్పారు. మరి గతంలో ఆంధ్రా కాంట్రాక్టర్లకు కాంట్రాక్టులు ఇస్తున్నారని మాట్లాడిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడు చెంపలు వేసుకుని తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలి. మేఘాను ఈస్ట్ ఇండియా కంపెనీ అని తిట్టి.. నేడు అదే సంస్థకు కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కట్టబెట్టడం దారుణం. నీ రంగు, నీ నైజం బయటపడింది. ఈ ఆశించి చేస్తున్నావు అని రేవంత్ రెడ్డిని కేటీఆర్ ప్రశ్నించారు.

**పాలమూరు ఎత్తిపోతల పర్యటనకు బయల్దేరుతాం..**

కేసీఆర్ అనుమతితో.. మేడిగడ్డను సందర్శించినట్టే.. బీఆర్ఎస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులమంతా.. పాలమూరు ఎత్తిపోతల పర్యటనకు బయల్దేరుతాం. పాలమూరు ప్రజలకు వాస్తవాలను వివరిస్తాం. పాలమూరు బిడ్డలకు చేతులు జోడించి నమస్కరిస్తున్నా.. నీళ్లు వస్తాయనే ఆశతో రైతులు తమ భూములను ఇచ్చారు. ఇప్పుడు పనులు పూర్తైన కూడా నీళ్లు ఇవ్వడం లేదు. త్వరలోనే పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టును సందర్శిస్తాం. రెండు రోజుల పాటు పర్యటించి ప్రతి పంప్ హౌస్‌ను ప్రజలకు చూపిస్తాం. గత 9 నెలలుగా ఈ ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం తొక్కి పెడుతోంది.. నీళ్లు రాకుండా చేస్తుంది అని కేటీఆర్ మండిపడ్డారు.

## వ్యవసాయ మోటార్లకు సోలార్ పంపుసెట్లు

(మొదటి పేజీ తరువాయి)
రుణమాఫీ అంశంలో వెనకడుగు వేయం. పంటల బీమా ప్రీమియంను రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుంది.

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి నాణ్యమైన విద్యుత్ ఇస్తున్నాం. వ్యవసాయ మోటార్లకు సోలార్ పంపుసెట్లు పెట్టబోతున్నాం. ప్రయోగాత్మకంగా రాష్ట్రవ్యాప్తంగా 30 నుంచి 40 గ్రామాల్లో చేపట్టబోతున్నాం. సోలార్ పవర్తో రైతులకు ఉచితంగా విద్యుత్ పొందడమే కాకుండా ఆదాయం సమకూర్చుకునే అవకాశం ఉంది. ప్రభుత్వ ఖర్చుతో ఇళ్లకు సౌర విద్యుత్ సౌకర్యం కల్పిస్తాం. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు విదేశాలకు వెళ్లి పరిశ్రమల ఏర్పాటు కోసం రూ.36 వేల కోట్ల ఎంవోయూలు చేసుకున్నారు" అని తెలిపారు.అర్హులైన రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేసి తీరుతామని మంత్రి శ్రీధర్ బాబు పునరుద్ఘాటించారు. సాంకేతిక సమస్యలతో కొందరికి రుణమాఫీ కాలేదని అన్నారు. రూ. లక్ష రుణమాఫీ చేసేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఐదేళ్ల సమయం తీసుకుందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒకే దఫాలో రూ.2 లక్షల రుణమాఫీ చేసినట్లు గుర్తు చేశారు. గురువారం ఇద్దరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఘర్షణ పడిన విషయాన్ని గుర్తు చేస్తూ.. దానిని కాంగ్రెస్ కు అంటగడుతున్నారని మండిపడ్డారు.

## బాధ్యతగల ఎమ్మెల్యేలు బజారున పడి తన్నుకోవడం బాధ కలిగించింది: భట్టి

**కరీంనగర్:** బాధ్యతగల ఎమ్మెల్యేలు బజారున పడి తన్నుకోవడం బాధ కలిగించిందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. శనివారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా పర్యటన సందర్భంగా.. ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, అరెకపూడి గాంధీ వ్యవహారంపై స్పందించారు. ఎమ్మెల్యేలు రోడ్డెక్కి కొట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ప్రభుత్వం ఏం చేయాలో అది చేస్తుందన్నారు. "ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాన్ని గౌరవించాలని ఉపేక్షించాం. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసింది. ప్రతిపక్ష హోదా లేకుండా సీఎల్పీ సీటును సైతం గుంజుకున్నారు. వాళ్ల మాదిరిగా మేము ప్రవర్తించడం లేదు. అసెంబ్లీలో ప్రతిపక్షం గొంతు వినిపించాలని కోరుకుంటున్నాం. ప్రతిపక్ష నేతలంటే మాకు గౌరవం ఉంది. అసెంబ్లీలో అధికార పార్టీ ఎవరో.. ప్రతిపక్ష పార్టీ ఎవరో స్పీకర్ వెల్లడించారు. శాంతిభద్రతలు కాపాడటం మా ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత. బీజేపీ ఉనికి కోసం రాజకీయ డ్రామాలు ఆడుతోంది" అని భట్టి విక్రమార్క విమర్శించారు.

## కాంగ్రెస్‌ను విమర్శించినా సంతోషంగా అనిపించేది



**హైదరాబాద్:** అన్ని మతాలు చెప్పింది ఒక్కటేనని, అందరం కలిసిమెలసి శాంతియుతంగా ఈ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. హైదరాబాద్ లోని ఆరాంఘర్లో రచయిత మౌలానా రెహమాన్ రాసిన 'ప్రొఫెట్ ఫర్ ద వరల్డ్' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఇది అందరూ చదవాల్సిన పుస్తకమన్నారు. ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ బోర్డు అధ్యక్షుడు మన నగరవాసి కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. "అశోక్, నేను లోక్ సభకు ప్రాతినిధ్యం వహిస్తున్నప్పుడు ఆయన గిరిజనులు, మైనార్టీల గురించి మాట్లాడుతుంటే చాలా సంతోషంగా ఉండేది. అసదుద్దీన్ ఓవైసీ కొన్నిసార్లు కాంగ్రెస్ ను విమర్శించినా సంతోషంగా అనిపించేది. ఎందుకంటే విమర్శించేది నా సోదరుడే కాబట్టి. ప్రస్తుతం లోక్ సభలో ప్రజల గొంతు వినిపించే వారు తక్కువగా ఉన్నారు. జైపాల్‌రెడ్డి లాంటి నాయకులు ఇప్పుడు లేరు. ఎన్నికల సమయంలోనే అసద్ భాయ్ కొట్లాట. ఆ తర్వాత నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు మంచి చేయడమే మా లక్ష్యం. నగర అభివృద్ధికి కలిసి పని చేయాలి. మూసీ నదిలోకి నగరంలోని చెత్తంతా వస్తోంది. దాని ప్రక్షాళనకు మీ సూచనలు స్వీకరిస్తాం" అని రేవంత్ రెడ్డి అన్నారు.

## దేశం మొత్తం ఆంధ్రప్రదేశ్ వైపు చూసేలా..

**విశ్వంభర, విజయవాడ:** గన్నవరం విమానాశ్రయం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెడతామని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. గన్నవరం విమానాశ్రయంలో అప్రోచ్ రహదారిని, విజయవాడ-దిల్లీ ఇండిగో సర్వీసును ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. 3 నెలల్లోనే 4 కొత్త సర్వీసులు ఏర్పాటు చేసుకున్నామన్నారు. అక్టోబర్ 27న విశాఖ- దిల్లీకి సర్వీసు ప్రారంభించనున్నట్లు చెప్పారు. షార్జాకు ప్రస్తుతం సర్వీసులు నడుస్తున్నాయని పేర్కొన్నారు. దుబాయ్, సింగపూర్ కు విస్తరించనున్నట్లు చెప్పారు."దేశం మొత్తం ఆంధ్రప్రదేశ్ వైపు చూసేలా కనెక్టివిటీని పెంచుతున్నాం. రాష్ట్రంలో ప్రయాణికుల సంఖ్య మరింత పెంచేందుకు కృషి చేస్తున్నాం. అక్టోబర్ 26న విజయవాడ నుంచి పుణెకు కొత్త సర్వీసు ప్రారంభించనున్నాం. ఏడాదిలోగా గన్నవరం ఎయిర్‌పోర్టు కొత్త టెర్మినల్ ప్రారంభిస్తాం. దేశంలో కొత్తగా మరో 200 విమానాశ్రయాల ఏర్పాటు లక్ష్యంగా కృషి చేస్తున్నాం" అని రామ్మోహన్ నాయుడు తెలిపారు.

## 20న కేబినెట్ భేటీ

(మొదటి పేజీ తరువాయి)
రాష్ట్రంలో వరదలు, కేంద్ర ప్రభుత్వ సాయంపై చర్చించనున్నారు. అదేవిధంగా హైడ్రా పని విధానం, హైడ్రా చట్టబద్ధతకు ఆర్డినెన్స్ తీసుకొచ్చే అంశంపై చర్చిస్తారు. బీసీ రిజర్వేషన్, కులగణన, 200 పంచాయతీయల ఏర్పాటుపై ఆర్డినెన్స్ తీసుకొచ్చే అంశం చర్చకు రానుంది. దీంతోపాటు రుణమాఫీ, రైతుభరోసాపై మంత్రివర్గం చర్చించే అవకాశం ఉంది.

## రాష్ట్ర వ్యాప్తంగా 773 చోట్ల కాల్వలు, చెరువులకు గండ్లు



**విశ్వంభర, హైదరాబాద్ :** రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న చెరువులు, కాల్వలకు తెలంగాణ నీటిపారుదలశాఖ యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులతోపాటు శాశ్వత పునరుద్ధరణ దిశగా చర్యలు వేగవంతం చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 773 చోట్ల కాల్వలు, చెరువులకు గండ్లు పడినట్టు గుర్తించారు. అందులో చిన్న నీటిపారుదల పరిధిలోని చెరువులకు 265 చోట్ల గండ్లు పడగా.. 285 చెరువులు దెబ్బతిన్నాయి. అదే విధంగా భారీ నీటిపారుదలతోపాటు మధ్యతరహా ప్రాజెక్టులకు చెందిన కాల్వలకు 132 చోట్ల గండ్లు పడగా.. 83 చోట్ల దెబ్బతిన్నాయి. నాగర్కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామ సమీపంలోని పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి సంబంధించిన వట్టెం పంప్ హౌస్ లోకి వరదనీరు చేరింది. ఖమ్మం జిల్లాలోనూ వరద ప్రభావంతో భక్త రామదాసు ఎత్తిపోతల పథకం పంప్ హౌస్ మునిగిపోయి అందులోని పరికరాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. చెరువులు, కాలువలు, పంప్ హౌజ్లు, చెక్ డ్యామ్లు పునరుద్ధరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 45వ జీవో ద్వారా నిధులు మంజూరు చేసింది. అంచనాల తయారీ, పరిపాలనా అనుమతులు, ఆర్థిక అనుమతుల్లో ఎక్కడా జాప్యం జరగకుండా ఉండేందుకు సీఎం రేవంత్ రెడ్డితో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సంప్రదింపులు జరిపి, నిర్ణీత వ్యవధిలో పునరుద్ధరణ పనులు వేగవంతమయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు నీటిపారుదలశాఖ తెలిపింది. ఖరీఫ్ పంటను కాపాడటంతోపాటు నీటి సరఫరాను కొనసాగించేందుకు చర్యలతోపాటు పూర్తి స్థాయిలో నష్టం అంచనాలను రూపొందించినట్లు వివరించింది. తాత్కాలిక మరమ్మతులకు రూ.75 కోట్లు, శాశ్వత పునరుద్ధరణకు రూ.483 కోట్లు అవసరమవుతాయని అంచనా వేశారు. ఆ అంచనాలతో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రప్రభుత్వానికి నివేదిక అందించింది. నీటిపారుదల శాఖ పరిధిలో జరిగిన నష్టానికి సాయం అందించాలని కేంద్రాన్ని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న భారీ, మధ్య తరహా 94 ప్రాజెక్టుల్లో నీటినిల్వలు పూర్తి స్థాయి సామర్థ్యానికి చేరుకున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా తాత్కాలిక మరమ్మతులతో పాటు శాశ్వత పునరుద్ధరణ పనులు యుద్ధ ప్రాతిపదికన జరగాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

## తెలంగాణ పామ్ ఆయిల్ రైతులకు భారీ ఊరట

**విశ్వంభర, హైదరాబాద్:** కేంద్ర ప్రభుత్వం ముడిపామ్ ఆయిల్ దిగుమతిపై సుంకాన్ని 5.5 % నుండి 27.5 % కు పెంచుతూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసిన సందర్భంగా కేంద్ర వ్యవసాయశాఖ మంత్రివర్యులు శివరాజ్ సింగ్ చౌహన్ కు రాష్ట్ర పామ్ ఆయిల్ రైతుల తరఫున మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలియజేశారు. గతంలో ముడిపామ్ ఆయిల్ దిగుమతిపై సుంకం ఎత్తివేయడం వలన ఆయిల్ పామ్ గెలల ధర తగ్గి రైతులు నిరాశ పడడమే కాకుండా, కొత్తగా ఆయిల్ పామ్ వైపు సాగు వేయాలనుకున్న రైతులపై ప్రతికూల ప్రభావం చూపించిందని మంత్రి పేర్కొన్నారు. ఇది దృష్టిలో ఉంచుకుని, రైతులకు అధిక ధరలను అందించి, రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగును లాభసాటిగా చేసి కొత్త రైతులను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో, ముడిపామ్ ఆయిల్ పై దిగుమతి సుంకాన్ని తిరిగి విధించి దేశీయ పామ్ ఆయిల్ రైతులను ఆదుకొనేవిధంగా చర్యలను తీసుకోవాలని ఇటీవల లేఖ ద్వారా మంత్రి తుమ్మల కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఇటీవల మన రాష్ట్రానికి విచ్చేసిన కేంద్రవ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్ కి ఈ విషయంపై మంత్రితుమ్మలతో పాటు ఆయిల్ పామ్ రైతులు కూడా ఈ విషయంపై తగిన చర్యలు తీసుకోవాలని కోరడం జరిగింది. మంత్రి చొరవతో సెప్టెంబర్ 13 న కేంద్ర ప్రభుత్వం ముడిపామ్ ఆయిల్ దిగుమతిపై సుంకాన్ని 5.5 % నుండి 27.5 % కు పెంచుతూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. దీనివలన ప్రస్తుతం టన్నుకు రూ. 14,392/-గా ఉన్న ఆయిల్ పామ్ గెలల ధర టన్నుకు కనీసంగా రూ. 1500/- నుండి రూ. 1700/- వరకు పెరిగి టన్ను ఆయిల్ పామ్ గెలల ధర రూ. 16,500/- దాటే అవకాశం ఉందని మంత్రి తెలిపారు.ప్రస్తుతం రాష్ట్రంలో 44,400 ఎకరాల పామ్ ఆయిల్ తోటల నుండి 2.80 లక్షల టన్నుల ఆయిల్ పామ్ గెలల దిగుబడి రావడం జరుగుతుంది. ఈ దిగుమతి సుంకం పెంచడం వలన 9,366 మంది ఆయిల్ పామ్ రైతులకు అదనంగా లబ్ధి చేకూరే అవకాశం ఉందని పేర్కొన్నారు. పామ్ ఆయిల్ దిగుమతిపై భారత ప్రభుత్వానికి సంవత్సరానికి 80 వేల కోట్ల రూపాయల విదేశీమారక ద్రవ్యం ఖర్చవుతుందని, దిగుమతి సుంకాలు విధించడం వలన దేశంలోని పామ్ ఆయిల్ రైతులు, ముఖ్యంగా తెలంగాణ పామ్ ఆయిల్ రైతులు ప్రయోజనం పొందుతారని, అంతేకాకుండా గెలల ధరల పెరుగుదల వలన నూతనంగా రైతులు పామ్ ఆయిల్ వైపు మొగ్గు చూపే అవకాశం ఏర్పడనుందని మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వంటనూనెల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించడానికి భారత ప్రభుత్వం 1992 నుండి వివిధ కార్యక్రమాల ద్వారా ఆయిల్ పామ్ అభివృద్ధిని ప్రోత్సహిస్తోందని, ప్రస్తుతము, రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగు, కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత కార్యక్రమము అయినటువంటి నేషనల్ మిషన్ ఆన్ఎడిబుల్ ఆయిల్స్– ఆయిల్పామ్ ద్వారా అమలు చేయబడుతుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం (31) జిల్లాల్లో ఆయిల్ పామ్ సాగు విస్తరణ చేపట్టేందుకు (14) కంపెనీలకు అనుమతులివ్వడం జరిగిందని, ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో సుమారు 2.00 లక్షల ఎకరాలను ఆయిల్ పామ్ సాగు కిందకు తీసుకురావడమైందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వలన ఆయిల్ పామ్ గెలల ధర పెరుగుతుందని, అలాగే రాష్ట్రంలో పెరిగిన పంట మార్పిడి ఆవశ్యకత దృష్ట్యా, తెలంగాణ రాష్ట్రంలో పామ్ ఆయిల్ సాగును పెద్ద ఎత్తున చేపట్టుటకు ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. ఇందుకోసం ఆయిల్ పామ్ కంపెనీలు రాష్ట్రవ్యాప్తంగా (44) నర్సరీలు ఏర్పాటుచేశాయన్నారు. ఈ అవకాశాన్ని రాష్ట్ర రైతులు సద్వినియోగం చేసుకుని, రైతులు భారీగా పామ్ ఆయిల్ సాగు చేయాలని మంత్రి కోరారు.

## 20వేల మందితో పోలీస్ బందోబస్తు

**విశ్వంభర, హైదరాబాద్:** అన్ని ప్రభుత్వ విభాగాల సమన్వయంతో నగరంలో గణేష్ నిమజ్జన ఉత్సవాలను విజయవంతం చేస్తామని రాష్ట్ర డీజీపీ జితేందర్ వెల్లడించారు. శనివారం రాష్ట్ర పోలీసు యంత్రాంగం, జీహెచ్ఎంసీ అధికారులు బాలాపూర్ గణనాథుణ్ని దర్శించుకున్నారు. వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాలాపూర్ ఉత్సవ సమితి సభ్యులు అధికారులను శాలువాలతో సన్మానించారు. అనంతరం బాలాపూర్ నుంచి ట్యాంక్ బండ్ వరకు మార్గాన్ని డీజీపీ జితేందర్, హైదరాబాద్ సీపీ, రాచకొండ సీపీలతో పాటు పలు శాఖల ఉన్నతాధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర డీజీపీ జితేందర్ రెడ్డి మాట్లాడుతూ నగరంలో గణేష్ నిమజ్జనాల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశామని ఆయన పేర్కొన్నారు. నగరంలో బాలాపూర్ గణనాథుడి నిమజ్జనం కోసం రూట్ మ్యాప్ సిద్ధం చేశామని డీజీపీ జితేందర్‌రెడ్డి వెల్లడించారు. గత ఏడాది కంటే ఈసారి బాగా చేస్తామని నమ్మకం ఉందని ఆయన వివరించారు. గత సంవత్సరం నిమజ్జన ఉత్సవాలు ఎలా జరిపామో అదే విధంగా ప్రణాళికను సిద్ధం చేసి ఫాలో అవుతున్నామన్నారు. ఇందుకోసం 20వేల పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఖైరతాబాద్ గణేషుడి నిమజ్జనం మధ్యాహ్నం 1.30 లోపు నిమజ్జనం పూర్తి అవుతుందని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. సెప్టెంబర్ 17న ఉదయం 6 గంటలకే పూజలు అన్ని పూర్తి చేసుకొని తరలించే విధంగా ప్రణాళిక సిద్ధం చేశామని వివరించారు. అదే రోజు తెలంగాణ విమోచన దినోత్సవం ఉన్నందున అదనపు బలగాలను బందోబస్తులో ఉంచనున్నట్లు తెలిపారు. మరోవైపు బొజ్జ గణపయ్య నిమజ్జనం వేళ మద్యం దుకాణాలు మూసేయాలని పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 17 ఉదయం 6 గంటల నుంచి 18వ తేదీ సాయంత్రం 6 గంటల వరకూ ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని తెలిపారు. మద్యం, కల్లు దుకాణాలు, బార్లు అన్నింటికీ రూల్స్ వర్తిస్తాయని స్పష్టం చేశారు. గణేశ్ నిమజ్జనం, మిలాద్-ఉన్-నబీ ఊరేగింపులు సజావుగా ముగిసేందుకు ధైర్యంగా, స్వేచ్ఛగా పనిచేయాలని అధికారులకు సూచించారు.

## హైడ్రాకు విశేష అధికారాలు రాబోతున్నాయి

(మొదటి పేజీ తరువాయి)
జీవో 99 ద్వారా జులై 19న హైడ్రా ఏర్పాటు చేశారని కమిషనర్ రంగనాథ్ తెలిపారు. హైడ్రా చట్టబద్ధతను ప్రశ్నిస్తూ కొంతమంది న్యాయస్థానాలను ఆశ్రయించారని పేర్కొన్నారు. ప్లానింగ్ కమిషన్, క్యాబినెట్ సెక్రటేరియెట్, లా కమిషన్, ఏసీబీ, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తరహాలోనే ఎగ్జిక్యూటివ్ రిజల్యూషన్‌తో హైడ్రాను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. "హైడ్రా చట్టబద్ధతపై కొందరు ప్రశ్నిస్తున్నారు.. ఇది చట్టబద్ధమైనదే. కార్యనిర్వాహక తీర్మానం ద్వారానే ఏర్పాటు చేశారు.దీనికి చట్టబద్ధత కల్పిస్తూ అక్టోబర్ నెల లోపు ఆర్డినెన్స్ రానుంది. విశేష అధికారాలు కూడా రాబోతున్నాయి.అయితే ఆర్డినెన్స్ వచ్చాక ఆరు వారాల్లో ప్రభుత్వ అసెంబ్లీలో హైడ్రా బిల్లు ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నాయని రంగనాథ్ వెల్లడించారు. ఈ క్రమంలో హైడ్రా ఎవరికి నోటీసులు ఇవ్వడం లేదని పునరుద్ఘాటించిన ఆయన టాస్క్ ఫోర్స్, గ్రే హౌండ్స్ తరహాలో హైడ్రా పనిచేస్తుందని తెలిపారు. మున్సిపాల్టీలు, నీటిపారుదల, రెవెన్యూ శాఖలకు హైడ్రా సహకారంగా ఉంటుందని తెలిపారు.



**త్వరలోనే హైడ్రా పరిధి మరింత విస్తరించేలా..**

ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌ల పైన ప్రజలు అవగాహన తెచ్చుకుంటున్నారన్న హైడ్రా కమిషనర్, వాటి పరిధిలోని భూములను కొనుగోలు చేయకుండా అప్రమత్తమవుతారని తెలిపారు. ఎఫ్‌టీఎల్ పరిధిలోని అక్రమ నిర్మాణాలు కూల్చేందుకు నోటీసులు అవసరం లేదని పలు సందర్భాల్లో కోర్టులు చెప్పాయన్న రంగనాథ్, అందుకు చట్టాలు సైతం ఉన్నాయన్నారు. కొంతమంది పలుకుబడి ఉపయోగించి అనుమతుల ముసుగు తొడిగిన అక్రమ నిర్మాణాలను సైతం వదిలిపెట్టబోమని హెచ్చరించారు.

**20న క్యాబినెట్ భేటీ.. హైడ్రా ఆర్డినెన్స్‌కు చట్టబద్ధత!**

మంత్రివర్గం సమావేశం ఈ నెల 20న జరుగనుంది. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో మంత్రిమండలి భేటీ అవుతుంది. హైడ్రా పని విధానం, హైడ్రా చట్టబద్ధతకు ఆర్డినెన్స్ తీసుకొచ్చే అంశంపై చర్చిస్తారు.

## ఈ ఎన్నికలు జమ్మూకశ్మీర్ భవిష్యత్తును నిర్ణయిస్తాయి

(మొదటి పేజీ తరువాయి)
మన జమ్మూకశ్మీర్ను విదేశీ శక్తులు లక్ష్యంగా చేసుకున్నాయి. ఆ తర్వాత ఈ ప్రాంతాన్ని పరివారవాదులు వంచన చేయడం ప్రారంభించారు. మీరు విశ్వసించిన రాజకీయపార్టీలు మీ పిల్లల భవిష్యత్తును పట్టిం చుకోలేదు. వారు వారి వారసుల భవిష్యత్తుపైనే దృష్టిసారించారు. జమ్మూకశ్మీర్ యువత ఉగ్రవాదంతో బాధపడింది. ఈ వారసత్వ పార్టీలు మిమ్మల్ని తప్పుదోవ పట్టించి, వేడుక చూశాయి. 2000 సంవత్సరం నుంచి ఇక్కడ పంచాయతీ ఎన్నికలు జరగలేదన్న సంగతి మీకు తెలిసిందే. కొత్త నేతలకు అవకాశం ఇవ్వలేదు. అందుకే కొత్తనాయకత్వాన్ని మీ ముందుకు తీసుకురావాలని ప్రయత్నించాను. తర్వాత వరుసగా స్థానిక సంస్థల ఎన్నికలు జరిగాయి. ప్రజాస్వామ్యాన్ని క్షేత్రస్థాయికి చేర్చడమే ఈ ఎన్నికల అసలు లక్ష్యం. ఈ ప్రాంతంలో అప్రకటిత కర్ఫ్యూలు ఉండేవని మీకు తెలుసు. లాల్‌చౌక్ వద్దకు వెళ్లాలంటే భయపడేవారు. కాంగ్రెస్ హయాంలో కేంద్రంలో హోంమంత్రిగా పనిచేసిన వ్యక్తి కూడా అక్కడకు వెళ్లలేని పరిస్థితి ఉండేది. ఆ రోజులు ముగిశాయి" అని మోదీ మాట్లాడారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన అభివృద్ధి కార్యక్రమాల గురించి వెల్లడించారు. పలు హామీలను ప్రకటించారు.

'ఇదిలా ఉంటే.. కేంద్ర పాలిత ప్రాంతం జమ్మూకశ్మీర్ లో మరో నాలుగు రోజుల్లో అసెంబ్లీ ఎన్నికలు ప్రారంభం కానున్న తరుణంలో.. వరుసగా ఉగ్రదాడులు, ఎన్కౌంటర్లు చోటుచేసుకోవడం తీవ్ర కలకలం రేపుతోంది. కిష్త్వాడ్, ఉధంపూర్, పూంఛ్, రాజౌరీ జిల్లాల్లో యాంటీ టెర్రర్ ఆపరేషన్లను మరింత పెంచినట్లు భద్రతా బలగాలు వెల్లడించాయి. ఈ ప్రాంతాల్లో వరుసగా రెండోరోజు గాలింపుచర్యలు కొనసాగుతున్నట్లు పేర్కొన్నాయి. గత 42 ఏళ్లలో భారత ప్రధాని ఈ జిల్లాలో ఎన్నికల ప్రచారానికి వెళ్లడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.జమ్మూకశ్మీర్ లో సెప్టెంబరు 18న తొలివిడత పోలింగ్ జరగనుంది. చీనాబ్ లోయలోని కిష్త్వాడ్, రాంబన్, దోడాతో పాటు దక్షిణ కశ్మీర్ జిల్లాల్లోని మొత్తం 24 స్థానాలకు పోలింగ్ జరగనుంది.



# వరద భాదితులకు జర్నలిస్ట్‌ల సాయం



**విశ్వంభర,మహబూబాబాద్:** వరదప్రభావముతో తల్లడిల్లిపోయిన ప్రాంతాలను, ప్రజలను ఆదుకునేందుకు ప్రతిఒక్కరు స్పందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన పిలుపుతో మహబూబాబాద్ జిల్లా టియుడబ్ల్యూజే(ఐజేయు) యూనియన్ జిల్లాఅధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్ స్పందించారు. జర్నలిస్ట్ లుగా బాదలో ఉన్న జనంకోసం ఎంతచేతనయితే అంత ఆర్థికసహాయం చేయాలని యూనియన్ బాద్యులను, సభ్యులను కోరారు. 91మంది యూనియన్ సభ్యులు స్పందించి ఎవరి శక్తిమేరకు వారు ఆర్థికచేయూతను అందించారు. మొత్తం రూ. 60,500/-లు సమీకరించగా, అందులో రూ.10వేలు వరదతాకిడికి గురైన ఇద్దరు జర్నలిస్ట్ లకు అందించి, మిగతా రూ.50,500/- లను ముఖ్యమంత్రి సహాయనిధి పేరిట డిడి తీసి ఆ డిడి ని శుక్రవారం మహబూబాబాద్ జిల్లాకలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ కు అంజేసారు. టియు డబ్ల్యూజే(ఐజేయు) మహబూబాబాద్ జిల్లాఅధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్, జిల్లాప్రధానకార్యదర్శి గాడిపల్లి శ్రీహరి, జిల్లాఉపాధ్య క్షుడు ఉమ్మగాని మధు, జిల్లాసహాయకార్యదర్శి జిన్న లచ్చయ్య, మరిపెడ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రియాజ్ పాషా, యూనియన్ బాద్యులు పిడమర్తి ఉపేందర్, యువరాజ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**యూనియన్ సభ్యులను అభినందించిన కలెక్టర్..**

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలనే సంకల్పంతో టియుడబ్ల్యూజే(ఐజేయు) ఆద్వర్యంలో జర్నలిస్ట్ లు చేసిన ఈ కార్యక్రమం అభినందనీయమని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ప్రశంసించారు. ప్రతి ఒక్కరూ స్పందించి సహాయం చేయాలని కోరారు. ఈ..సందర్భంగా యూనియన్ జిల్లాఅధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. వార్త సేకరణకు వెల్లిన సందర్భంలో కనిపించిన వరదబాదితుల కష్టాలు కంటతడి పెట్టించాయని, జర్నలిస్టల ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రమే అయినా.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపుతో స్పందించి ఎంతో కొంత సహాయం చేయాలనే ఆలోచనతో చేపట్టామని, తాము చేసింది చిన్నసహాయమే అయినా ఎంతో సంతృప్తిని ఇచ్చిందన్నారు.

## పోలీస్, డాక్టర్స్, ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్



**విశ్వంభర,మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని స్థానిక ఎన్టీఆర్ మైదనంలో పోలీస్ వర్సెస్ డాక్టర్స్ మధ్య నిర్వహించిన ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ ను జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాధ్ కేకన్ ఐపీఎస్ ప్రారంభించారు. టాస్ గెలిచిన పోలీస్ జట్టు మొదటగా బ్యాటింగ్ చేపట్టారు. మొదట బ్యాటింగ్ చేసిన పోలీస్ జట్టు నిర్ణీత 15 ఓవర్లకు 5 వికెట్స్ కోల్పోయి 125 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన డాక్టర్స్ జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 9వికెట్స్‌ను కోల్పోయి 77పరుగులు చేయడంతోపోలీస్ జట్టు విజయం సాధించింది.

## దాతల సహకారంతో సాయం



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రం రాం నగర్ కాలనీలోని నిరుపేద కుటుంబానికి చెందిన దుంప ఎల్లయ్య ఇటీవల (గత సోమవారం)మృతి చెందాడు. ఈ కుటుంభం దీన పరిస్థితిని వాట్సాప్ ద్వారా చూసి దాతలు సహకరించి విరాళాలు సేకరించారు. 60,000 రూపాయల నగదును జమ చేసి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. మాజీ సర్పంచ్ జన్నాయి, కోడే నగేష్, పినింటి మోహన్ రెడ్డి, పోతగాని మల్లేశం, పైళ్ల దామోదర్ రెడ్డి, పాశం వెంకట్ రెడ్డి, యాస వెంకట్ రెడ్డి, యాస తిరుమల్ రెడ్డి, బొంత అంజయ్య, దొంతరబోయిన భాస్కర్, నల్ల చంద్రస్వామి, కోరే కనకయ్య, మాదరాంబాబు, రాచమల్ల కృష్ణ, యాస గోవర్ధన్ రెడ్డి, కోల ముకేశ్ పాల్గొన్నారు.

# పాఠశాలలో మూత్రశాల నిర్మాణం ధ్వంసం



**విశ్వంభర, చివ్వేంల :** చందుపట్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో గత రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఎవరో నిర్మాణంలో ఉన్న మూత్రశాలను, నీటి ట్యాంకు, నల్లాలను ధ్వంసం చేశారు , ఈ విషయం తెలుసుకున్న బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు పాఠశాలను పరిశీలించారు. అనంతరం బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గుద్దేటి చిన్న వెంకన్న మాట్లాడుతూప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసిన వారిని శిక్షించాలని , అలాగే అమ్మ ఆదర్శ పాఠశాల లో నిర్మాణం లో ఉన్నటువంటి పనులను నాణ్యత లోపం జరుగుతుందని . ఇట్టి నిర్మాణం చేసే వారు ప్రభుత్వ ప్రామాణికాల ప్రకారం పని చెయ్యకుండా ఉన్నటువంటి బడ్జెట్ ని వినియోగించుకొని వారి ఇష్టానుసారంగా చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు శిగ విరస్వామి, తెలంగాణ యువజన సంఘం చివ్వేంల మండల అధ్యక్షులు చెరుకు నగేష్ , అనంతుల ఆంజనేయులు, గుయ్యం ఆనంద్, బయ్యా ముక్కంటి, కెసిఆర్, ఈరేబోయిన శ్రీనివాస్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## మానవ సేవే మాధవ సేవ



**విశ్వంభర,రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, ఇస్కిళ్ల గ్రామంలో ఎడ్ల సుజాత అకస్మాతుగా మరణించిన విషయన్ని తెలుసుకొని, కుటుంబసభ్యుల స్థితిగతులను గమనించి, మానవతా దృక్పథంతో సమిష్టి సేవా ఫౌండేషన్ వారు 25 కిలోల బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు సరఫరా చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రామన్నపేట మండలం సమిష్టి సేవా ఫౌండేషన్ సభ్యులు ఎడ్ల సురేష్, జిల్లా సైదులు, మేడి యాదయ్య, బందెల నాగరాజు, బందెల వెంకన్న, బందెల చంద్రయ్య, బందెల కృష్ణ , కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**వంతెనను పరిశీలించిన పొంగులేటి**

**విశ్వంభర,డోర్నకల్ :** రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణం సమాచార పౌర సంబంధాల శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి డోర్నకల్ మండలంలోని ములకలపల్లి ప్రధాన రహదారి, భారీ వర్షాల వరదల వల్ల కొట్టుకుపోయిన వంతెనను పరిశీలించారు. సంబంధిత అధికారులను వరద నష్టం వివరాలు నమోదు చేయాలని తెలిపారు,

## లయన్స్ సేవలు ప్రశంసనీయం



**విశ్వంభర, ఆమనగల్లు :** లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్ ఆధ్వర్యంలో లయన్స్ సభ్యులు ఉప్పల రాములు సౌజన్యంతో వారి తండ్రిగారైన ఉప్పల జంగయ్య యాదవ్ జ్ఞాపకార్థం ఆమనగల్ బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన అన్నప్రసాద కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్ సేవలు ప్రశంసనీయమని అన్నారు. సేవా భావంతో చేస్తున్న ప్రతి సేవను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ శిబిరంలో 400 మందికి అన్నప్రసాద వితరణ జరిపినట్లు పి ఆర్ ఒ లయన్ పాష తెలిపారు. ఈ శిబిరంలో జిల్లాచైర్మన్ లయన్ యం చంద్రశేఖర్ లయన్ బి యాదయ్య లయన్ సభ్యులు కర్నాటక కొండల్ రెడ్డి పాండు రెడ్డి కొరివి వెంకటయ్య సంయుక్త కార్యదర్శి ఎంగలి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ నగర్‌లో అన్నప్రసాద వితరణ



**విశ్వంభర, మెట్‌పల్లి :** మెట్‌పల్లిపట్టణం వెల్లుల్ల రోడ్డు లోని హనుమాన్ నగర్ యువసేన ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురభి నవీన్ కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వ హించారు. హనుమాన్‌నగర్ యువసేనసభ్యులు నందకిషోర్, సురభి, నవీన్ కుమార్, శాలువాతో సన్మానించారు. అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. మర్రి నందకిషోర్, గంగుల భూమా నందం,తిరుపతి, వినీత్, అంజు,శివ,సాయి,హనుమాన్‌యువసేనసభ్యులు, బిజెపి, బిజెవైఎం, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోచారంలో లడ్డు వేలం రికార్డు ధర



**విశ్వంభర,సంగారెడ్డి :** పటాన్ చేరు మండల పరిధిలోని పోచారం గ్రామంలో హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో జరిగిన గణేష్ నిమజ్జన ఊరేగింపులో భాగంగా లడ్డు వేలంలో రికార్డు స్థాయిలో ధర పలికింది. నాలుగు లక్షల పదకొండు వేలకు నక్క శ్రీనివాస్ గౌడ్ దక్కించుకున్నారు. గత 30 సంవ త్సరాలుగా హనుమాన్ మందిరంలో విఘ్నేశ్వరుని నిలుపుకుంటు పూజలు నిర్వహిస్తున్నారు. హనుమాన్ యూత్ సభ్యులు అశోక్ గౌడ్, భాస్కర్ గౌడ్,శ్రీనివాస్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, సంతోష్ గౌడ్, లక్ష్మణ్ గౌడ్, రాజ లింగం గౌడ్, రవికాంత్ గౌడ్, టోపీ రవి, విష్ణు గౌడ్, ధనరాజ్ గౌడ్, ఇషాన్ సింగ్, ప్రవీణ్ సింగ్, జైపాల్ రెడ్డి, మల్లేష్ గౌడ్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు .

## ఘనంగా డిసిసి అధ్యక్షులు జన్మదిన వేడుకలు



**విశ్వంభర, కడ్తాల్ :** కడ్తాల్ మండల కేంద్రంలోని బస్ స్టాప్ వద్ద చల్లా నరసింహా రెడ్డి జన్మదిన వేడుకలు కడ్తాల్ మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బిచ్చ నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కేక్ కట్ చేసి చల్లా నరసింహ రెడ్డి కి హార్దిక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి నేనావత్ బిఖ్య నాయక్, సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జర్పుల లక్పతి నాయక్, ఆమనగల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహ, జాంగిర్ బాబా, లక్ష్మయ్య, లక్ష్మణ్ నాయక్, వెంకటేష్, జాంగిర్, యాదయ్య, షాబుద్దీన్, నాయకులు, యువకులు, అభిమానులు, పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం



**విశ్వంభర, వరంగల్ :** మడికొండ గ్రామంలోని వివిధ గణేష్ మండపాల నిర్వాహకులు ఏర్పాటు చేసుకున్న గణపతులను గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 16, 17న నిమజ్జన కార్యక్రమంలో ప్రశాంత వాతావరణంలో గణపతులను నిమజ్జనం చేసుకోవాలని మడికొండ సీఐ పుల్యాల కిషన్‌మీడియాకు వెల్లడించారు. సీఐ పుల్యాలకిషన్ మాట్లాడుతూ. గణపతి నిమర్జనంలో పాల్గొనే ప్రజలు, యువకులు, భక్తిశ్రద్ధలతో నిమజ్జనంలో పాల్గొనాలని, గ్రామాలలో ఎలాంటి గొడవలకు పాల్ప డకూడదని ప్రజలకు ఆటంకం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. డీజేలకు అనుమ తులు లేవని ఎవరైనా అతిక్రమిస్తే చర్యలు తప్పవని మడికొండ సీఐ పుల్యాల కిషన్‌హెచ్చరించారు.

## గణనాథులను దర్శించుకున్న ఎమ్మెల్యే



**విశ్వంభర, భూపాలపల్లి:** శ్రీ వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని భూపాలపల్లి పట్టణంలో ఘనంగా గణపతి నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. కాగా ఆయా కాలనీల మండపాల నిర్వాహకుల ఆహ్వానం మేరకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కాంగ్రెస్ నేతలతో కలిసి పలు కాలనీల గణనాథులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా, హనుమాన్ నగర్ లోని శ్రీ సాయి గణేష్ ఉత్సవ కమిటీ వారు ఏర్పాటు చేసిన గణపయ్యకు దర్శనం చేసుకున్నారు. అనంతరం రాంనగర్ కాలనీలోని లక్ష్మీ గణపతి ఉత్సవ కమిటీ వారు ఏర్పాటు చేసిన గణపయ్యకు ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా, సుభాష్ కాలనీ, సుభాష్ కాలనీ 4వ వీధి, కృష్ణ కాలనీ, టీ - 2 క్వార్టర్స్ లలో జరిగిన ఉత్సవాలల్లో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయా మండపాల నిర్వహకులు ఎమ్మెల్యేకు శాలువాలు కప్పి ఘన సన్మానం చేశారు. ఈ కార్యక్రమాలల్లో ఆయా కాలనీల అధ్యక్షులు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

## కొందుటి నరేందర్ ప్రత్యేక పూజలు



**విశ్వంభర, షాద్‌నగర్ :** షాద్ నగర్ పట్టణంలోని పద్మావతి కాలనీలో శివ భారతి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమం సందర్భంగా విచ్చేసి తొలి పూజల గణాధిపతి కి ప్రత్యేక పూజలు పట్టణ మున్సిపల్ చైర్మన్ కొందుటినరేందర్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బచ్చల నరసింహ, జూపల్లి కౌసల్య శంకర్, చెట్ల పావని నరసింహ, పిల్లి శారద శేఖర్, శివ భారత్ యూత్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## బీజేపీ సభ్యత్వ నమోదు



**విశ్వంభర, వరంగల్ :** వరంగల్ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గం సభ్యత్వ నమోదు కార్యక్రమ ప్రారంభోత్సవం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లాడి తిరుపతిరెడ్డి అధ్యక్షతన సత్యం గార్డెన్స్ లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా సభ్యత్వ జిల్లా ఇన్చార్జి పొనుగోటి పాపారావు, జిల్లా బిజెపి అధ్యక్షులు గంట రవికుమార్, మాజీ శాసనసభ్యులు కొండేటి శ్రీధర్, అరూరి రమేష్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గంట రవికుమార్ మాట్లాడుతూ దేశ హితం కోసం పనిచేసే పార్టీ బీజేపీ అని కొనియాడారు. గతంలో అధికారంలో ఉన్న పార్టీ ఇప్పుడు అధికారం లో ఉన్న పార్టీనీ చూస్తున్నామని, రాష్ట్ర అభివృద్ధినీ కుంటుపడేలా చేస్తున్నారని, 2047 వరకు భారత్ అభివృద్ధి చెందిన దేశంగా చేయాలని లక్ష్యం తో ప్రధాని మోడీ పని చేస్తున్నారని వరంగల్ జిల్లా బిజెపి అధ్యక్షులు గంట రవికుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యత్వ జిల్లా సహ ఇన్చార్జి పాపన్న, సభ్యత్వ జిల్లా ప్రముఖ్ కుసుమ సతీష్, ఎస్సీ మోర్చ రాష్ట్ర నాయకులు బన్న ప్రభాకర్, బిజెపి రాష్ట్ర నాయకులు జలగం రంజిత్ కుమార్, జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ గజ్జేల శ్రీరాములు, ZPTCసునీత, కాజీపేట మండల PACS చైర్మన్ వనం రెడ్డి, సభ్యత్వ నియోజకవర్గ సహా ప్రముఖ్ జడ సతీష్, మజ్జిగ జయపాల్ రెడ్డి మరియు నియోజకవర్గ మండల/డివిజన్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మరుగుదొడ్ల మరమ్మత్తు

**విశ్వంభర, వెల్దండ:** వెల్దండ మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలలో సుమారు 630 మందికి పైగా విద్యార్థినిలు ఉన్న ఈ పాఠశాలలో మరుగుదొడ్లు అసౌకర్యంగా ఉండి, తలుపులు విరిగి, బాలికల నిత్య కృత్యాలకు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకున్న టీ-టాస్క్ సీ.ఓ.ఓ, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్‌సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి, ఐక్యత ఫౌండేషన్ ద్వారా సమస్య పరిష్కారానికి దాదాపు యాభై వేల రూపాయలు ఖర్చు చేసి 18 బాత్రూం డోర్లను మరమ్మతులు చేయించి విద్యార్థినిల ఇబ్బందులను తొలగించారు. ఈ కార్యక్రమంలో ఐక్యత ఫౌండేషన్ సభ్యులుపంతు నాయక్, గొడుగు మల్లయ్య, కొండల్ యాదవ్, రమేష్ నాయక్, శ్రీను నాయక్, లక్ష్మణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## టిఆర్ఎస్ సీనియర్ నాయకులు సస్పెన్షన్



**విశ్వంభర, కామారెడ్డి :** జిల్లా మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ జాహ్నవి తండ్రి సీనియర్ రాష్ట్ర నాయకులు కామారెడ్డిలో గత 20 సంవత్సరాల్లో పట్టణంలో మొత్తం తానై నడుపుతున్న టిఆర్ఎస్ నాయకులు వేణుగోపాల్ రావును పార్టీ అధ్యక్షులు సస్పెన్షన్ చేసినట్టు ఒక పత్రిక పట్టణంలో విడుదల చేశారు. ఆయనతో పాటు కౌన్సిలర్ కృష్ణ మోహన్, దేవుని పల్లి టిఆర్ఎస్ లీడర్ ఎన్ వెంకట్రావు , ముప్పారపాల గుప్తాను సస్పెండ్ చేశారు. మీరు గతంలో పార్లమెంటు ఎన్నికల్లో బిజెపికి సపోర్ట్ చేశారని ఆ లేఖలో పేర్కొన్నారు. పాడి కౌశిక్ రెడ్డి విషయంలో ధర్నా నిర్వహిస్తే వీరు రాలేదని టిఆర్ఎస్ చేసే కార్యక్రమాలు పాల్గొనడం లేదని గ్రహించి పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ రావు వీరిని సస్పెండ్ చేసినట్టు ఒక లేఖలో తెలిపారు

# విద్యార్థులకు రూ. 15 లక్షల స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేసిన వైఆర్పి ఫౌండేషన్

**విశ్వంభర, ఎల్బీనగర్:** విద్యార్థులు దేశానికి పునాది అనే ఆలోచనతోనే విద్యకు అర్హత కలిగిన, కానీ ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు సహాయం అందిస్తున్నామని వై ఆర్ పి ఫౌండేషన్, వైష్ణోయి గ్రూప్ వ్యవస్థాపకులు, మేనేజింగ్ డైరెక్టర్ యెలిశాల రవి ప్రసాద్ అన్నారు. శనివారం ఓఆర్కే పురం డివిజన్ వాసవి కాలనీ లో నీ వైఆర్ పి ఫౌండేషన్ కార్యాలయం లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రాథమిక, మధ్య, ఉన్నత విద్యాస్థాయిలు, ఎంబీబీఎస్, డిగ్రీల విద్యార్థులకు రవి ప్రసాద్ నేతృత్వంలో 40 మందికి పైగా అర్హులైన విద్యార్థులకు రూ.15 లక్షల విలువైన స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవి ప్రసాద్ మాట్లాడుతూ వైఆర్ పి ఫౌండేషన్ గత 10 సంవత్సరాల కాలంలో 300 మందికి పైగా విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించినట్లు తెలిపారు. ఈ ఫౌండేషన్ సమాజానికి ఆశ, పురోగతికి సంకేతంగా మారిందన్నారు. ఈ స్కాలర్‌షిప్‌ల ద్వారా, మేము కేవలం వ్యక్తులనే కాకుండా, దేశ భవిష్యత్తులోనూ పెట్టుబడులు పెడుతున్నాము. నేటి విద్యార్థులు రేపటి నాయకులుగా ఎదుగుతారని నాకు విశ్వాసం ఉందన్నారు. విద్యా సహాయ కార్యక్రమాలతో పాటు, వైఆర్పి ఫౌండేషన్ క్రీడా కార్యక్రమాలు, పర్యావరణ కార్యక్రమాలు,



దేవాలయ పునరుద్ధరణ వంటి సాంస్కృతిక కార్యకలాపాలకు కూడా మద్దతు అందిస్తుందన్నారు.

## పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే



**విశ్వంభర, హైద్రాబాద్ :** ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో గణపతి నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా ఎనిమిదవ రోజు కావున భక్తిశ్రద్ధలతో గణనాధుని ప్రత్యేక పూజా కార్యక్రమంలో మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ తొమ్మిది రోజులు భక్తిశ్రద్ధలతో దేశంలోనే అతిపెద్ద పండగ అంగరంగ వైభవంగా జరుపు కునే ఈ యొక్క గణపతి దైవ పూజ కార్యక్ర మంలో పాల్గొనడం జరిగిందని అన్నారు. మహ బూబాబాద్ నియోజకవర్గ ప్రజలు ఆయురారో గ్యాలతో సుఖసంతోషాలతో, పశు సంపదతో కుటుంబాలు ఎప్పుడు చల్లగా ఉండాలని గణనాధుని వేడుకున్నానన్నారు.

## ఎలక్ట్రానిక్ మీడియాను బహిష్కరిస్తాం

**విశ్వంభర,తుంగతుర్తి:** తుంగతుర్తి నియోజకవర్గంలో నిత్యం తిరుగుతూ నియోజకవర్గం ప్రజల మండలంలో పొందుతున్న తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేల్ పై కక్షపూరితంగా కొన్ని ఎలక్ట్రానిక్ మీడియా ఛానళ్లు అసత్య ప్రచారాలు చేస్తూ, ఎమ్మెల్యే ను, కాంగ్రెస్ పార్టీని, నియోజకవర్గ ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా ప్రసారాలు చేస్తున్న ఛానల్ లకు భాహిష్కరిస్తాం అని తుంగతుర్తి నియోజకవర్గం మీడియా ఇంచార్జి కందుకూరి లక్ష్మయ్య హెచ్చరించారు. నియోజకవర్గంలో ఎన్నో సంవత్సరాలుగా పరిష్కారం కాని సమస్యలను పరిష్కరిస్తూ పార్టీలకు అతీతంగా ఆపద వచ్చిందంటే ఆదుకుంటూ నిత్యం ప్రజలకు సేవ చేస్తున్న తుంగతుర్తి ప్రజా సేవకుడు, అభివృద్ధి ప్రదాత, ఉద్యమ నాయకుడు మందుల సామెల్ పై బీఆర్ఎస్ పార్టీకి తొత్తుగా మారిన కొన్ని మీడియా ఛానల్లు అసత్య ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. నియోజకవర్గంలో 300 పైగా ఎల్ఓసిలు ఇప్పించిన ఘనత ఎమ్మెల్యే సామేలుదని, దాదాపు 500 పైన సీఎంఆర్ఎఫ్ ద్వారా ప్రజలకు చెక్కులిప్పించి ఎటువంటి మెడికల్ అవసరాలు ఉన్న ఎమ్మెల్యే తన సొంత డబ్బులు ఇచ్చి ఆరోగ్యంగా ఉండాలని కోరుకునే వ్యక్తి ఎమ్మెల్యే సామేలు మనస్తత్వము అని అన్నారు.

## సీఎం రేవంత్ విమోచన దినమని ఎందుకు పలకట్లే



**విశ్వంభర, హైదరాబాద్:** మజ్లిస్ ఒత్తిడికి తలొగ్గి సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ విమోచన వేడుకలకు హాజరుకావడం లేదని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ విమర్శించారు. కేంద్రం నిర్వహించే వేడుకలకు ముఖ్యమంత్రి రాకపోవడం విచారకరమన్నారు. సీఎం రేవంత్ విమోచన దినమని ఎందుకు పలకట్లేదని ప్రశ్నించారు. ఈ నెల 17న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన వేడుకలను నిర్వహించనున్నారు. ఈనేపథ్యంలో పార్టీ నాయకులతో కలిసి ఎంపీ లక్ష్మణ్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విమోచన వేడులకు సీఎం రేవంత్ రెడ్డి రాకపోవడంపై మండిపడ్డారు.గత మూడేండ్లుగా సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన వేడుకలను కేంద్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నది. ఈ వేడుకలకు కేంద్ర హెూం మంత్రి అమిత్ షా ముఖ్య అతిథిగా వస్తున్నట్లు బీజేపీ ప్రకటించింది. అయితే హర్యానా, జమ్ముకశ్మీర్ ఎన్నికల నేపథ్యంలో ఆయన ఈ వేడుకలకు దూరంగా ఉంటున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. దీంతో ఈ కార్యక్రమానికి చీఫ్ గెస్ట్‌గా కిషన్‌రెడ్డితోపాటు సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ పాల్గొనే అవకాశం ఉందని పేర్కొన్నారు. మరోపక్క రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం పేరుతో అధికారికంగా వేడుకలను నిర్వహిస్తున్నది. ఈ కార్యక్రమంలో పాల్గొనాలంటూ కేంద్ర మంత్రులు అమిత్ షా, గజేంద్రసింగ్ షెకావత్, కిషన్ రెడ్డి, బండి సంజయ్‌ని ఆహ్వానించింది.

## వినాయక మండపంలో విద్యుత్ షాక్ తో వ్యక్తి మృతి

**విశ్వంభర చింతపల్లి:** చింతపల్లి మండలం కిష్టరాయినిపల్లి గ్రామంలో వినాయక చవితి సందర్భంగా అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపంలో ఒక యువకుడు విద్యుత్ షాక్ తో మృతి చెందడంతో ఆ గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. శనివారం పండుగ ఉత్సహంలో ఉన్న ఆ యువకుడు గణేష్ మండపంలో లైట్ బిగిస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ షాక్ కు గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. కిష్టరాయినిపల్లి గ్రామానికి చెందిన కారింగ్ రామచంద్రం - లక్ష్మమ్మ పెద్ద కుమారుడు కారింగ్ వర్ధన్ గౌడ్ (21) హైదరాబాద్ లో బీటెక్ చదువుతున్నాడు. వినాయక చవితి సందర్భంగా గ్రామంలోని వినాయక మండపంలో విద్యుద్ఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. వారి కుటుంబంలో తీరని విషాదం నింపింది. తమ కండ్ల ముందే యువకుడు విద్యుత్ షాక్ తో మృతి చెందడంతో గ్రామ ప్రజలు కన్నీటి పర్యంతమయ్యారు.

## గాంధీజీలో ఘనంగా జాతీయ హిందీ దినోత్సవ వేడుకలు



**విశ్వంభర,చండూర్:** చండూరు స్థానిక గాంధీజీ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో జాతీ య హిందీ దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు, గాంధీజీ విద్యాస ంస్థల చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు పాల్గొని మాట్లాడాడుతూ భారత స్వతంత్ర సంగ్రామంలో హిందీ భాషా పోషించిన పాత్ర, హిందీ జాతీయ భాషగా గుర్తింపబడ టానికి గల ఆవశ్యకత , కారణాలు గురించి తెలిపారు. మనమందరం హిందీ భాష నేర్చుకోవాల్సిన అవసరం గురించి వివరించారు. విద్యార్థులు, అధ్యాపకులు తయారు చేసిన హిందీ భాషా విశిష్టత ను తెలియచేసే వివిధ అంశాలను ప్రదర్శనగా వారు ఏర్పాటు చేసారు .ఉత్తమ ప్రదర్శనకు బహుమతులు అందజేసారు. హిందీ భాషా అధ్యాపకులను అందరినీ సత్కరించారు. పాఠశాల డైరెక్టర్ సరికొండ వెంకన్న, ప్రిన్సిపాల్ సత్యనారాయణ మూర్తి, ఎండి నజీరుద్దీన్, కృష్ణయ్య, రాధిక, విజయ కుమారి, పుల్లీ బేగం, సంధ్యా రాణి, యాదయ్య, యాదగిరి,గణేష్, విజయ్ పాల్గొన్నారు.

## ఒకే రకం దుస్తులు ధరించి గణేశుడికి ప్రత్యేక పూజలు



**విశ్వంభర, వనస్థలిపురం:** గణపతి ఉత్సవాలలో భాగం గా వనస్థలిపురంలోని వైదేహి నగర్‌లో పలువురు మహిళలు ఒకే రకమైన దుస్తులు ధరించి గణేశుడికి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. స్వామి వారికి పూజ లు జరిపించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పాల్గొన్న మదర్ తెరిసా చారిటబుల్ సొసైటీ అధ్యక్షులు చేపూరిశంకర్,భాగ్యమ్మ,అలివేలు,స్వాతి , స్వప్న,తులసి,కవిత,శ్రీదేవి,రాజేశ్వరి,విజయ,సమత,మణెమ్మ,సుజాతఎత్తునమహిళలు పాల్గొన్నారు.

## హైద్రాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి 57వ వర్ధంతి



**విశ్వంభర, షాద్ నగర్ :** హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు 57వ వర్ధంతి సందర్భంగా షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు షాద్నగర్ నియోజకవర్గం పలువురు కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యూత్ ఆధ్వర్యంలో అన్నదానం

**విశ్వంభర, షాద్ నగర్ :** ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆగణనాథుని దీవెనలు ప్రజలందరిపై చల్లగా ఉండాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణు తొలి పూజల ఆది గణపతిని ప్రార్థించారు. స్థానిక పద్మావతి కాలనీలో శివభారత్ యూత్‌అసోసియేషన్ ఏర్పాటు చేసిన మహాగణపతి వద్ద భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణుహాజరయ్యి షోడో శోపచార విధానాలతో ప్రత్యేకపూజలు నిర్వహించారు. అన్నదానానికి విచ్చేసిన భక్తులకు అన్నదానపంపిణీ చేశారు. నిర్విఘ్నంగా 40 సంవత్సరాలుగా ప్రతిసంవత్సరం గణేష్ మండపాలని ఏర్పాటుచేసి అకుంఠిత దీక్షతో ప్రతి నవరాత్రులలోపూజలు నిర్వహిస్తూ ప్రజలందరి మన్ననలు పొందుతున్న శివభారత్ గణేష్ మండల్‌నుఅభినందించారు.

# కమ్యూనిటీ ఆసుపత్రి ముందు నిరసన




**విశ్వంభర, షాద్ నగర్ :** షాద్ నగర్ ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు టంగుటూరి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో షాద్ నగర్ కమ్యూనిటీ ఆసుపత్రి ముందు మెడికల్ , ఔట్సోర్సింగ్ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టంగుటూరి నరసింహారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఉన్న అన్ని కమ్యూనిటీ ఆసుపత్రిలో 11 వేల వేతనమిస్తే షాద్ నగర్ కమ్యూనిటీ ఆసుపత్రిలో కార్మికులకు 10,000 మాత్రమే వేతనం ఇస్తున్నారని , వేయి రూపాలు ఎందుకు కట్ చేస్తున్నారని అర్థం కావడం లేదని దానికి ఆసుపత్రి సూపరింటెండెంట్ సమాధానం చెప్పాలని ఆయన నిలదీశారు. ఇప్పటికే రెండు నెలలుగా వారికి వేతనాలు రావడం లేదని ప్రతినెల వేతనాలు వచ్చేటట్టు సూపరింటెండెంట్ చొరవ చూపాలని ఆయన కోరారు. పిఎఫ్ ఈఎస్ఐ ఇన్సూరెన్స్ హెల్త్ కార్డులు తదితర సౌకర్యాలని కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనియెడల సమ్మె చేయడానికి కూడా పూనుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఏఐటియుసి నాయకులు బాల్ రాజ్, వేమారెడ్డి, మల్లేష్, పద్మ, సుజాత కే పద్మ, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**విశ్వంభర, భూపాలపల్లి:** పేద, నిరుపేద ప్రజలకు సీఎం సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శనివారం భూపాలపల్లి మంజూరునగర్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని మొగుళ్లపల్లి, టేకుమట్ల, రేగొండ, కొత్తపల్లిగోరి మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన మొత్తం 60 మంది సీఎంఆర్ఎఫ్ లబ్దిదారులకు రూ.18,98,500 విలువ కలిగిన చెక్కులను ఎమ్మెల్యే జీఎస్సార్ చేతుల మీదుగా అందజేశారు. ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలవడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు.పేద ప్రజలను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రజాప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే గుర్తుచేశారు. సీఎం సహాయనిధి ద్వారా పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతుందని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన గణనాథునికి పూజా కార్యక్రమాలు ఘనంగా సాగుతున్నాయి. కాగా, మహాఅన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గండ్ర సత్యనారా యణ రావు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే స్వయంగా వందలాదిమంది భక్తులకు అన్నదానం చేశారు. ఆ వినాయక స్వామి కరుణా కటాక్షాలతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నారు. భూపాలపల్లి నియోజకవర్గంలోని ప్రతీ కుటుంబం కూడా దినదిన అభివృద్ధి సాధించాలని స్వామి వారిని ప్రార్థించారు.

## యువజన సంఘాల అన్నదానం



**విశ్వంభర, కొత్తూరు:** అన్నం పరబ్ర హ్మ స్వరూపమని అన్ని దానాలలోకెళ్ల అన్నదానం మహాదానమని బిఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు నల్లవోలు నరేందర్ రెడ్డి అన్నారు. కొత్తూరు మండలంలోని సిద్దాపూర్‌లో భగత్ సింగ్,స్వయంకృషి యువజన సంఘాల వినాయక మండపం వద్ద భక్తులకు బిఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు నల్లవోలు నరేందర్ రెడ్డి హాజరై మండపంలో పూజలుచేసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. వినాయక మండప నిర్వాహకులు వారిని స్వాగతంపలికి సత్కరించారు. యువత ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాలుపంచుకోవడం సంతోషంగా ఉందన్నారు. వినాయక చవితి నవరాత్రులు ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో జరుపుకుంటూ లోక క్షేమం కోసం పూజలు అన్నదానాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఆ గణనాథుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలు ఆయురారోగ్యాలతో కలకాలం వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాక్స్ వాయిస్ చైర్మన్ బొజ్జ శ్రీనివాస్ రెడ్డి, సత్యనారాయణ,మల్లేష్, టోనీ, జనార్దన్ చారి,సురేష్,నరేష్, చెన్నయ్య,శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రవేట్ టీచర్లకు శిక్షణ ఇప్పించాలి



**విశ్వంభరా,సరూర్ నగర్:** ప్రభుత్వ ఉపాధ్యాయుల లాగానే ప్రైవేటు ఉపాధ్యాయుల కూడా ప్రభుత్వం శిక్షణ ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా ట్రస్మ ప్రధాన కార్య దర్శి ఎం.ఐ గుల్షాని అన్నారు. శనివారము షెడ్యూలు కులాల అభివృద్ధి శాఖ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఎన్ శ్రీధర్ కు ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ మధుసూదన్, అడ్వైజర్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి తో కలిసి వినతిపత్రం అందజేశారు. పాఠశాలలకు కచ్చితంగా 220 రోజులు నడిపించి పరీక్షలు జరిపించాలన్నారు. లోకల్ సెలవులుగా అన్నింటిని వర్కింగ్‌డేలో కలపాలి. కాలేజీలకు అనుమతుల నోటిఫికేషన్ షెడ్యూలు ప్రకారము ఏ విధంగా విడుదల చేస్తారో అదేవిధంగా పాఠశాలలకు కూడా ఇవ్వాలి. గ్రంథాలయ పుస్తకాలను కూడా ప్రైవేటు పాఠశాలలకు అనుమతించాలని వినతిపత్రంలో కోరారు. ఈ విషయాలపై సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

## వేదపండితులు శివ శర్మ సమక్షంలో హెూమము



**విశ్వంభర, ఎల్బీనగర్:** వేదపండితులు శివశర్మ సమక్షంలో సరూర్ నగర్ డివిజన్ డాక్టర్స్ కాలనీ వాసుల ఆధ్వర్యంలో గణపతి హెూమము నిర్వహించారు. హెూమము కార్యక్రమంలో వన్నాడీ శ్రీనివాస్ దంపతులు, నగేష్ దంపతులు, సతీష్ దంపతులు నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో జగిని రామమూర్తి, వక్కలంక శ్రీనివాస్ రావు, జనార్దన్ రెడ్డి, కృష్ణ, ఉమామహేశ్వర రావు, శ్రీనివాస్, దయాకర్, చెంద్రయ్య, మహిళా మండలి సభ్యులు మమత, సరిత నిత్య, కామినేని లక్ష్మి, జ్యోతి, సునీత, సంధ్య, రాధిక, రమ, వాణి, రేణుక, సూర్యకల, సీత, పద్మ పాలుగోన్నారు.

## ఏకదంతుని ఆశీస్సులు అందరిపై ఉండాలి



**విశ్వంభర,ఎల్బీనగర్:** మహేశ్వరం నియోజకవర్గం ఆర్కే పురం డివిజన్ పరిధిలోని వాసవి కాలనీ నివాసుల సంక్షేమ సంఘం వారి ఆధ్వర్యంలో మహా గణపతి 37వ నవరాత్రి మహెూత్సవాలలో భాగంగా నిర్వహించిన పూజా కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా భారత ప్రభుత్వ మంత్రిత్వ శాఖ వాటర్ రిసోర్స్ ఐ ఏ ఎస్ అధికారి ఎస్ వి కృష్ణ దంపతులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి వారికి బహుమతులను ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో వాసవి కాలనీ అధ్యక్షుడు గౌరీశెట్టి చంద్రశేఖర్ గుప్త, ప్రధాన కార్యదర్శి అంజయ్య, కోశాధికారి కృష్ణయ్య, అష్టలక్ష్మి దేవాలయ అక్షయ ట్రస్ట్ సెక్రటరీ సుధాకర్ గుప్తా, దేవాలయ ప్రధాన కార్యదర్శి గంప జగన్, బంధం దామోదర్, గౌరిశెట్టి అరుణ్, గౌరీశెట్టి శ్రీనివాస్, కమిటీ సభ్యులు గౌరీ శంకర్, వనమా సుదర్శన్, తమ్మన్న శ్రీధర్, మాలే అనిల్, ఒరుగంటి వెంకటేశ్వర్లు, గ్రంథి రమేష్, గందే శ్రీకాంత్, డా.రాంకిషన్, తోడుపునూరి సతీష్, శుభకర్, కృష్ణ మూర్తి, లక్ష్మయ్య, మురేగేషన్, అనిల్, సుబ్బారావు, మేఘమాల, సుజాత, లక్ష్మీ, భ్రమరాంబా, లావణ్య, అరుణ, వనజ పాల్గొన్నారు..

## దేశ నిర్మాణంలో ఇంజనీర్ల సేవలు మరువలేని



**విశ్వంభర, మెట్ పల్లి:** దేశ నిర్మాణంలో ఇంజనీర్ల సేవలు వెలకట్టలేనివి అని మెట్పల్లి ఇరిగేషన్ సబ్ డివిజన్ నెంబర్ .4 డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అరుణోదయ్ కుమార్ అన్నారు. శనివారము ఆయన విశ్వంభరతో మాట్లాడుతూ దేశం అభివృద్ధి పదంలో దూసుకు వెళ్లాలంటే ఇంజనీర్ల పాత్ర కీలకమన్నారు.ఎస్సారెస్పీ, వరద కాలువ ఇరిగేషన్ డివిజన్ సబ్ డివిజన్ ఆఫీసర్లకు, నాతోటి సహా ఉద్యోగులకు ఇంజనీర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు.

## బొజ్జ గణపయ్యలను దర్శించుకున్న దేప భాస్కర్ రెడ్డి



**విశ్వంభర, ఎల్బీనగర్:** మహేశ్వరం నియోజకవర్గం రామకృష్ణ పురం డివిజన్‌లోని పలు గణపతి పూజలో పాల్గొని అనంతరం అన్న దానంలో పాల్గొన్న మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, టిపిసిసి మెంబర్ దేప భాస్కర్ రెడ్డి.రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, పున్న గణేష్, బండి మధుసూదన్ రావు, నల్లెంకి ధనరాజ్ గౌడ్,గట్ల రవీంద్ర, జ్ఞానేశ్వర్ యాదవ్, శివ శ్రీనివాస్ రెడ్డి, పెద్దవూర సైదులు, శివ, నవీన్, మహేష్, సాయి శ్రీకాంత్ రెడ్డి, విజయ్ పాల్గొన్నారు.

## డా. రియాజ్‌ను కలిసిన హైదరాబాద్ బుక్ ఫెర్ బృందం

*డిసెంబర్‌లో జరిగే హైదరాబాద్ బుక్ ఫేర్‌కు సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి*



**విశ్వంభర, హైదరాబాద్:** అఫ్జల్ గంజ్ లోని రాష్ట్ర, కేంద్ర గ్రంథాలయంలో రాష్ట్ర కార్యాలయంలో శనివారం తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్‌ను కలిసి శాలువా కప్పి ఘనంగా సన్మానించిన హైదరాబాద్ బుక్ ఫెర్ ప్రెసిడెంట్ కవి యాకూబ్, జనరల్ సెక్రెటరీ ఆర్.వాసు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో హైదరాబాద్ బుక్ ఫెర్ నిర్వహించేందుకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. డిసెంబర్‌లో నిర్వహించనున్న హైదరాబాద్ బుక్‌ఫెర్‌కు అన్ని రకాల సహాయ సహకారాలుఅందించాలని పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్ ను వారు కోరారు. స్పందించిన చైర్మన్ అన్ని అన్ని జిల్లాలలో నిర్వహించి హైదరాబాద్ బుక్ పేర్ కు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రం లోని అన్ని గ్రంథాలయాల పటిష్టతకు హైదరాబాద్ బుక్ ఫెర్ కూడా మీ వంతు పాత్ర పోషించాలని కోరారు.కోశాధికారి పినారాయణ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ సభ్యులు కుమార్, కృష్ణారెడ్డిలు పాల్గొన్నారు.

## శ్రీ వరసిద్ధి వినాయక యూత్ ఆధ్వర్యంలో అన్నదానం



**విశ్వంభర, సికింద్రాబాద్:** పద్మారావు నగర్‌లో గల శ్రీ వరసిద్ధి వినాయక యూత్ అసోసియే షన్ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రులు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. గణపతి ఉత్సవాలలో భాగంగా నాలుగవ రోజు ప్రత్యేక పూజలు కుంకుమార్చన నిర్వహించారు.గణపతి ఉత్సవాల్లో భాగంగా భక్తులకు , ప్రజలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎంబీఏ ప్రోగ్రామ్ వింటర్ ప్రవేశాలు




**విశ్వంభర, బషీర్ బాగ్ :** ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ (ఐఐఎం) విశాఖపట్నం ఎగ్జిక్యూటివ్ మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఈఎంబీఏ) ప్రోగ్రామ్ కు సంబంధించి వింటర్ అడ్మిషన్లను ప్రకటించింది. టైమ్స్ ప్రోతో ఈ భాగస్వామ్యం అధునాతన మేనేజ్మెంట్ నైపుణ్యంతో పనిచేసే నిపుణులను శక్తివంతం చేయడం, అభివృద్ధి చెందుతున్న వ్యాపార వాతావరణంలో నాయకత్వ పాత్రల కోసం వారిని సిద్ధం చేయడం వంటి వాటిపై నిబద్ధతను నొక్కి చెబుతుంది. ఈ సందర్భంగా ఈఎంబిఏ ను ప్రకటించిన సందర్భంగా ఐఐఎం విశాఖపట్నం డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఐఐఎం విశాఖపట్నంలో తాము టైమ్స్ ప్రో భాగస్వా మ్యంతో ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ ప్రోగ్రామ్ ను అందించడానికి సంతోషిస్తున్నామన్నారు. ఈ ప్రోగ్రామ్ వ్యూహాత్మక దూరదృష్టి, విశ్వాసంతో ఆధునిక వ్యాపార చిక్కులను నేర్పుగా తొలగిస్తూ ముందుకు వెళ్లగల నాయకులను పెంపొందించడానికి రూపొందించబడిందన్నారు. టైమ్స్ ప్రో సీఈఓ అనీష్ శ్రీకృష్ణ మాట్లాడుతూ ఐఐఎం విశాఖపట్నంతో కలసి ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ ప్రోగ్రామ్ ను ప్రారంభించడం పట్ల తాము సంతోషిస్తున్నామన్నారు. తమ అభ్యాసకులకు ప్రతిష్టా త్మక ఐఐఎం విశాఖ పట్నం ఫ్యాకల్టీ క్రింద చదవడానికి అసమానమైన అవకాశాలను అందిస్తున్నామన్నారు. వారు విస్తృత శ్రేణి పరిశ్రమల నిపుణులతో నిమగ్నం అయ్యేందుకు అవకాశం ఉంటుందన్నారు.

## రిక్వెస్ట్ బస్ స్టాప్ ఉన్న ఎక్స్ప్రెస్ బస్సులు ఆపడం లేదు



**విశ్వంభర, ఆమనగల్లు :** గత కొన్ని నెలల నుంచి కడ్తాల్ మండలం కర్కల్పాహాడ్ స్టేజి దగ్గర ఆర్టీసీ ఎక్స్ ప్రెస్ బస్సులు నిలపకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నరని రిక్వెస్ట్ బస్ స్టాప్ ఉన్న ఎక్స్ప్రెస్ బస్సులు ఆపడం లేదని దాదాపు 10 గ్రామాల ప్రజలు, ఎక్వాయిపల్లి, మర్రిపల్లి ముద్విన్, చరికొండ, పల్లెచెల్క తండా, కర్కల్పాహాడ్, వాసుదేవపూర్ తదితర గ్రామల ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు, బస్సులు ఆపకపోకడం వల్ల వారి ఆమన్ గల్ లేదా కడ్తల్ ప్రాంతాల్లో దిగి వారి సొంత గ్రామాలకు చేరుకోవడానికి మరొక రవాణా వ్యవస్థ మీద ఆధారపడి సమయం , ఇతర సమస్యలు ఎదుర్కోవలసి వస్తుంది అని ఎమ్మెల్యే కసిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలకుర్ల కరుణాకర్ ,ఎదుల రఘుపతి,ఎం డి మొమిన్, పాండు, కొనపూర్ వెంకటేష్,జగన్,శేషు తదితర సంబంధిత గ్రామస్తులు ఉన్నారు.

## యూఎన్ డెవలప్మెంట్ పార్టనర్షిప్ ఫండ్కు భారతదేశం సహకారం

**విశ్వంభర, బషీర్ బాగ్:** ఐక్యరాజ్యసమితిలో భారతదేశ శాశ్వత ప్రతినిధి పి. హరీష్, దక్షిణ-దక్షిణ సహకార దినోత్సవాన్ని పురస్కరించుకుని యుఎన్ ప్రధాన కార్యాలయంలో తన ప్రసంగంలో యుఎన్ అభివృద్ధి భాగస్వామ్యంలో భారతదేశం కీలక పాత్రను హైలైట్ చేశారు. భారతదేశం విరాళాలు "వసుధైవ కుటుంబం" అంటే "ప్రపంచం ఒకే కుటుంబం" అనే సూత్రం ద్వారా నడపబడుతున్నాయని ఆయన నొక్కి చెప్పారు. యుఎన్ లో భారతదేశ శాశ్వత మిషన్ అధికారిక ఎక్స్ హ్యాండిల్లో భాగస్వామ్యం చేసిన పోస్ట్లో భారత శాశ్వత ప్రతినిధి, పీ. హరీష్, యుఎన్ సౌత్-సౌత్ కోఆపరేషన్ డే సందర్భంగా దేశం ప్రకటనను విడుదల చేశారు. భారతదేశం గ్లోబల్ సౌత్ కోసం స్థిరంగా పని చేసింది. మరింత సమానమైన స్థిరమైన ప్రపంచాన్ని సృష్టించడానికి కట్టుబడి ఉందని అన్నారు. దేశాల మధ్య సహకారం ప్రాముఖ్యతను రాయబారి హరీష్ నొక్కిచెప్పారు. ముఖ్యంగా ఒకదానితో ఒకటి అనుసంధానించబడిన సరిహద్దులను గుర్తించలేని సవాళ్లను ఎదుర్కొంటున్న ప్రపంచంలో 2017 నుండి, భారతదేశం యుఎన్ డెవలప్మెంట్ పార్టనర్షిప్ ఫండ్కు దాదాపు 150 మిలియన్లను అందించిందని, 60 దేశాలలో 82 ప్రాజెక్టులకు మద్దతునిచ్చిందని, ఇది ప్రపంచ అభివృద్ధికి భారతదేశ నిబద్ధతకు స్పష్టమైన ప్రతిబింబమని ఆయన వెల్లడించారు.

## రామాంజనేయ గణేష్కు ఘనంగా పూజలు



**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు పట్టణంలోని స్థానిక వివేకానంద విగ్రహం దగ్గర రామాంజ నేయ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ గణనాథుని ఏర్పాటు చేశారు. ఏడవ రోజు పూజల్లో భాగంగా పట్టణ బీజేపీ నాయకులు గోజే ఆనంద్, గోజే విజయ్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సంవత్సరం లడ్డును దక్కించుకోవాలంటే 51 రూపాయలు పెట్టి టికెట్ తీసుకొని డ్రాలో లడ్డును గెలుపొందగలరని నిర్వాహకులు శ్రీకాంత్ సింగ్, ఎర్రవోలు మహేష్, భరత్, కోరే రవి తెలియజేశారు.

## ఇండియన్ ఉమెన్స్ హాకీ టీం జ్యోతి ఎంపిక



**విశ్వంభర,హైద్రాబాద్ :** భారత మహిళల హాకీ జట్టుకు ఎంపికైన క్రీడాకారిని ఎదుళ్ల జ్యోతిని స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కే శివసేనారెడ్డి అభినందించారు. తన తండ్రితో కలిసి తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డిని మర్యాదపూర్వకంగా జ్యోతి కలిసారు. ఆమె శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు ఈ సందర్భంగా చైర్మన్ శివసేన రెడ్డి మాట్లాడుతూ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అకాడమిక్ చెందిన జ్యోతి ఇటీవల జూనియర్ హాకీ వరల్డ్ కప్ జట్టులో ఆడి ప్రతిభ చూపించిన జ్యోతి కి మంచి భవిష్యత్తు ఉందని చెప్పారు. సబ్ జూనియర్ నేషనల్ ఛాంపియన్ షిప్ లు, నేషనల్ ఛాంపియన్ షిప్ లలో ఖేలో ఇండియా గేమ్స్ యూనివర్సిటీ గేమ్స్ లలో పాల్గొన్న జ్యోతి అదుభతమైన ప్రతిభ కనబరిచారాని ఆయన అన్నారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ తరఫున జ్యోతి కి సంపూర్ణ సహాయ సహకారాలు అందజేస్తామని ఈ సందర్భంగా చైర్మన్ హామీ ఇచ్చారు.

## పోచారంను కలిసిన షబ్బీర్ అలీ



**విశ్వంభర, కామారెడ్డి :** బాన్సువాడ నియోజకవర్గం ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డికి ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరారు. పోచారం శ్రీనివాస్ రెడ్డికి కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ సలహాదారులుగా పదవి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా కాంగ్రెస్ కామారెడ్డి సీనియర్ నాయకులు ప్రభుత్వ సలహాదారులు మహ్మద్ షబ్బీర్ అలీ పుష్పగుచ్ఛమిచ్చి సత్కరించారు. ఈ కార్యక్రమంలో భాస్కర్ రెడ్డి, బాలరాజ్ పాల్గొన్నారు.

## సమగ్ర కులగణన చేయాల్సిందే




**విశ్వంభర, హైద్రాబాద్ :** ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు జి. కిరణ్ కుమార్, తెలంగాణ అధ్యక్షులు శివ ముదిరాజ్, విద్యార్థిని నాయకురాలు వసుమతి యాదవ్ ల ఆధ్వర్యంలో సత్య గ్రహ దీక్ష దేశవ్యాప్తంగా సమగ్ర కులగణన చేయాలని, ఓబీసీ రిజర్వేషన్స్ 50%సీలింగ్ను ఎత్తివేయాలని, ఓబీసీ లకు విద్య, ఉద్యోగ,(చట్ట సభల్లో) రాజకీయ రంగాలలో ఓబీసీలకు 50% రిజర్వేషన్స్ బిల్లును వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశ పెట్టి పార్టీ లకు అతీతంగా మద్దతు ఇచ్చి పాస్ చెయ్యాలని ప్రధాన డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిధిగా మేకపోతుల నరేందర్ గౌడ్ రాష్ట్ర అధ్యక్షులు తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం, ఎర్ర శ్రీహరి గౌడ్ ఉపాధ్యక్షులు బీసీ సంక్షేమ సంఘం, కాడబోయిన మల్లేష్ యాదవ్,గిరగాని బిక్షపతి గౌడ్, రాష్ట్ర కార్యదర్శి, పెంట అజయ్ పటేల్ తెలంగాణ బీసీ విద్యార్థి సంక్షేమ సంఘం,పలు బీసీ సంఘాలు, బీసీ నాయకులు పాల్గొన్నారు,

## సమాఖ్య ఆధ్వర్యంలో అన్నప్రసాదం



**విశ్వంభర,నారాయణపూర్ :** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో స్థానిక చౌరస్తాలో చౌరస్తా యువజన సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అన్నప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది, ముఖ్యఅతిథిగా స్థానిక ఎస్సై జగన్ విచ్చేసి పూజా కార్యక్రమాల్లో పాల్గొని అన్నప్రసాద కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామ ప్రజలకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు కమిటీ సభ్యులు తెలిపారు,ఈ కార్యక్రమంలో చౌరస్తా యువజన సమాఖ్య కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం




**విశ్వంభర, రామన్నపేట:** రామన్నపేట మండలం, ఇంద్రపాల నగరం గ్రామానికి చెందిన నల్ల బాలరాజు(గ్రామ పంచాయతి వర్కర్), ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, 10,000 వేల రూపాయల ఆర్థిక సహాయం ఎమ్మెల్యే వేముల వీరేశం అందజేశారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఎంపీపీ పూస బలమణి-బాలనర్సింహ, నాయకులు గంగుల రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జనాల్లో జాగ్రత్తలు పాటించాలి: కే ఎల్ ఆర్



**విశ్వంభర, మహేశ్వరం:** మహేశ్వరం నియోజక వర్గంతో పాటు యావత్ తెలంగాణలో జోరుగా సాగుతున్న మహా గణపతుల నిమజ్జనాల్లో జాగ్రత్తలు పాటించాలని మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి కోరారు.యువకులు తప్పకుండా పోలీసు వారి సూచనలు నిబంధనలు పాటించాలని కేఎల్ఆర్ విజ్ఞప్తి చేశారు. జులూస్ తోపాటు స్వామి వారి ఊరేగింపులో టపాసులు కాల్చేటప్పుడు వాహనదారులకు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని యువతకు కిచ్చెన్న సూచించారు. నవరాత్రులు ఎంతో నిష్టతో చేసి శోభా యాత్రలో మద్యం సేవించి రావటం తప్పు. కాబట్టి మంచి ఆధ్యాత్మిక చింతనతో బొజ్జగణపయ్యను వీడ్కోలు పలకాలని లక్ష్మారెడ్డి తెలిపారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చీమలదండు లాగా క్యూ నిబంధనలు పాటించాలన్నారు కేఎల్ఆర్. చెరువులు, హుస్సేన్ సాగర్ తీరాన తెలంగాణ ప్రభుత్వం నిమజ్జ నాలకు ఏర్పాట్లు చేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుందని నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కేఎల్ఆర్ గుర్తు చేశారు.

## తెలంగాణ విలీన వారోత్సవాలు




**విశ్వంభర,ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్ (ఎం)మండలం ఈనెల(సెప్టెంబరు)11వ తేదీ నుండి 17వ తేదీ వరకు జరిగే తెలంగాణ సాయుధ పోరాట విలీనోత్సవ సభలలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పుల ముత్యాలు కోరారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన సిపిఐ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారతదేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్రం వచ్చినప్పటికీ నైజాం రాజు పరిపాలనలోనే తెలంగాణ ఎనిమిది జిల్లాలు, మహారాష్ట్ర ఐదు జిల్లాలు, కర్ణాటక మూడు జిల్లాలు భారతదేశంలో విలీనం కాలేదని, నాడు తెలంగాణ సాయుధ పోరాటంతో 1948 సెప్టెంబర్ 17న తెలంగాణ విముక్తి చెంది, భారతదేశంలో విలీనం అయిందని అన్నారు. తెలంగాణ విలీన వారోత్సవాలను ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. జల్ది రాములు, బొబ్బల లాల్ రెడ్డి, కసరబోయిన సత్తయ్య, యాస బుచ్చిరెడ్డి, సుల్తాన్ పురుషోత్తం, సోమనబోయిన నరసింహ, పంజాల ఆంజనేయులు బత్తిని లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

## అల్లర్లు సృష్టిస్తే వదిలే ప్రసక్తే లేదు




**విశ్వంభర, మెట్ పల్లి :** మెట్ పల్లి సర్కిల్ పరిధిలో ఈ నెల 16, 17 తేదీల్లో జరిగే వినాయక నిమజ్జనం సందర్భంగా ఎవరైనా అల్లర్లు సృష్టిస్తే వారిపై రౌడీ షీట్లు తెరుస్తామని పోలీస్ శాఖ హెచ్చరించింది. నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరగడానికి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గట్టి చర్యలు తీసుకుంటున్నామని సీఐ తెలిపారు. ఎవరైనా నిమజ్జనం రోజున అల్లర్లు చేసి ఆటంకం కలిగిస్తే వారిపై కూడా రౌడీ షీట్లు తెరుస్తాంఅని రౌడీ షీట్ల తో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంగిస్తే చట్ట పరమైన చర్యలు ఉంటాయని అన్నారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరగడానికి అందరూ పోలీసులకు సహకరించాలని కోరుతున్నాం అని సీఐ నిరంజన్ రెడ్డి అన్నారు.

## గంజాయి నిందితులు అరెస్టు



**విష్వమ్భరా, మహబూబాబాద్:** నెల్లి కుదుర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ద్విచక్ర వాహనం పై గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు నిందితులను నెల్లికుదురు ఎస్.ఐ రమేష్ బాబు సిబ్బందితో కలిసి పట్టుకోవడం జరిగింది. ఉదయం సమయం 09. 00 గంటలకు నమ్మదగిన సమా చారం మేరకు మహబూబాబాద్ నుం డి నెల్లికుదుర్ మీదుగా తొర్రుర్ వైపు ద్విచక్ర వాహనం పై గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి 1,26,750/- రూపాయలు విలువ గల 5.కేజీ 070 గ్రాముల నిషేదిత గంజాయిని స్వాదినం చేసుకోని బైక్ సీజ్ చేసారు. నిందితులను రిమాండ్ కొరకు కోర్ట్ ముందు హాజరు పరచారు. కేసులోనిందితులను పట్టుకున్న నెల్లికుదురు ఎస్.ఐ రమేష్ బాబు సిబ్బందిని జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాధ్ కేకన్ అభినందించారు.

## చల్లా నరసింహారెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు



**విశ్వంభర, మహేశ్వరం:** రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పెద్దలు అభిమాన నాయకులు చల్లా నర్సింహారెడ్డి పుట్టిన రోజు సందర్భంగా జిల్లా పార్టీ ఆఫీసులో మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కోళ్లపడకల్ చేపంగి ప్రవీణ్ ఆయనను శాల్వతో సన్మానించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

# మోడల్ స్కూల్స్‌లో 11 ఏండ్ల తర్వాత బదిలీలు..

### 2757 మంది టీచర్లు ట్రాన్స్‌ఫర్



**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రంలోని ఆదర్శ పాఠశాలల్లో పనిచేస్తున్న దాదాపు మూడు వేల మంది టీచర్ల చిరకాల వాంఛ ఎకేలకు నెరవేరింది. 11 ఏండ్లుగా ట్రాన్స్‌ఫర్స్ కోసం ఎదురు చూస్తున్న టీచర్ల కోరక ఫలించనుంది. మోడల్ స్కూల్స్‌లో ప్రిన్సిపళ్లు, పీజీటీ, టీజీటీల బదిలీలకు సంబంధించి ఉత్తర్వులు జారీచేసింది. దీంతో 89 మంది ఆదర్శ ప్రిన్సిపల్స్, 1923 మంది పీజీటీలు, 745 మంది టీజీటీలు మొత్తం 2757 మందికి త్వరలో స్థానచలనం కలుగనుంది. ఈ మేరకు మోడల్స్ స్కూల్స్ అదనపు డైరెక్టర్ ఆదేశాలు జారీచేశారు.మోడల్ స్కూళ్లలోని ఉపాధ్యాయులు 2013, 2014లో రెండు విడుతల్లో నియమితులయ్యారు. అప్పటి నుంచి ఒక్కసారి కూడా బదిలీలు జరుగలేదు. దీంతో గత మూడేండ్లుగా ట్రాన్స్‌ఫర్ చేయాలని డిమాండ్ చేస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో గతేడాది జులైలో బదిలీలకు షెడ్యూల్ జారీచేసింది. వారంతా వెబ్ ఆప్షన్లు కూడా నమోదుచేసుకున్నారు. అయితే సర్వీస్ పాయింట్ల కేటాయింపుపై కొందరు హైకోర్టు మెట్లెక్కారు. దీంతో కోర్టు స్టే ఇవ్వడంతో బదిలీల ప్రక్రియ నిలిచిపోయింది. తాజాగా మెరిట్ ప్రకారం సీనియారిటీ జాబితా తయారు చేసి బదిలీలు చేపట్టవచ్చని హైకోర్టు తీర్పునిచ్చింది. ఉద్యోగాల్లో చేరిన తేదీని ఆధారంగా చేసుకుని ఎన్‌టైటిల్‌మెంట్ పాయింట్లు కేటాయించాలని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో టీచర్లను ట్రాన్స్‌ఫర్‌కు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది.

## ఆస్తి కోసం బామ్మర్దిని హతమార్చి.. ఆత్మహత్యగా చిత్రీకరించిన బావ

### ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

### ముగ్గురి అరెస్టు, రిమాండుకు తరలింపు



**విశ్వంభర, హైదరాబాద్:** ఆస్తి కోసం ఓ వ్యక్తి తన బామ్మర్దిని హతమార్చి.. ఆత్మహత్యగా చిత్రీకరించిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. హైదరాబాద్ గచ్చిబౌలి పోలీసు స్టేషన్ పరిధిలో 15 రోజుల కిందట చోటు చేసుకున్న ఈ దురాగతం వివరాలను మాదాపూర్ ఏసీపీ శ్రీకాంత్ శనివారం మీడియాకు వెల్లడించారు. నెల్లూరు జిల్లా కావలి పట్టణంలోని ఉత్తర జనతాపేటలో నివసించే మద్దసాని ప్రకాశం బంగారు వ్యాపారంతో బాగానే గడించారు. తన కుమారుడు యశ్వంత్, కుమార్తె అమూల్య భవిష్యత్తుకు బంగారుబాటలు వేయాలని కలలుకన్నారు. రెండేళ్ల కిందట కుమార్తెను కొండాపురం మండలం సత్యవోలు అగ్రహారానికి చెందిన శ్రీకాంత్కు ఇచ్చి పెళ్లి చేశారు. అల్లుడు హైదరాబాద్ లోని గచ్చిబౌలి ప్రాంతంలో పీజీ(పేయింగ్ గెస్ట్) హాస్టళ్లు నిర్వహిస్తూ ఉంటాడు. ఇటీవల ఎన్నికల్లో... తర్వాత క్రికెట్ మ్యాచ్లో పందేలు కాచి రూ. అయిదు కోట్ల వరకు నష్టపోయాడు. ఒక్కసారి అంత మొత్తం నష్టపోవడంతో అప్పుల వాళ్ల వేధింపులు అధికమయ్యాయి. వాటిని తాళలేక.. అత్తింటి ఆస్తి కాజేయాలనే ఆలోచనకు వచ్చాడు. అడ్డుగా ఉన్న బామ్మర్దిని లేపేస్తే ఆస్తి మొత్తం తనకే. వస్తుందని ప్రణాళిక రచించాడు. దానికి తగ్గట్టుగా తన స్నేహితుడు ఆనంద్కు రూ.10లక్షలు సుపారీ ఇచ్చాడు. ఆనంద్, వెంకటేష్తో కలిసి శ్రీకాంత్.. సెప్టెంబరు ఒకటో తేదీ అర్ధరాత్రి హాస్టల్లోని యశ్వంత్ గదికి వెళ్లి చున్నీతో గొంతు నులిమి హత్య చేశారు. ఆత్మహత్యగా చిత్రీకరించి కారులో ఏపీ సరిహద్దు వరకు తీసుకెళ్లి అక్కడి నుంచి అంబులెన్స్లో నెల్లూరు తీసుకెళ్లారు.యశ్వంత్ ఆత్మహత్య చేసుకున్నాడని, అక్కడే ఉంటే పోలీసు కేసు అయ్యి హాస్టల్ బిజినెస్ దెబ్బతింటుందని అత్తమామలు, భార్యకు అనుమానం రాకుండా నమ్మించాడు. అంత్యక్రియలు అయిన కొన్ని రోజులకు కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చింది. హాస్టల్లోని సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో అనుమానం మరింత బలపడి.. ఈనెల 10న యశ్వంత్ తండ్రి గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. శ్రీకాం తన్ను అదుపులోకి తీసుకుని విచారించగా హత్యోదంతం బయటపడింది. శ్రీకాంత్‌తో పాటు మరో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాం డ్కు తరలించారు. నిందితుల వద్ద నుంచి రూ.90వేల నగదు, నాలుగు సెల్ఫోన్లు, హత్యకు ఉపయోగించిన చున్నీ, కారు, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నారు.

## మాజీ మంత్రి ఆర్ దామోదర్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు



**విశ్వంభర,సూర్యాపేట:** మాజీ మంత్రి, సూర్యాపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి శ్రీ రాంరెడ్డి దామోదర్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు స్థానిక రెడ్ హౌస్ నందు ఘనంగా జరిగాయి. నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కేకుల కటింగులు, అన్న దానాలు, విద్యార్థులకు పుస్తకాల, పెన్నుల పంపిణి, అనాధ శరణాలయాలకు బియ్యం, నిత్యావసర వస్తువుల పంపిణి, వరద బాధితులకు సబ్బులు, బ్రెడ్ ప్యాకెట్ల పంపిణి తదితర కార్యక్రమాలు చేపట్టి రెడ్ హౌస్ కు విచ్చేసి తమ అభిమాన నాయకునికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియ చేశారు. ఈ సందర్భంగా దామన్న మాట్లాడుతూ కార్యకర్తలే నా బలం, బలగం అని, వేలాదిగా తరలి వచ్చి శుభాకాంక్షలు తెలిపినందుకు ధన్యవాదాలు తెలిపారు.

## బ్రిడ్జిలు అన్ని పూర్తి - యధావిధిగా బస్సులు

**విశ్వంభర, మహబూబాబాద్:** 15/ 09/ 24 నుండి మహబూబాబాద్ డిపో నుండి వివిధ రూట్లలో బస్సులను పునరుద్ధరించబడినవి అని డిపో మేనేజర్ ఎంశివ ప్రసాద్ తెలియజేసారు. మహబూబాబాద్ నుండి సూర్యాపేటకు వెళ్ళు బస్సులను మహబూబాబాద్ చిన్న గూడూరు –ఎల్లంపేట క్రాస్ రోడ్ –మరిపెడ బంగ్లా మీదుగా సూర్యాపేటకు నడుపుతున్నామని అన్నారు. మహబూబాబాద్ నుండి ధర్మారంకు షటిల్స్ నడపబడును. మహబూబాబాద్ నుండి ఖమ్మం రూట్ నందు ములకలపల్లి వద్ద తాత్కాలికంగా బ్రిడ్జిలు మరమ్మత్తులు చేయడం వల్ల బస్సులను మహబూబాబాద్ ములకలపల్లి మీదుగా నడపబడును. కావున ప్రయాణికులు ఇట్టి సౌకర్యాన్ని వినియోగించుకోవాలని డిపో మేనేజర్ ఎం శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలియజేసారు. అన్ని రూట్లో యధావిధిగా బస్సులు నడుపుటకు ప్రయత్నం చేయుచున్నామని ఆయన తెలిపారు ప్రజలకు జరిగే అసౌకర్యానికి చింతిస్తున్నామని అన్నారు.

## మహాగణపతిని దర్శించుకున్న జాతీయ నాయకులు



**విశ్వంభర, మహేశ్వరం:** సరూర్ నగర్ డివిజన్ లోని హుడా కాంప్లెక్స్ లో పాంచజన్య యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహా గణనాథుడిని జాతీయ నాయకులు మురళీధర్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గ ఇన్చార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ తో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పాంచజన్య యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు పెరాల శేఖర్ జి, రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు ఆరుట్ల సురేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టా ఉపేందర్ రెడ్డి, సరూర్నగర్ డివిజన్ అధ్యక్షులు సిద్దు ముదిరాజ్, చిన్న సురేష్ ముదిరాజ్, రంజిత్, కిరణ్, మాజీ కౌన్సిలర్ స్వరూప, మహిళా మోర్చా నాయకురాలు రాజ్యలక్ష్మి, బీజేపీ, బీజేవైఎం నాయకులు మరియు ఉత్సవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

## లడ్డు వేలం పాట 64,101 రూపాయలు



**విశ్వంభర, సంగారెడ్డి:** అమీన్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని అమీన్పూర్ గ్రామంలో మాలబస్తి ఆధ్వర్యంలో గత 15 సంవత్సరాల నుండి నవరాత్రి ఉత్సవాలను ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. 8 రోజుల పాటు ఎంతో నిష్టగా పూజా కార్యక్రమాలు నిర్వహించి నిమజ్జనం కార్యక్రమంలో మొదటిగా లడ్డు వేలంపాట వేయడం జరిగింది. అందులో 64,101 రూపాయాలకు బి.ఆర్.ఎస్ సీనియర్ నాయకులు కాటా సునీత రాజు గౌడ్ లడ్డును కైవసం చేసుకున్నారు.. లడ్డు తీసుకున్న వారిని శాలువా తో గణేష్ ఉత్సవ కమిటీ మెంబర్స్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కాటా సునీత రాజు గౌడ్ మాట్లాడుతూ మా గ్రామంలో మా మామ సర్పంచ్ గా చేసినప్పుడు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశారు. దాని దృష్టిలో పెట్టుకొని అమీన్పూర్ లో మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేయాలని ఉద్దేశంతో రాజకీయాలకు రావడం జరిగిందని అన్నారు. ఏదైనా ఊరు నుంచే మొదలు పెట్టాలి కాబట్టి ఆ వినాయకుని ఆశీర్వాదం ప్రతి ఒక్కరి మీద ఉండాలని ఆ స్వామివారి లడ్డును కొనడం జరిగిందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలందరినీ అమీన్పూర్ మున్సిపాలిటీ ప్రజలందరినీ ఆ స్వామివారు చల్లగా చూడాలని కోరుకుంటున్నామని ఈ సందర్భంగా సునీత రాజు గౌడ్ తెలిపారు. బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కాటా సునీత రాజు గౌడ్, కొండకల శీను, గణేష్ ఉత్సవ కమిటీ మెంబర్స్,మాల బస్తి యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కొడంగల్‌లో ఫార్మా కంపెనీని అడ్డుకుంటాం : మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి



**విశ్వంభర, మద్దూరు(కోస్గి):** కొడంగల్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసే ఫార్మా కంపెనీని అడ్డుకొని తీరుతామని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం నారాయణపేట జిల్లా కోస్గిలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఏడు గ్రామాల పరిధిలో వేల ఎకరాల్లో ఫార్మాసిటీని నిర్మిస్తున్నారని తెలిపారు. సీఎం రేవంత్‌ను సూటి ప్రశ్న అడుగుతున్నా.. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గంలో 13 వేల ఎకరాలను కేటాయించిందని గుర్తు చేశారు. సిద్ధంగా ఉన్న స్థలంలో ఫార్మా ఏర్పాటు చేయకుండా కొడంగల్‌కు ఎందుకిచ్చారో చెప్పాలని నిలదీశారు. ఇప్పటికే స్థానిక రైతులు ఈ కంపెనీ రాకను వ్యతిరేకిస్తున్నారని, ఇప్పటికైనా ఫార్మా కంపెనీ ఏర్పాటును విరమించుకోవాలన్నారు. కోస్గి పట్టణం సమీపంలో పొల్యూషన్ కంపెనీలు ఎందుకు ఏర్పాటు చేస్తున్నారని నరేందర్ రెడ్డి ప్రశ్నించారు. ఈ ప్రశ్నలకు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై రౌడీలు దాడి చేయడాన్ని అందరూ ఖండించాలన్నారు. బీఆర్ఎస్ నుంచి గెలిచి పార్టీ మారిన ఎమ్మెల్యేలకు దమ్ముంటే రాజీనామా చేసి తిరిగి కాంగ్రెస్ బీఫాంపై గెలవాలన్నారు. కొడంగల్‌లో 30 శాతం మాత్రమే రుణమాఫీ జరిగిందని, పూర్తిస్థాయిలో అర్హులైన రైతులకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



**విశ్వంభర,హైద్రాబాద్:** ప్రముఖ పారిశ్రామిక వేత్త గుంటి శ్రీదర్ రావు తన కుమారుడు అభి శ్రీ సత్యంతో కలిసి గణేష్ నవరాత్రి ఉత్సవాల లోపాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# భర్తను చంపించిన భార్య..

### విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు చిత్రీకరించే యత్నం



**విశ్వంభర, మల్దకల్ :** మనువాడిన భర్తనే ఓ భార్య మట్టుబెట్టింది. అయితే అతను విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు చిత్రీకరించే ప్రయత్నం చేసింది భార్య. అనుమానంతో కుటుంబ సభ్యులు ఆమెను నిలదీయగా.. తానే చంపినట్లు ఒప్పుకుంది. ఈ ఘటన జోగులాంబ గద్వాల జిల్లాలో వెలుగు చూసింది.జోగులాంబ గద్వాల జిల్లా మద్దెలబండకు చెందిన బోయ చిన్న నర్సింహులు శుక్రవారం పొలం వద్ద అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. నర్సింహులు శరీరంపై దెబ్బలు ఉండడంతో అతడి తల్లిదండ్రులు, బంధువులకు అనుమానం కలిగింది. చిన్న నర్సింహులు భార్య పద్మ నడవడికపై అనుమానంతో శనివారం ఉదయం ఆమెను నిలదీశారు. సరైన సమాధానం రాకపోవడంతో చితకబాదారు. దెబ్బలు తాళలేక నిజం చెప్పింది. గ్రామానికి చెందిన దుబ్బన్నతోపాటు గట్టు మండలంలోని రాయపురం గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులతో కలిసి తన భర్తను హత్య చేయించినట్లు ఒప్పుకొన్నది.కాగా ముందుగా అనుమానాస్పద మృతిగా.. తర్వాత విద్యుదాఘాతంతోనే నర్సింహులు మృతి చెందినట్లు కేసు నమోదు చేయడానికి ఏఎస్సై ఈశ్వరయ్య ప్రయత్నించగా.. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు మృతదేహాన్ని తీసుకొచ్చి మల్దకల్ మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద రోడ్డుపై ఉంచి రాస్తారోకో చేపట్టారు. కొందరు కావాలనే హత్య చేశారని, వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.హత్య చేసిన వారిని అరెస్టు చేయకుంటే ఆత్మహత్య చేసుకుంటామని పెట్రోల్ బాటిళ్లతో కొందరు బంధువులు హెచ్చరించారు. దాదాపు ఐదు గంటలపాటు ధర్నా చేపట్టడంతో వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఈ విషయం తెలుసుకొన్న సీఐ నాగేశ్వర్‌రెడ్డి అక్కడకు చేరుకొని వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేసినా వారు వినలేదు. హత్యకు కారణమైన అనుమానితుల పేర్లు ఎఫ్ఐఆర్‌లో నమోదు చేసి, అందరికీ శిక్ష పడేలా చూస్తామని ఏఎస్పీ గుణశేఖర్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

## నలుగురు దొంగలను పట్టుకున్న మద్దిరాల, సిసిఎస్ పోలీసులు

విశ్వంభర, సూర్యాపేట: జిల్లా పోలీసు కార్యాలయం నందు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేసు వివరాలు జిల్లా ఎస్పి సన్ ప్రీత్ సింగ్ వెల్లడించారు. నిందితులు గ్రామాలలో, పొలాల వద్ద రక్కి చేసి పొలాల వద్ద, రోడ్ల పక్కన రైతులు పెట్టిన ట్రాక్టర్ ట్రక్కు లను గుర్తించి దొంగలిస్తారు. ఇలా దొంగలించిన ట్రాలీలను తక్కువ ధరకు ఇతర రైతులకు అమ్మడం చేస్తున్నారని గుర్తించాము అని ఎస్పి గారు అన్నారు.మద్దిరాల ఎస్ఐ తన సిబ్బందితో మద్దిరాల అడ్డ రోడ్డు వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా కుంటపల్లి వైపు నుంచి 05 ఖీూ 5840 నంబర్ గల పల్సర్ బైక్‌పై ఇద్దరు, స్వరాజ్ ట్రాక్టర్ ఇంజన్‌పై ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా వస్తుండగా, వారిని గమనించిన మద్దిరాల ఎస్ఐ. తన సిబ్బందితో కలిసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించారు. నల్గొండ జిల్లాకు చెందిన నింధితులు నలుగురు సంపంగి మహేశ్, సంపంగి సత్యం, ఒర్సు వెంకన్న, అలకుంట్ల మహేశ్ కలిసి 2023 అక్టోబర్ నెలలో పోలుమళ్ల గ్రామం నుంచి చిల్పకుంట్ల గ్రామానికి వెళ్లే మార్గంలో పొలాల్లో షేడ్స్‌లో ఉంచిన రెండు ట్రాక్టర్ ట్రాలీలను దొంగతనం చేసినట్లు అంగీకరించారు. దీనిపైపోలుమల్ల గ్రామానికి చెందిన ఎల్లు జగన్ మరియు రామారెడ్డి గార్లు మద్దిరాల పీఎస్‌లో పిర్యాధు చేసినారు. బాధితుల పిర్యాధు మేరకు మద్దిరాల పీఎస్‌లోని నేరం సంఖ్య 206/2023, సెక్షన్ 379 ఐపిసి ప్రకారం కేసు నమోదు చేశారు. నింధితులు నేరాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారు. ట్రాలీల చోరీ కేసులో నలుగురు నిందితులను ఆధుపులోకి తీసుకుని దర్యాప్తు చేయడం జరిగినది.విచారణలో భాగంగా నింధితులు మునగాల, పెన్‌పహాడ్, మిర్యాలగూడ రూరల్, నాగారం, మద్దిరాల,గుర్రంపోడు, నూతనకల్, మోతె, గరిడేపల్లి, శాలిగౌరారం, సూర్యాపేట రూరల్, కేతేపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో మొత్తం 18 ట్రాక్టర్ల ట్రాలీలు చోరీ కేసులున్నట్లు నిందితులు అంగీకరించారు. గుర్తించిన కేసుల్లో 19 ట్రాక్టర్ ట్రాలీలు, ఒక ఇంజన్, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకునివీరిని రిమాండ్‌కు తరలించారు. నల్గొండ జిల్లా హాలియా మండలం మారేపల్లి గ్రామం ఏ1 నిందితుడి ఇంటి నుంచి 20 లక్షల 92 వేలు విలువగల మొత్తం 19 ట్రాలీలు, నింధితులు పట్టుబడి సమయంలో ఉపయోగించిన 2 లక్షల విలువగల ఒక స్వరాజ్ ట్రాక్టర్ ఇంజన్, ఒక పల్సర్ బైక్‌స్వాదినం చేసుకోవడం జరిగినది. సూర్యాపేట జిల్లాలో 11 దొంగతనాలు, నల్గొండ జిల్లాలో 7 దొంగతనాలకు పాల్పడ్డారు. ఈ 18 కేసులు కాకుండా నింధితులు ఏ1సంపంగి మహేశ్, ఏ2 సంపంగి సత్యం, ఏ3–ఒర్సు వెంకన్న గతములో 12 కేసుల్లో నేర చరిత్ర కలిగి ఉన్నారు. ఏ1 మహేష్, ఏ3 వెంకన్న లను రాచకొండ కమిషనరేట్ ఆదిభట్ల పోలీసు స్టేషన్ వారు ట్రాక్టర్ ట్రాలీ కేసులో జైలుకు పంపారు.ఈ కేసుల చేధనలో పని చేసిన సీసీఎస్ ఇన్స్పెక్టర్ శివ కుమార్, తుంగతుర్తి సీఐ శ్రీను, సీసీఎస్ ఎస్ఐ శ్రీకాంత్, మద్దిరాల ఎస్ఐ వీరన్న, పర్యవేక్షణ చేసిన డీఎస్పీ రవి, సీసీఎస్ సిబ్బంది వెంకన్న, శ్రీనివాస్, గురు స్వామి, మల్లేష్, ఆనంద్, శివ, సతీష్, ప్రభాకర్ లను ఎస్పీ అభినందించి రివార్డ్ అందించారు. నింధితుల ఏ1 సంపంగి మహేష్ మారేపల్లి గ్రామం, హాలియా మండలం, నల్గొండ జిల్లా, ఏ2 సంపంగి సత్యం, గోరెంకలపల్లి, నక్రేకల్, నల్గొండ. ఏ3 ఓర్సు వెంకన్న, చెర్ల గౌరారం గ్రామం, కనగల్ మండలం, నల్గొండ జిల్లా,ఏ4 ఆలకుంట్ల మహేష్, మారేపల్లి, అనుముల (మ), నల్గొండ, ప్రెస్ మీట్ నందు ఏఆర్ అదనపు ఎస్పీ జానార్ధన్ రెడ్డి, సూర్యాపేట డీఎస్పీ రవి, తుంగతుర్తి సీఐ శ్రీను, సీసీఎస్ ఇన్స్పెక్టర్ శివ కుమార్, ఎస్ఐ లు శ్రీకాంత్, వీరన్న, సీసీఎస్ సిబ్బంది ఉన్నారు.

## బిజెపి పార్టీ సభ్యత్వ నమోదు



**విశ్వంభర, వికారాబాద్ :** వికారాబాద్ జిల్లా పరిధిలోని ధరూర్ మండల భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ధరూర్ మండల కేంద్రంలో బిజెపి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం మండల పార్టీ అధ్యక్షులు రమేష్ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. బిజెపి పార్టీ జిల్లా అధ్యక్షులు మాధవ రెడ్డి హాజరయ్యారు. జిల్లా అధ్యక్షుడు కే మాధవరెడ్డి రాజు నాయక్ కు సభ్యత్వ నమోదు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సభ్యత్వ నమోదు ఇంచార్జ్ వివేకానంద రెడ్డి సీనియర్ నాయకులు పాండు గౌడ్ కేపీ రాజు రాజేందర్ గౌడ్ నరేందర్ రెడ్డి కృష్ణ రాజు నాయక్ అంజయ్య శ్రీనివాస్ విశ్వనాథం గోవర్ధన్ రెడ్డి విజయలక్ష్మి మండల ప్రధాన కార్యదర్శి రాఘవేందర్ గౌడ్ మణికంఠ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అన్నదానం మహాదానం: సీఐ శివప్రసాద్



**విశ్వంభర, కడ్తాల్:** మైసిగండి గ్రామంలోని మైసిగండి దేవస్థానం వద్ద ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో శనివారం పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ పద్మశ్రీ దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కడతాల్ సీఐ శివ ప్రసాద్ విచ్చేసి గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వ ర్యంలో అన్నదాన కార్యక్ర మాన్ని ప్రారంభించారు. అయిళ్ల లక్ష్మమ్మ, జోహార్ లాల్, హిరాసింగ్, లక్ష్మణ్, అమ్రు, అమర్ సింగ్, కిషన్, బోణి శంకర్, ప్రవీణ్, రమేష్, యాదయ్య గౌడ్, పల్లేష్ గౌడ్, సుగంద్ గౌడ్, దశరథ్, వెంకటేష్, మధు, తులసిరాం, పాల్గొన్నారు.

# గల్ఫ్ కార్మికుల కోసం గల్ఫ్ సంక్షేమ బోర్డు

- మరణించిన గల్ఫ్ కార్మికుల కుటుంబానికి 5 లక్షల ఎక్స్‌గ్రేషియా
- ప్రజా భవన్ లో జరిగే ప్రజా వాణిలో గల్ఫ్ బాధితుల కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు
- గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం తీసుకోవల్సిన చర్యల పై సలహాలు, సూచనలు
- సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్



**విశ్వంభర,హైదరాబాద్ :** గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం తీసుకోవాల్సిన చర్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన గల్ఫ్ కార్మికులు అధికంగా ఉండే నియోజకవర్గ ఎమ్మెల్యేలు ఇతర ముఖ్య నేతలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, టిపిసిసి ఎన్ఆర్ఐ సెల్ వినోద్ ఆధ్వర్యంలో రూపొందిన గల్ఫ్ బాధితులకు సంబంధించిన 5 అంశాల పై సమావేశంలో చర్చించారు. అందులో ప్రధానంగా గల్ఫ్ కార్మికుల సంక్షేమంపై అధ్యయనం చేయడానికి ప్రభుత్వం ఒక సలహా కమిటీ నీ ఏర్పాటు చేయాలని అందులో గల్ఫ్ ప్రభావిత ప్రాంత ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు , నాయకులు ఈ కమిటీ లో సభ్యులుగా నియమించి ఇందుకోసం జీవో విడుదల చేయాలని సూచించారు. హైదరాబాద్ ప్రజా భవన్ లో ప్రతి మంగళవారం , శుక్రవారం ప్రజావాణి లో గల్ఫ్ కార్మికుల కోసం ప్రవాసి ప్రజావాణి నిర్వహిస్తే బాగుంటుందని సూచించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రస్తుతం నిర్వహిస్తున్న ప్రజావాణి లో ఈనెల 20 వ తేది నుండి గల్ఫ్ కోసం ప్రత్యేక కౌంటర్ ప్రారంభిస్తామని తెలిపారు. గురుకుల పాఠశాలలో, కళాశాలలో గల్ఫ్ కార్మికుల పిల్లలకు గురుకులాల్లో చదవాలని అనుకునే వారికి 100 శాతం అడ్మిషన్ ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 7 డిసెంబర్ 2023 నుండి గల్ఫ్ దేశాల్లో మరణించిన కార్మికుల కుటుంబాలకు 5 లక్షల ఎక్స్ గ్రేషియా ఇచ్చేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. గతంలో చనిపోయిన వారి కుటుంబాలకు మానవతా దృక్పథంతో లక్ష రూపాయల ఎక్స్ గ్రేషియ ఇవ్వాలని NRI సెల్ సూచించింది. దీనిని తెలంగాణ ఏర్పడినప్పటి రోజు జూన్ 2 ,2014 లేదా ఏరోజు తీసుకుంటే బాగుంటుందనే దానిపై కమిటీ లు పలువురు సూచనలు చేశారు.

సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు ఇతర ముఖ్య నేతలు పలు సలహాలు సూచనలు చేశారు. ఇప్పటికే తన వేములవాడ నియోజకవర్గానికి చెందిన గల్ఫ్ లో మృతి చెందిన రెండు కుటుంబాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో సిఎంఆర్ఎఫ్ నుండి వారికి ఎక్స్ గ్రేషియా ఇచ్చినట్లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. రైతు భీమా మాదిరి గల్ఫ్ భీమా ఉండాలని సూచించారు. పలువురు ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో సింగపూర్ , మలేషియా కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని సూచించారు. టీపిసిసి ఎన్ఆర్ఐ కన్వీనర్ ఇమిగ్రేషన్ 1982 యాక్ట్ లో గల్ఫ్ దేశాల్లో 18 దేశాలు ఉంటాయని అందులో సింగపూర్ లాంటి దేశాలు కూడా గల్ఫ్ కిందకి వస్తాయన్నారు.

తెలంగాణ లో 150 ట్రెడ్ లైసెన్స్ మన్ పవర్ ఎక్సపోర్ట్ కంపెనీలు ఉన్నాయని సెట్విన్, టాంటం, న్యాక్ లాంటి వాటిపై ప్రజల్లో అవగాహన కల్పించాలనీ సూచించారు. ఏజెన్సీల పేరుతో మోసం జరుగుతుందని అలా జరగకుండా కఠినంగా వ్యవహరించాలని సూచించారు. గల్ఫ్ కార్మికులు చనిపోతే శవం రావడానికి వారం రోజులకు పైగా పడుతుందని దానిని 48 గంటల్లో ఇక్కడికి వచ్చేలా చూడాలని తెలిపారు. దేశంలో బెస్ట్ గల్ఫ్ పాలసీ కేరళ రాష్ట్రంలో ఉందని అక్కడ ఉన్న దానిని స్టడి చేయాలని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. కేరళ లో జీడీపీ కి ప్రధానంగా గల్ఫ్ కార్మికుల ద్వారా వస్తుందని తెలంగాణ లో కూడా జీడీపీ గల్ఫ్ కార్మికుల ద్వారా అభివృద్ధి జరగాలని సూచించారు.

ఈ సమావేశంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్,ఎమ్మెల్యేలు డా.,సంజయ్ రేకులపల్లి భూపతి రెడ్డి , కెఆర్ నాగరాజు , మేడిపల్లి సత్యం, వాకిటి శ్రీహరి ముదిరాజ్ ,సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి,మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ కాంగ్రెస్ పార్టీ నేతలు వెలిచాల రాజేందర్ రావు , వినయ్ రెడ్డి, NRI సెల్ చైర్మన్ వినోద్ ,తదితరులు పాల్గొన్నారు.



## వేలాది కాంగ్రెస్ కార్యకర్త ల మధ్య ఘనంగా దామన్న పుట్టినరోజు

### నియోజకవర్గ ప్రజలతో నిండిన రెడ్ హౌస్....

### కార్యకర్తలే నా బలం : దామన్న

**విశ్వంభర, సూర్యాపేట :** కాంగ్రెస్ కార్యకర్తలు తమ అభిమాన నాయకుడు, మాజీ మంత్రి వర్యులు, సూర్యాపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి రాంరెడ్డి దామోదర్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను శనివారం సూర్యాపేట రెడ్ హౌస్‌లో ఘనంగా నిర్వహించారు, నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కేకుల కటింగులు, అన్న దానాలు, విద్యార్థులకు పుస్తకాల, పెన్నుల పంపిణీ, అనాథ శరణాలయాలకు బియ్యం, నిత్యావసర వస్తువుల పంపిణీ, వరద బాధితులకు సబ్బులు, బ్రెడ్ ప్యాకెట్ల పంపిణీ, తదితర కార్యక్రమాలు చేపట్టి రెడ్ హౌస్‌కు విచ్చేసి తమ అభిమాన నాయకుడికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ సందర్భంగా దామన్న మాట్లాడుతూ.. కార్యకర్తలే నా బలం, బలగం అని, వేలాదిగా తరలి వచ్చి శుభాకాంక్షలు తెలిపినందుకు ధన్యవాదాలు తెలిపారు.

## నిమ్స్‌లో చిన్నారులకు ఉచితంగా హార్ట్ సర్జరీలు..

**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో :** గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న చిన్నారుల బాధలను తీర్చి కొత్త జీవితాన్ని ప్రసాదించేందుకు హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రి ముందుకు వచ్చింది. ఈ నెల 22 నుంచి 28 వరకు నిమ్స్‌లో ఫ్రీగా హార్ట్ సర్జరీలు చేయనున్నారు. బ్రిటన్ వైద్య బృందం ఆధ్వర్యంలో పిల్లలకు ఉచితంగా సర్జరీలు చేయనున్నారు. ఇటీవల కాలంలో చాలా మంది చిన్నారులు గుండె జబ్బుల బారిన పడుతున్నారు. చిన్న వయస్సులో గండె సంబంధిత వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిసార్లు ఈ సమస్యలు వారి ప్రాణాలను బలి తీసుకుంటున్నాయి. గుండె సంబంధిత రుగ్మతలు సకాలంలోనే గుర్తించిన వారికి సర్జరీలు చేయించటం తల్లిదండ్రులకు తలకు మించిన భారం అవుతోంది. సర్జరీలకు లక్షల్లో ఖర్చవుతుండటంతో పేద తల్లిదండ్రులు దిక్కుతోచని స్థితిలో ఆపన్నహస్తం కోసం ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో గుండెం సబంధిత వ్యాధులతో బాధపడేవారికి హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రి శుభవార్త వినిపించింది. అటువంటి చిన్నారులకు రూపాయి ఖర్చు లేకుండా ఫ్రీగా హార్ట్ సర్జరీలు నిర్వహించనున్నట్లు నిమ్స్ డైరెక్టర్ నగరి బీరప్ప వెల్లడించారు. బ్రిటన్‌కు చెందిన డాక్టర్ల బృందం సహకారంతో ఈ సర్జరీలు చేయనున్నట్లు చెప్పారు. ప్రముఖ చిన్నపిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ రమణ దన్నపనేని సారథ్యంలో 11 మంది వైద్యుల బృందం నిమ్స్‌కు రానున్నట్లు చెప్పారు.

హాస్పిటల్ కార్డియో థొరాసిక్ విభాగాధిపతి అమరేశ్వరరావు, ప్రొ.గోపాల్ డాక్టర్ల బృందాన్ని సమన్వయం చేసుకుంటూ ఈ సర్జరీలు చేస్తారని చెప్పారు. ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకు ఉచితంగా సర్జరీలు చేయనున్నట్లు నిమ్స్ డైరెక్టర్ వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ సర్జరీలకు సహకారం అందిస్తోందని అన్నారు. గుండె సంబంధిత సమస్యలున్న చిన్నారులుంటే నిమ్స్ ఆసుపత్రి కార్డియో థొరాసిక్ డాక్టర్లను సంప్రదించాలని డాక్టర్ బీరప్ప సూచించారు.

ప్రపంచవ్యాప్తంగా పుట్టే ప్రతి 1000 మందిలో 810 మంది పిల్లల్లో ఏదో ఒక రకమైన గుండె సంబంధిత వ్యాధులుంటాయని డాక్టర్లు తెలిపారు. ఇందులో అధికశాతం గర్భస్థ దశలో ఉన్నప్పుడే తల్లికి చేసే వివిధ రకాల స్కానింగ్ పరీక్షల వల్ల బయట పడతాయని అంటున్నారు. నవజాత శిశు మరణాలకు మూడో అతి పెద్ద కారణం పుట్టుకతో వచ్చే గుండె జబ్బులేనని చెబుతున్నారు.

పిండదశలో అవయవాలు ఏర్పడే క్రమంలో అనేక కారణాల వల్ల ఈ గుండె జబ్బులు వస్తాయని వైద్య నిపుణులు అంటున్నారు. ఇవి పెద్దవాళ్ల గుండె జబ్బులకు పూర్తిగా భిన్నమైనవిగా ఉంటాయని.. గుండె, సంబంధిత రక్తనాళాల పరిణామ క్రమంలో ఇబ్బందులు తలెత్తుతాయని చెప్పారు. మేనరిక వివాహాలు, తద్వారా జన్యు సంబంధిత సమస్యలు, క్రోమోజోమ్ సంబంధిత సిండ్రోమ్‌లు, కొన్ని రకాల మందులు గర్భిణులు వాడటం, పొగతాగటం, మద్యపానం చేసే తల్లులు, తల్లుల్లో తీవ్ర మానసిక ఒత్తిడి, అధిక వయస్సు, గర్భిణిగా ఉండగా మధుమేహం, గర్భం దాల్చిన తొలినాళ్లలో సోకే ఇన్ఫెక్షన్లు పిల్లల్లో గుండె జబ్బులకు కారణంగా వైద్య నిపుణులు అంటున్నారు.

## పేదల ఇళ్లు, కడుపు కొట్టడానికే ముఖ్యమంత్రి అయ్యావా?

### సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం

**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో :** పాలమూరు బిడ్డనని చెప్పుకొనే రేవంత్ రెడ్డి ఎందుకు ముఖ్యమంత్రి అయ్యారని.. పేదల కడుపు, ఇళ్లు కొట్టేందుకేనా అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్లలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు మహబూబ్‌నగర్ పట్టణంలో 4 వేల డబుల్ బెడ్ రూమ్‌లు ఇచ్చాం. రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాత్రం గతంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన పట్టాలనే ఆక్రమణలుగా చిత్రీకరించారు. పేదవాళ్లు, దివ్యాంగులు అనే సోయి లేకుండా దయాదాక్షిణ్యం లేకుండా 75 మంది ఇళ్లు కూలగొట్టారు. ఏ కారణంతో వాళ్ల ఇళ్లు కూలగొట్టారో ఈ ప్రభుత్వం సమాధానం చెబుతుందా?. పేదవాళ్లు ఎక్కడైనా తెలియక ఇళ్లు కట్టుకుంటే వారికే రెగ్యులరైజ్ చేసే విధంగా జీవో 58, 59 తెచ్చాం. కానీ మీ ప్రభుత్వం బడికి పోయే పిల్లలు, దివ్యాంగులను రోడ్డు మీద పడేసింది. రేవంత్ రెడ్డికి సంస్కారం ఉంటే పేదల పట్ల ప్రేమ ఉంటే, ఆ 75 మందికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించాలి. ఏ అధికారులైతే అక్రమంగా పేదల ఇళ్లు కూల్చారో ఆ అధికారులపై చర్యలు తీసుకోవాలి.' అని పేర్కొన్నారు. మా బీఆర్ఎస్ పార్టీ బృందం మొత్తం త్వరలో మేడిగడ్డ పర్యటన తరహాలోనే పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు కలిసికట్టుగా వెళ్తామన్నారు.

### '8 లక్షల ఎకరాలకు నీళ్లు'

పాలమూరు జిల్లాలో 8 లక్షల ఎకరాలకు కేసీఆర్ నీళ్లు ఇచ్చారని.. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా అన్ని రిజర్వాయర్లు పూర్తి చేశామని కేటీఆర్ అన్నారు. 95 శాతం పని పూర్తైందని మిగిలిన 5 శాతం పనిని భూసేకరణ చేసి పూర్తి చేయాలని చెప్పారు. అయితే, దానికి సంబంధించిన టెండర్లు కూడా ఈ ప్రభుత్వం రద్దు చేసిందని మండిపడ్డారు. 'పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయట్లేదు. కేసీఆర్‌కు పేరు వస్తుందనే చేయడం లేదా.?. సుంకిశాలలో ప్రమాదానికి కారణమైన మేఘా సంస్థను బ్లాక్ లిస్ట్ చేయాలని మేము డిమాండ్ చేస్తున్నాం. కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ దాదాపు రూ.4,350 కోట్ల పనులను మేఘా ఇంజినీరింగ్ సంస్థకే ఇచ్చారు. ప్రమాదానికి కారణమైన సంస్థను బ్లాక్ లిస్టులో పెట్టాల్సినప్పటికీ ఆ సంస్థకే పనులు అప్పగించారు. చిల్లర మాటలు మాట్లాడిన రేవంత్ రెడ్డి చెంపలేసుకుని క్షమాపణలు చెప్పాలి. ఏ కంపెనీని ఈస్ట్ ఇండియా అని అన్నారో అదే మేఘా కంపెనీకి పనులు అప్పగిస్తుంటే నీ నైజం, నీ రంగు, నీ నిజాయితీ ఏంటో ప్రజలకు తెలిసిపోతోంది. పాలమూరు బిడ్డలకు చేతులెత్తి నమస్కారిస్తున్నా. ఎంతోమంది భూములిచ్చి సహకరించటంతోనే ఆ పనులు పూర్తి చేయగలిగాం.' అని వెల్లడించారు.

### లయన్స్ ఇంటర్నేషనల్స్ 320ఏ ఆధ్వర్యంలో

# ఆచార్యదేవో భవ




- 170 మంది ఉపాధ్యాయులకు ఘన సన్మానం
- రానున్న కాలంలో మరెన్నో సేవలు చేస్తాం : ప్రిసైడింగ్ అధికారి, డిస్ట్రిక్ట్ కో - ఆర్డినేటర్ లయన్ గుర్రం పాండయ్య ఎంజెఎఫ్
- సమాజానికి సేవ చేద్దాం .. ప్రేమను పంచుదాం : ఆచార్య కసిరెడ్డి వెంకట్ రెడ్డి
- జ్ఞానాన్ని అందించిన ఉపాధ్యాయులే మొదటి గురువులు: డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ డా.డి.కోటేశ్వరరావు పిఎంజెఎఫ్

**విశ్వంభర, హైద్రాబాద్ :** లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320 A 2024 25 ఆధ్వర్యంలో ఆచార్య దేవో భవ కార్యక్రమాన్ని నాగోల్ లోని పిబిఆర్ కన్వెన్షన్ హల్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిసైడింగ్ అధికారి, డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ లయన్ గుర్రం పాండయ్య ఎంజెఎఫ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకొని ఉపాధ్యాయులను సత్కరించుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. లయన్స్ ఇంటర్నేషనల్స్ ద్వారా రాబోవు కాలంలో మరిన్ని మంచి సేవ కార్యక్రమాలు చేస్తామని అన్నారు. దాదాపు 170 మంది ఉపాధ్యాయులకు లయన్స్ ఇంటర్నేషనల్స్ డిస్ట్రిక్ట్ 320 A ద్వారా ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన లయన్స్ ఇంటర్నేషనల్ వివిధ విభాగాల సభ్యులు కుటుంబం సమేతంగా హాజరయ్యారు. కార్యక్రమంలో విశిష్ట అతిధిగా పాల్గొన్న ఉస్మానియా యూనివర్సిటీ మాజీ తెలుగు విభాగాధిపతి ఆచార్య కసిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ సమాజానికి సేవ చేద్దాం సమాజాన్ని ప్రేమిద్దాం ప్రేమ, సేవ మార్గంలో సమాజ వికాసానికి దోహదం చేసే పనులలో భాగం అవుదాం అంటూ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకొని లయన్స్ ఇంటర్నేషనల్స్ ఏర్పాటు చేసిన ఆచార్యదేవో భవ కార్యక్రమంలో ఉపాధ్యాయులను సత్కరించి ఉపాధ్యాయుల గొప్పతనాన్ని వివరించారు. అలాగే ముఖ్య అతిధిగా విచ్చేసిన డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ డా.డి.కోటేశ్వరరావు పిఎంజెఎఫ్ మాట్లాడుతూ మాతృ,పితృ , ఆచార్య , అతిధి దేవో భవ లను గుర్తు చేసుకున్నారు. ఈ సమాజంలో మనకు జ్ఞానాన్ని అందించిన ఉపాధ్యాయులే మొదటి గురువులు అని అన్నారు. అలాంటి గురువులను ఉపాధ్యాయులకు సన్మానం చేయడం గొప్ప విషయంగా భావిస్తున్నామని అన్నారు. లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320 A ద్వారా ఎన్నో ప్రజా సేవ కార్యక్రమాలు చేశామని , మరెన్నో సేవ కార్యక్రమాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మొదటి వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ డాక్టర్ జి. మహేంద్ర కుమార్ రెడ్డి పిఎంజెఎఫ్ , రెండవ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ సురేష్ జజ్ఞాని పిఎంజెఎఫ్ , జిల్లా కేబినెట్ కోశాధికారి లయన్ సిహెచ్ . సత్యనారాయణ రావు ఎంజెఎఫ్ , జిల్లా కేబినెట్ కోశాధికారి లయన్ ఎస్. చన్నా రెడ్డి పిఎంజెఎఫ్ , అలాగే ఈవెంట్ చైర్‌పర్సన్ లయన్ డి. శరత్ చంద్ర బాబు ఎంజెఎఫ్, ఈవెంట్ కో చైర్‌పర్సన్‌లు లయన్ కాల్వ రామ్ రెడ్డి, లయన్ ఎంవిఎస్ రంగయ్య ఎంజెఎఫ్ , మాస్టర్స్ ఆఫ్ సెర్మనీ లయన్ పివి సాయి ఎంజెఎఫ్, లయన్ కె . శోభవతి పిఎంజెఎఫ్ తదితరులు పాల్గొన్నారు.

### సీఎం రేవంత్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే

# నాలుకలు కోస్తాం..

- హరీష్ రావు నీకు బుర్ర పనిచేయడం లేదా?
- ప్రశాంతంగా ఉన్న హైదరాబాద్‌ను డిస్టర్బ్ చేస్తున్నారు
- కేసీఆర్ సీఎం అయిన రోజే రాజకీయాల్లో విలువలు నశించాయి
- మీడియా సమావేశంలో టీపీసీసీ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి




**విశ్వంభర, హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తిడితే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తిట్టిన వాళ్ల నాలుకలు కోస్తారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు . కేటీఆరే కాదు ఆయన బాబు కేసీఆర్ నాలుక కూడా కోస్తామని హెచ్చరించారు. గాంధీ భవన్ లో మీడియా సమావేశం లో జగ్గారెడ్డి మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న హైదరాబాద్ ను చెడగొట్టాలని చూస్తున్నారంటూ బీఆర్ఎస్ పై మండిపడ్డారు. వినాయక నిమజ్జనం కార్యక్రమాన్ని డిస్టర్బ్ చేయాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని విమర్శించారు. పోలీసులు వినాయక నిమజ్జనం బందోబస్తు చూసుకోవాలా? లేక బీఆర్ఎస్ నేతల పంచాయితీ చూసుకోవాలా? అని ప్రశ్నించారు. అరెకపూడి గాంధీ, కౌశిక్ రెడ్డిల గొడవ ఆ పార్టీ అంతర్గత వ్యవహారమని అన్నారు.

హరీశ్ రావు నీకు సిగ్గుందా? అని జగ్గారెడ్డి ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పడిన పదేళ్ల తర్వాత ప్రాంతీయతత్వాన్ని ఎందుకు రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. కేసీఆర్ తాతలు విజయనగరం నుంచి వచ్చారని చెప్పారు. అధికారం పోయిన తర్వాత కేటీఆర్ కు, బీఆర్ఎస్ నేతలకు ఏమీ అర్థం కావడం లేదని... అందుకే రోడ్లపై పడుతున్నారని ఎద్దేవా చేశారు.

పార్టీలు మారిన నేతలకు కండువాలు కప్పే సాంప్రదాయం ఉమ్మడి ఏపీలో ఉండేది కాదని... కేసీఆర్ సీఎం అయిన తర్వాత ఈ సాంప్రదాయానికి తెర లేపారని విమర్శించారు.201418 మధ్య కాలంలో కాంగ్రెస్ కు చెందిన నలుగురు ఎంపీలు, 25 మంది ఎమ్మెల్యేలు, 18 మంది ఎమ్మెల్సీలు బీఆర్ఎస్ లో చేరినప్పుడు ఆ పార్టీ నేతలు ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. పార్టీ మారిన నేతలకు కేసీఆర్ మంత్రి పదవులు ఇచ్చారని దుయ్యబట్టారు. పార్టీ ఫిరాయింపులకు కేసీఆర్ ఆద్యుడని, కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన రోజే రాజకీయాల్లో విలువలు నశించాయని జగ్గారెడ్డి చెప్పారు.



### గణేష్ నిమజ్జనానికి

## పటిష్ట ఏర్పాట్లు పూర్తి

### భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా అన్ని ఏర్పాట్లు

### 73 పాండ్స్, 5 పెద్ద చెరువులు వద్ద నిమజ్జన ఏర్పాటు పూర్తి

### జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాట

**విశ్వంభర,హైదరాబాద్ :** హైదరబాద్ లో ఈ నెల 17 జరుగు గణేష్ నిమజ్జనం కొరకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్త కుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నట్లు జి హెచ్ ఎం సి కమిషనర్ తెలిపారు. గణేష్ నిమజ్జనానికి తీసుకువెళ్లే శోభయాత్ర నుండి నిమజ్జనం చేసే ప్రదేశం వరకు ఎవ్వరికీ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించినట్లు పేర్కొన్నారు.

మండపం నుండి నిమజ్జనం జరుగె కొలను చెరువుల వరకు భక్తులకు సమస్యలు లేకుండా రహదారి మరమ్మత్తులు, స్ట్రీట్ లైట్, ట్రీ ట్యూనింగ్ చర్యలు చేపట్టేందుకు పోలీస్, డిప్యూటీ కమిషనర్లు విద్యుత్ సిబ్బంది , యు బి డి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఇంజనీర్లు కమిటీ గా ఏర్పడి మండపం నిర్వాహకులు సూచన మేరకు ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకున్నారని కమిషనర్ వివరించారు.

జి హెచ్ ఎం సి భక్తుల సేవలదించెకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

జి హెచ్ ఎం సి వ్యాప్తంగా 73పాండ్స్( కొలనుల.) ఏర్పాటు చేసి భక్తులకు అందుబాటు లోకి తేవడం జరిగింది. అందులో 27 బెబి పాండ్స్, 24, ఫోర్టే బుల్, 22 ఎస్కలేటార్ పాండ్స్ ఏర్పాటు చేసి భక్తులకు సమీపం లో ఏర్పాటు చేయడం జరిగింది. 73 పాండ్స్ లలో విద్యుత్, త్రాగునీరు శానిటేషన్, 24 గంటల పాటు ఉండేలా చర్యలు మెన్ మెటీరియల్ ను సిద్దం చేయడం జరిగింది దాంతో పాటుగా అవసరమైన క్రీన్స్ లను కూడా సిద్దం గా ఉన్నాయి.

73 పాండ్స తో పాటుగా 5 పెద్ద చెరువుల వద్ద కూడా నిమజ్జనం ఏర్పాట్లు చేశారు సరూర్ నగర్ పెద్ద చెర్వు, జీడిమెట్ల ఫాక్స్ సాగర్, బహద్దూర్ పుర మిరాలం చెరువు, కాప్రా ఊర చెరువు లోకూడా నిమజ్జన ఏర్పాట్లను చేయడం జరిగింది.

భక్తుల సేవలో జి హెచ్ ఎం సి ఉంటుందన్నారు

ఈ నేపథ్యంలో ప్రత్యేకంగా గణేష్ నిమజ్జనానికి 172 రోడ్ల పనులు,36 ట్రాన్స్ పోర్ట్, 140 స్టాటిక్ క్రేన్ లు, 295 మొబైల్ క్రెన్స 160 గణేష్ యాక్షన్ టీన్స్, 102 మిని తిప్పర్స్,125 జేసి బి లుఎంగేజ్డ్,308 మొబైల్ టాయిలెట్స్,52,270 తాత్కాలిక స్ట్రీట్ లైట్స్ ఏర్పాటు చేసినట్లు అవసరమైన చోట అన్నపూర్ణ బోజన కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కమిషనర్ ఆమ్రపాలి కాట తెలిపారు.

## జగన్‌కు వ్యవసాయంపై అవగాహన లేదు

### మంత్రి అచ్చెన్నాయుడు

**విశ్వంభర, అమరావతి :** వైసీపీ అధినేత , మాజీ సీఎం వైఎస్ జగన్‌కు వ్యవసాయంపై అవగాహన లేక కూటమి ప్రభుత్వంపై విరుచుకు పడుతున్నారని ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఆరోపించారు. శ్రీకాకుళం జిల్లాలో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. సెప్టెంబర్ మొదటివారంలో భారీవర్షాలు, వరదల వల్ల రాష్ట్రంలో వ్యవసాయం తీవ్రంగా దెబ్బతిందని పేర్కొన్నారు.నష్టపోయిన ప్రతి ఒక్కరికీ పరిహారాన్ని అందజేస్తామని, రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని తెలిపారు. నష్టపోయిన రైతుల వివరాలను యాప్ ద్వారా వివరాలు సేకరించి , గ్రామ సభల్లో మరోసారి చర్చించి నష్ట పరిహారం అందజేస్తామన్నారు. చివరి వ్యక్తి వరకు ప్రభుత్వం పరిహారం అందిస్తుందని పేర్కొన్నారు. రైతులకు బీమా, ఇన్‌పుట్ సబ్సిడీని అందిస్తామన్నారు.జగన్ ప్రభుత్వం ఐదు సంవత్సరాలు రైతు బీమాను కట్టలేదని , ఖరీఫ్‌కు ఒక్కసారి మాత్రమే బీమా కట్టారని ఆరోపించారు.2024 వరకు ప్రధాన మంత్రి ఫసల్ బీమాను అమలు చేస్తున్నామని, ఈ పథకం కింద రూ. 2,500 కోట్లను కట్టామని, రైతులకు బీమా వస్తుందని పేర్కొన్నారు. వరదల విషయంలో చంద్రబాబు బాధ్యతగా వ్యవహరించారుని తెలిపారు. టీడీపీ కక్షపూరిత రాజకీయాలకు పాల్పడబోదని స్పష్టం చేశారు.

## వైజాగ్ స్టీల్‌ను కాపాడుకోలేకపోతే బాబును క్షమించరు

### టీడీపీ మాజీ ఎంపీ వ్యాఖ్య

**విశ్వంభర, అమరావతి :** విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ దిశగా వెళ్తున్న కేంద్రాన్ని, ప్రధాని నరేంద్ర మోదీని నిలదీయాలని టీడీపీ మాజీ ఎంపీ, సీనియర్ నాయకుడు వడ్డే శోభనాద్రీశ్వరావు ముఖ్యమంత్రి చంద్రబాబుకు సూచించారు. శనివారం ఆయన విజయవాడలో మీడియాతో మాట్లాడారు. 32 మంది బలిదానాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు కర్మాగారానికి బ్లాస్ట్ ఫర్నేస్ మూడపడడం సిగ్గుచేటని ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకోలేకపోతే చంద్రబాబు ను ప్రజలు క్షమించరని అన్నారు.స్టీల్ మంత్రిత్వ శాఖలో సహాయ మంత్రిగా ఆంధ్రకు చెందిన శ్రీనివాస వర్మ ఉన్నప్పటికీ బ్లాస్ట్ ఫర్నేస్ మూతపడడం దారుణమన్నారు. ఏపీకి అన్యాయం జరుగుతున్నా కూటమి నేతలు స్పందించంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.



## హాకీలో హర్మన్‌ప్రీత్ షో..

### పాకిస్థాన్‌పై ఇండియా విక్టరీ

**చైనా:** ఏషియన్ హాకీ చాంపియన్‌షిప్‌లో టీమిండియా .. లీగ్ దశను అజేయంగా ముగించింది. ఇవాళ పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో 2-1 గోల్స్ తేడాతో ఇండియా విక్టరీ నమోదు చేసింది. ఏడవ నిమిషంలో పాక్ ప్లేయర్ అహ్మద్ నదీమ్ గోల్ చేశాడు. అయితే ఆ తర్వాత హర్మన్‌ప్రీత్ సింగ్.. రెండు గోల్స్ చేసి ఇండియా జట్టుకు ఆధిక్యాన్ని అందించాడు. ఏషియన్ టోర్నీలో ఇప్పటికే భారత జట్టు సెమీస్‌కు చేరింది. ఆట 13వ నిమిషంలో భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ తన డ్రాగ్‌ఫ్లిక్‌తో తొలి గోల్ చేశాడు. మళ్లీ 19వ నిమిషంలో మరో పెనాల్టీ కార్నర్ ను డ్రాగ్‌ఫ్లిక్‌తో రెండో గోల్ చేశాడతను. రెండు గోల్స్‌తో టీమిండియా లీడింగ్‌లో ఉన్నా.. బలమైన పాకిస్థాన్ ఆద్యంతం విరోచితంగా పోరాడింది. అయితే ఓ దశలో పాక్ ప్లేయర్ అష్రఫ్ రాణా దురుసుగా ప్రవర్తించాడు. ప్రవర్తన సరిగాలేకపోవడంతో.. టీవీ అంపైర్ అతనికి ఎల్లో కార్డు జారీ చేశాడు. చివరలో రెండు జట్లూ కేవలం పది మంది ఆటగాళ్లతో ఆడారు.

### ఆ వార్త తెలియగానే ఐదు నిమిషాలపాటు

## అలాగే కూర్చుండిపోయా: మోర్కెల్

**విశ్వంభర (క్రీడా విభాగం):** ఏరికోరి, బీసీసీఐను ఒప్పించి మరీ దక్షిణాఫ్రికా పేసర్ మోర్నీ మోర్కెల్ ను గౌతమ్ గంభీర్ బౌలింగ్ కోచ్ గా తెచ్చుకున్నాడు. సెప్టెంబర్ 19 నుంచి బంగ్లాదేశ్తో టెస్టు సిరీస్ ప్రారంభం కానుంది. ఇప్పటికే చెన్నైకి చేరుకున్న టీమ్ ఇండియా సాధనను ముమ్మరం చేసింది. జట్టు ఆటగాళ్లతో కలిసి మోర్నీ మోర్కెల్ ప్రాక్టీస్ చేయిస్తున్నాడు. అయితే, బౌలింగ్ కోచ్గా అవకాశం రావడంపై మోర్నీ స్పందించాడు. బీసీసీఐ నుంచి ఈ వార్త తెలియగానే తాను ఐదు నిమిషాలపాటు అలాగే కూర్చుండిపోయినట్లు గుర్తు చేసుకున్నాడు. తన తండ్రి ఈ విషయాన్ని తెలిపేందుకు ఫోన్ చేసి చెప్పినట్లు పేర్కొన్నాడు. "మా నాన్న నుంచి నాకు ఫోన్ వచ్చింది. బౌలింగ్ కోచ్గా ఎంపికైనట్లు చెప్పారు. ఆ ఫోన్ కట్ చేసిన తర్వాత ఓ ఐదు నిమిషాలు అలాగే ఉండిపోయా. అసలు ఏం జరుగుతుందో అర్థం చేసుకోవడానికి కాస్త సమయం పట్టింది. ఆ తర్వాత మళ్లీ నాతో మాట్లాడారు. అప్పటికీ నా వైఫ్ దగ్గరకు వెళ్లలేదు. సాధారణంగా ఇలాంటి విషయాలు తెలిశాక.. దానిని భార్యతో పంచుకుంటారు. కానీ నేను మాత్రం మా నాన్నతో మాట్లాడుతూనే ఉండిపోయా. క్రికెటర్గా, క్రికెట్కు అభిమానిగా అది



నాకెంతో ప్రత్యేక క్షణం. అందుకే, ఆ మధుర క్షణాలను నేనే ఆస్వాదించాలని భావించా. ఓ ఐదారు నిమిషాలు రూమ్లోనే ఉండిపోయా. తర్వాత కుటుంబసభ్యులతో పంచుకున్నా. ఇప్పుడు మీ ముందున్నా" అని మోర్నీ వ్యాఖ్యానించాడు.

**రాబోయే సిరీస్లపై దృష్టి..**

"భారత్ జట్టుపై చాలా మ్యాచ్లు ఆడా. ఐపీఎల్లో టీమ్ ఇండియా ఆటగాళ్లతో కలిసి ఆడా. ఇప్పుడు బౌలింగ్ కోచ్ బాధ్యతలు చేపట్టా. ఇప్పుడున్న జట్టు సభ్యులతో కలిసిపోవాలి. ఐపీఎల్ లో కొందరితో ఇప్పటికే పరిచయం ఉండటంతో అదేమంత పెద్ద కష్టం కాదు. ట్రైనింగ్ క్యాంప్లో ప్రతిఒక్కరితో మాట్లాడా. నావరకు మొదటి సిరీస్ చాలా ముఖ్యమైంది. కుర్రాళ్లను అర్థం చేసుకోవడానికి చక్కగా ఉపయోగపడుతుంది. వారి బలాలు, బలహీనతలు తెలుస్తాయి. మెరుగయ్యేందుకు నేనేం చేయాలనే దానిపై ఓ స్పష్టత వస్తుంది. భవిష్యత్తులో కీలక సిరీస్లను భారత్ ఆడనుంది. అక్కడ అద్భుత ఫలితాలు సాధించడమే లక్ష్యంగా ఇప్పట్నుంచే సన్నద్ధత మొదలైంది. జట్టులోని ప్రతి ఒక్కరూ ప్రొఫెషనల్ క్రికెటరే. తప్పకుండా మా అనుబంధం బాగుంటుందని భావిస్తున్న" అని మోర్కెల్ తెలిపాడు.



## ఒక్క నెలకే పొమ్మన్నారు

### కెన్యా కోచ్‌కు చేదు అనుభవం

**విశ్వంభర (క్రీడా విభాగం):** ఒకప్పుడు ప్రపంచ క్రికెట్‌లో సంచలన విజయాలతో అందరి దృష్టిని ఆకర్షించిన కెన్యా ఇప్పుడు కనుమరుగైపోయింది. ఆఫ్రికన్ లీగ్స్‌లో మినహా పెద్దగా రాణించడం లేదు. ఈ నేపథ్యంలో ఆ జట్టును చక్కదిద్దాలనుకున్న భారత మాజీ క్రికెటర్ దొడ్డ గణేశ్ కు చేదు అనుభవం ఎదురైంది. కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన నెల రోజులకే అతడిపై వేటు పడింది.గణేశ్‌ను పదవి నుంచి తొలగిస్తూ కెన్యా క్రికెట్ ఓ ప్రకటన విడుదల చేసింది. మాజీ పేసర్ అయిన గణేశ్ ఆగస్టు 14వ తేదీన కెన్యా జట్టుకు ప్రధాన కోచ్‌గా నియమితులయ్యాడు. నెల తిరిగిందో లేదో 'నువ్వు మాకు వద్దు పొమ్మంటూ' ఆ దేశ బోర్డు అతడికి పెద్ద షాకిచ్చింది. కెన్యాకు లామెక్ ఒన్యాంగో మధ్యంతర కోచ్‌గా ఎంపికయ్యాక గణేశ్ ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపట్టాడు. అప్పటికీ సహాయక సిబ్బందిగా ఉన్న జోసెఫ్ అంగారా, జోసెఫ్ అసిచీలతో కలిసి గణేశ్ జట్టును గాడీలో పెట్టేందుకు ప్రయత్నించాడు. కానీ, 30 రోజుల్లోనే అతడి సేవల్ని కెన్యా బోర్డు వద్దనుకుంది.అసలేం జరిగిందంటే.. కార్యనిర్వాహక శాఖ హెడ్‌కోచ్‌గా గణేశ్ నియామకాన్ని అమోదించలేదు. దాంతో, కెన్యా బోర్డు 'ఇక మీరు కోచ్‌గా అవసరం లేదు' అంటూ ఆ దేశ మహిళా క్రికెట్ డైరెక్టర్ పీర్లినే ఒమామీ పేరుతో బోర్డు తరఫున గణేశ్‌కు సందేశం పంపింది. అయితే.. ఎందుకు తొలగిస్తున్నారు? అనే దానికి స్పష్టమైన కారణం మాత్రం చెప్పలేదు. దేశవాళీ క్రికెట్‌లో కర్నాటక తరఫున ఆడిన గణేశ్ టీమిండియాకు ప్రాతినిధ్యం వహించింది కొన్ని మ్యాచ్‌లే. భారత జెర్సీతో అతడు నాలుగు టెస్టులు, ఒక వన్డే మాత్రమే ఆడాడు.

## తిలక్ వర్మ, ప్రథమ్ సింగ్ శతకాల జోరు

### గెలుపు దిశగా ఇండియా ఏ

**విశ్వంభర (క్రీడా విభాగం):** దులీప్ ట్రోఫీలో ఇషాన్ కిషన్ విధ్వంసం మరువకముందే మరో ఇద్దరు శతకంతో గర్జించారు. 'ఇండియా ఏ' తరఫున ఆడుతున్న తెలుగు కుర్రాడు తిలక్ వర్మ(111 నాటౌట్), ప్రథమ్ సింగ్(122)లు సెంచరీలతో ఇండియా డీ బౌలర్ల భరతం పట్టారు. ఇప్పటివరకూ టీ20ల్లో దంచేసిన తిలక్.. ఇప్పుడు రెడ్ బాల్ క్రికెట్‌లోనూ వీర కొట్టుడు కొట్టాడు. మరో ఎండ్‌లో ప్రథమ్ కూడా రెచ్చిపోయి ఆడడంతో రెండో ఇన్నింగ్స్‌ను ఇండియా ఏ పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. అనంతరం బ్యాటింగ్ మొదలెట్టిన ఇండియా డీ పోరాడుతోంది. డేంజరస్ ఓపెనర్ అథర్వ తైడేను అకీబ్ ఖాన్ డకౌట్‌గా వెనక్కి పంపాడు. ఆ తర్వాత యశ్ దూబే(15), రికీ భూయి(44)లు ఆచితూచి ఆడారు. దాంతో మూడో రోజు ఆట ముగిసే సరికి ఆ జట్టు వికెట్ నష్టానికి 62 పరుగులు చేసింది. ఇంకా 426 పరుగులు వెనకే ఉంది.

**అభిమన్యు ఒంటరి పోరాటం..**

మరో మ్యాచ్‌లో ఇండియా బీ ఆలౌట్ ప్రమాదంలో పడింది. సహచరులు బ్యాట్లు ఎత్తేస్తున్నా కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్(143 నాటౌట్) ఒంటరి పోరాటం చేస్తున్నాడు. తొలి వికెట్‌కు జగదీశన్(74)తో కలిసి 129 రన్స్ జోడించిన అభిమన్యుకు ఆ తర్వాత సహకరించేవాళ్లు కరువయ్యారు. తొలి మ్యాచ్‌లో సెంచరీతో చెలరేగిన ముషీర్ ఖాన్(1), ధనాధన్ ఆడిన సర్ఫరాజ్ ఖాన్(16)లు నిరాశపరిచారు.దాంతో, టెయిలెండర్ల సాయంతో సాధ్యమైనన్ని పరుగులు చేయడంపై దృష్టి పెట్టిన అభిమన్యు ఎలాగోలా జట్టు స్కోర్ మూడొందలు దాటించాడు. మూడో రోజు ఆట ముగిసే సరికి ఇండియా బీ 7 వికెట్ల నష్టానికి 309 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో ఇంకా 216 రన్స్ వెనకబడి ఉంది. మొదట ఆడిన ఇండియా ఏ 525కు ఆలౌటయ్యింది. ఇషాన్ కిషన్(111) శతకంతో విజృంభించగా.. మానవ్ సుతార్(82), బాబా ఇంద్రజిత్(78), కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్(54)లు అర్ధ శతకాల మోత మోగించారు.

## వినేశ్ ఫొగాట్ వద్దనుకుంది

### ఒలింపిక్ సంఘం తప్పేమీ లేదు

ఈమధ్యే కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ మాటల్లో దూకుడు కనబరుస్తోంది. విశ్వ క్రీడల్లో పతకం చేజారిన బాధలో ఉన్న తనతో ఫొటో దిగి..భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉష రాజకీయం చేశారని ఫొగాట్ సంచలన వ్యాఖ్యలు చేసింది. అంతేకాదు పారిస్‌లో తనకు ఐఓఏ నుంచి తగినంత సహాయ సహకారాలు అందలేదని ఆమె ఆరోపించింది. అయితే.. ఫొగాట్ కామెంట్లను అమె తరఫున కాస్ కోర్టులో వాదించిన న్యాయవాది హరిశ్ సాల్వే ఖండించాడు.'క్రీడా కోర్టు తీర్పును సవాల్ చేద్దామనుకున్నాం. కానీ, వినేశ్ అంగీకరించలేదు. ఇంతటితో ఈ విషయాన్ని వదిలేయాలని ఆమె తమతో చెప్పిందని నాకు ఇతర న్యాయవాదులు చెప్పారు 'అని సాల్వే తెలిపాడు. వినేశ్‌పై అనర్హతను కాస్ కోర్టులో సవాల్ చేయడం.. ఆపై కోర్టు తిరస్కరించిన తర్వాత జరిగిన పరిణామాలను తాజాగా సాల్వే వివరించాడు. 'కాస్‌లో వినేశ్ తరఫున వాదనలు బలంగా వినిపించాం. ఆమెకు పతకం ఇవ్వాల్సిందేనని చెప్పాం. అంతేకాదు కోర్టు తీర్పును స్విట్జర్‌లాండ్‌లోని పై కోర్టులో సవాల్ చేద్దామని కూడా వినేశ్‌కు నేను చెప్పాను. కానీ, అమె ఈ కేసును ఇంతటితో వదిలేయాలనే నిర్ణయానికి వచ్చిందని తోటి లాయర్లు నాతో అన్నారు' అని సాల్వే వెల్లడించాడు.



**అదనపు బరువు కారణంగా..**

పారిస్ ఒలింపిక్స్ 50 కిలోల విభాగంలో వినేశ్ ఫొగాట్ ఫైనల్‌కు ముందు అనర్హతకు గురైంది. 100 గ్రాముల అదనపు బరువు కారణంగా ఆమెను పోటీలో పాల్గొనకుండా అడ్డుకున్నారు. దాంతో, వినేశ్ తనకు వెండి పతకం ఇవ్వాల్సిందిగా కాస్‌ను సంప్రదించింది.అయితే.. వారం రోజులపైనే ఆ విషయాన్ని నాన్చుతూ వచ్చిన కాస్.. వినేశ్ అప్పీల్‌ను కొట్టేసింది. క్యూబా రెజ్లర్‌తో పాటు ఆమెకు సిల్వర్ మెడల్ ఇచ్చేది లేదని స్పష్టం చేసింది. దాంతో, రెజ్లింగ్‌లో వెండి పతకం గెలుపొందిన తొలి మహిళగా చరిత్ర సృష్టించే అవకాశాన్ని వినేశ్ కోల్పోయింది.

## సెబీ చీఫ్‌పై మరోసారి కాంగ్రెస్ ఆరోపణలు



**విశ్వంభర (బిజినెస్):** కాంగ్రెస్ పార్టీ మరోసారి లక్ష్యంగా చేసుకుంది. గతంలో చేసిన ఆరోపణలకు ఆమె, ఆమె భర్త శుక్రవారం సుదీర్ఘ వివరణ ఇచ్చిన వేళ.. మరోసారి కొత్త ఆరోపణలతో ముందుకొచ్చింది. సెబీ ఛైర్పర్సన్ హోదాలో ఉంటూ పరస్పర విరుద్ధ ప్రయోజనాలు పొందారంటూ ఆ పార్టీ నేత పవన్ ఖేరా మరోసారి ఆరోపణలు గుప్పించారు. సెబీలో ఉంటూ 2017 నుంచి 2023 మధ్య లిస్టెడ్ సెక్యూరిటీల్లో రూ.36.9 కోట్లు ట్రేడింగ్ చేశారంటూ ఆరోపించారు. 2018-19 పెద్ద మొత్తంలో ట్రేడింగ్ నిర్వహించారని పేర్కొన్నారు.విదేశీ ఫండ్స్లోనూ మదుపు చేశారని పవన్ ఖేరా ఆరోపించారు. ఇందులో చైనాకు చెందిన పెట్టుబడులూ ఉన్నాయని పేర్కొన్నారు. మొత్తం నాలుగు అంతర్జాతీయ ఫండ్స్లో ఆమె మదుపు చేయగా.. అందులో చైనాకు చెందిన గ్లోబల్ X MSCI చైనా కన్జూమర్, ఇన్వెస్కో చైనా టెక్నాలజీ ఈటీఎఫ్ లో ఆమె పెట్టుబడులు ఉన్నాయని ఆరోపించారు. ఈ పెట్టుబడుల గురించి ఆమె ఎప్పుడు ప్రకటించారు? ఈ విషయం ప్రభుత్వ ఏజెన్సీలకు తెలుసా? అని నిలదీశారు. అలాగే సెబీ ఛైర్పర్సన్ ఇచ్చిన వివరణనూ తోసిపుచ్చారు. ముఖ్యంగా ఐసీఐసీఐ, మహీంద్రా గ్రూప్ విషయంలో ఇచ్చిన వివరణ ఏమాత్రం సరిపోదని పేర్కొన్నారు. సెబీ చీఫ్పై తమ పార్టీ నేత పవన్ ఖేరా తాజా ఆరోపణల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రధాని మోదీపై విమర్శలు ఎక్కు పెట్టింది. సెబీ ఛైర్పర్సన్పై వస్తున్న ఆరోపణల గురించి మోదీకి తెలుసా? అంటూ ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ప్రశ్నించారు. బయటకు పొక్కని సున్నితమైన ధరల సమాచారం కలిగిన లిస్టెడ్ సెక్యూరిటీల్లో సెబీ ఛైర్పర్సన్ ట్రేడింగ్ చేసిన విషయం తెలుసా? భారత్ వెలుపల సెబీ చీఫ్కు పెట్టుబడులు ఉన్న విషయం తెలుసా? అంటూ నిలదీశారు. ఒకవేళ తెలిస్తే.. పెట్టుబడులు, ఆయా తేదీలు చెప్పగలరా? ఓ వైపు చైనాతో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ సెబీ ఛైర్పర్సన్ చైనా కంపెనీల్లో పెట్టుబడులు పెట్టిన విషయం తెలుసా? అని అని ప్రశ్నించారు.

## గోల్డెన్ టెంపుల్‌లో మనూ భాకర్ ప్రత్యేక ప్రార్థనలు..



**అమృత్‌సర్:** భారత షూటర్ , పారిస్ ఒలింపిక్స్ డబుల్ మెడలిస్ట్ మనూభాకర్ అమృత్‌సర్‌లోని గోల్డెన్ టెంపుల్‌ను సందర్శించారు. శ్రీ హర్‌మందిర్ సాహిబ్‌గా పిలుచుకునే గోల్డెన్ టెంపుల్‌లో ఆమె ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా భాకర్ వెంట ఆమె కుటుంబసభ్యులు కూడా ఉన్నారు.ఇటీవల జరిగిన పారిస్ ఒలింపిక్స్‌లో మనూభాకర్ రెండు కాంస్య పతకాలను గెలుచుకున్నారు. ఒక పతకం మహిళల షూటింగ్ 10 మీటర్ల ఎయిర్ పిస్తోల్ సింగిల్ ఈవెంట్‌లో దక్కగా.. మరో పతకాన్ని సరబ్‌జ్యోత్ సింగ్‌తో కలిసి 10 మీటర్ల ఎయిర్ పిస్తోల్ మిక్స్‌డ్ ఈవెంట్‌లో దక్కించుకున్నారు. దాంతో ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు నెగ్గిన ఏకైక భారత ప్లేయర్‌గా నిలిచారు.

### ఐపీఓల సందడి: 13 లిస్టింగ్‌లు, 7ఇష్యూలు..

## అందరి చూపూ బజాజ్ పైనే

**ముంబయి:** వచ్చేవారం ప్రాథమిక మార్కెట్లో పలు ఐపీఓల సందడి కనిపించనుంది. 7 ఐపీఓలు వచ్చేవారం సబ్ స్క్రిప్షన్ కు రానుండగా.. 13 కంపెనీలు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ కానున్నాయి. సబ్స్క్రిప్షన్కు వచ్చే వాటిలో రెండు మెయిన్బోర్డు కాగా.. మిగిలిన ఐదు ఎస్ఎంఈ సెగ్మెంట్కు చెందినవి ఉన్నాయి. లిస్టింగ్కు వచ్చే వాటిలో బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ వంటి ప్రధాన కంపెనీలు ఉన్నాయి. దీంతో మదుపర్లలో ఆసక్తి నెలకొంది.




**ఐపీఓలు ఇవే..**

- ముంబయికి చెందిన రియల్ ఎస్టేట్ సంస్థ ఆర్కేడ్ డెవలపర్స్ రూ.410 కోట్ల ఐపీఓ ఈ నెల 16న ప్రారంభమై 19న ముగియనుంది. తాజా షేర్ల జారీ ద్వారా నిధులు సమీకరిస్తున్నారు. ఈ పబ్లిక్ ఇష్యూకు రూ.121-128 ధరల శ్రేణిగా నిర్ణయించారు. క్యూఐబీలకు 50 శాతం, రిటైల్ ఇన్వెస్టర్లకు 35 శాతం, నాన్ ఇన్స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లకు 15 శాతం చొప్పున షేర్లు రిజర్వ్ చేశారు. నిధులను ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న, భవిష్యత్ ప్రాజెక్టులకు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనున్నారు.
- ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్లాట్ఫామ్ నార్తర్న్ ఆర్క్ క్యాపిటల్ సైతం రూ.777 కోట్లు సమీకరించేందుకు ఐపీఓకు వస్తోంది. సెప్టెంబర్ 16న ప్రారంభమై సెప్టెంబర్ 19న ముగియనుంది. ధరల శ్రేణిని రూ.249-263గా కంపెనీ నిర్ణయించింది. రూ.500 కోట్లు విలువైన తాజా షేర్లను, మిగిలిన షేర్లను ఆఫర్ ఫర్ సేల్ ద్వారా విక్రయించనున్నారు. భవిష్యత్ మూలధన అవసరాల కోసం ఈ నిధులను కంపెనీ వినియోగించుకోనుంది.
- ఎస్ఎంఈ సెగ్మెంట్లో పెలాట్రో లిమిటెడ్ (రూ.56 కోట్లు), ఓసెల్ డివైజెస్ (రూ.70.66 కోట్లు) ఐపీఓలు సెప్టెంబర్ 16న ప్రారంభం కానున్నాయి. పారామౌంట్ స్పెషాలిటీ ఫోర్జింగ్స్, బైక్వా గ్రీన్ టెక్ సబ్స్క్రిప్షన్ సెప్టెంబర్ 17న ప్రారంభమవుతాయి. 20న ఎస్ఓ రిటైల్ సంస్థ ఐపీఓ సబ్స్క్రిప్షన్కు రానుంది.

**అందరి చూపూ బజాజ్పైనే..**

వచ్చే వారం లిస్టింగ్ కానున్న కంపెనీల్లో బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ ప్రధానమైనది. సెప్టెంబర్ 16న బీఎస్ఈ, ఎన్ఎస్ఈలో ఈ కంపెనీ లిస్ట్ కానుంది. సబ్స్క్రిప్షన్లో భాగంగా మదుపర్ల నుంచి మంచి ఆదరణ దక్కించుకుంది రూ.6,560 కోట్ల విలువైన షేర్లను బిడ్డింగ్కు ఉంచగా.. రూ.3.2 లక్ష కోట్ల విలువైన బిడ్లు దాఖలయ్యాయి. ఏకంగా 63.6 రెట్లు ఓవర్ సబ్స్క్రైబ్ అయ్యింది. దీంతో అందరి చూపూ బజాజ్ పైనే నెలకొంది. దీంతో పాటు క్రాస్ లిమిటెడ్, పీఎన్ గాడ్గిల్ జువెలర్స్, టొలిన్స్ టైర్స్ వంటి కంపెనీలూ లిస్టింగ్కు రానున్నాయి. 9 ఎస్ఎంఈలు కూడా లిస్టింగ్ కాబోతున్నాయి.

## ఎఫ్‌ఎలపై 9శాతం వరకు వడ్డీ అందిస్తున్న బ్యాంకులివే..

**విశ్వంభర (బిజినెస్):** స్థిరమైన ఆదాయం పొందాలనుకొనే వారికి వెంటనే గుర్తుకు వచ్చే పథకం ఫిక్స్ డిపాజిట్. ఎన్ని పెట్టుబడి అవకాశాలు ఉన్నప్పటికీ ఎలాంటి రిస్క్ లేకుండా మదుపు చేయాలనే ఉద్దేశంతో చాలా మంది ఎఫ్డీలపైనే మక్కువ చూపుతుంటారు. దీంతో బ్యాంకులు కూడా వీరిని ఆకర్షించేందుకు వడ్డీ రేట్లను పెంచుతుంటాయి. అలా కొన్ని స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులైతే ఏకంగా 9శాతం వరకు వడ్డీని అందిస్తున్నాయి. ఆ బ్యాంకులు ఏవంటే..



- నార్త్ ఈస్ట్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ మూడేళ్ల పాటు చేసే ఎఫ్డీ ఈ బ్యాంక్ 9శాతం వడ్డీని ఇస్తోంది.
- సూర్యోదయ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ 60ఏళ్ల లోపు వారికి చేసే ఎఫ్డీపై గరిష్ఠంగా 8.6శాతం వడ్డీని అందిస్తోంది.
- ఉత్కర్ష్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ కూడా ఎఫ్డీలపై 8.50శాతం వడ్డీని ఇస్తోంది.
- జన స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ మూడేళ్ల పాటు చేసే ఎఫ్డీపై 8.25శాతం వడ్డీ ఇస్తోంది.
- యునిటీ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ 60 ఏళ్లలోపు మూడేళ్లపాటు చేసే ఎఫ్డీపై 8.15శాతం వడ్డీ పొందొచ్చు.మూడేళ్ల కాల పరిమితితో, రూ.3 కోట్ల లోపు ఎఫ్డీలు చేసే సాధారణ పౌరులకు ఈ వడ్డీ రేట్లు వర్తిస్తాయి.

ఈ సదుపాయం కూడా..స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుల్లో ఎఫ్డీలపై రూ.5 లక్షల వరకు డిపాజిట్ ఇన్సూరెన్స్ క్రెడిట్ గ్యారెంటీ కార్పొరేషన్ రక్షణ ఉంటుంది. మీరు ఈ బ్యాంకుల్లో డిపాజిట్ చేస్తే, వడ్డీతో కలిపి రూ.5 లక్షల్లోపు మొత్తం ఉండేలా జాగ్రత్త పడాలి. డిపాజిట్ పరిధి రూ.5 లక్షలలోపు ఉంటేనే మీరు పూర్తి ఆర్థిక రక్షణలో ఉన్నట్లు అర్థం. పొదుపు ఖాతా, ఫిక్స్/రికరింగ్ డిపాజిట్లతో సహా ప్రతీ షెడ్యూల్డ్ బ్యాంకులో ఈ బీమా వర్తిస్తుంది.

## రెడ్‌మీ నుంచి మార్కెట్లోకి రెడ్‌మీ 14ఆర్..

### త్వరలో భారత్‌లో ఆవిష్కరణ..

**విశ్వంభర (బిజినెస్):** ప్రముఖ స్మార్ట్ ఫోన్ల తయారీ సంస్థ రెడ్‌మీ తన రెడ్‌మీ 14 ఆర్ ఫోన్‌ను చైనా మార్కెట్లో ఆవిష్కరించింది. 8 జీబీ ర్యామ్ విత్ 256 జీబీ స్టోరేజీతోపాటు స్నాప్ డ్రాగన్ 4 జెన్ 2 ఎస్వోసీ ప్రాసెసర్‌తో వస్తోంది. ఆండ్రాయిడ్ 14 బేస్డ్ షియోమీ హైపర్ ఓఎస్ వర్షన్ పై పని చేస్తుంది. 18వాట్ల చార్జింగ్ మద్దతుతో 5160 ఎంఏహెచ్ కెపాసిటీ గల బ్యాటరీ కలిగి ఉంటుంది. రెడ్‌మీ 13 ఆర్ కొనసాగింపుగా వస్తున్న రెడ్‌మీ 14 ఆర్ 13-మెగా పిక్సెల్ రేర్ కెమెరా, 5-మెగా పిక్సెల్ సెల్ఫీ కెమెరా ఉంటాయి. త్వరలో భారత్ మార్కెట్లోకీ రానున్నది. రెడ్‌మీ 14 ఆర్ (Redmi 14R) ఫోన్ 4జీబీ ర్యామ్ విత్ 128 జీబీ స్టోరేజీ వేరియంట్ సుమారు రూ.13 వేలు (1099 చైనా యువాన్లు), 6 జీబీ ర్యామ్ విత్ 128 జీబీ స్టోరేజీ వేరియంట్ దాదాపు రూ.17,700 (1499 చైనా యువాన్లు), 8 జీబీ ర్యామ్ విత్ 128 జీబీ స్టోరేజీ వేరియంట్ సుమారు రూ.20,100 (1699 చైనా యువాన్లు), 8 జీబీ ర్యామ్ విత్ 256 జీబీ స్టోరేజీ వేరియంట్ దాదాపు రూ.22,500 (1899 చైనా యువాన్లు) పలుకుతుంది. ఈ ఫోన్ డీప్ ఓషన్ బ్లూ, లావెండర్, ఆలీవ్ గ్రీన్, షాడ్ బ్లాక్ కలర్ ఆప్షన్లలో లభిస్తుంది. రెడ్‌మీ 14 ఆర్ ఫోన్ 5జీ, 4జీ ఎల్టీఈ, వై-ఫై, బ్లూటూత్, జీపీఎస్, యూఎస్బీ టైప్ సీ పోర్ట్, 3.5 ఎంఎం హెడ్ ఫోన్ జాక్ కనెక్టివిటీ కలిగి ఉంటుంది. బయో మెట్రిక్ అథంటికేషన్ కోసం సైడ్ మౌంటెడ్ ఫింగర్ ప్రింట్ సెన్సర్ కలిగి ఉంటది. ఈ ఫోన్ 6.68 అంగుళాల హెచ్డీ+ ఎల్‌సీడీ స్క్రీన్ విత్ 120 హెర్ట్జ్ రీఫ్రెష్ రేట్ కలిగి ఉంటుంది. 600 నిట్స్ పీక్‌బ్రైట్ నెస్ తో వస్తోంది.



# క్యాన్సర్ బాధితుడికి జూనియర్ ఎన్టీఆర్ వీడియో కాల్



**విశ్వంభర, సినిమా :** ప్రాణాంతక క్యాన్సర్ తో బాధపడుతున్న ఓ అభిమాని చివరి కోరిక తెలుసుకుని యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ చలించిపోయారు. ఆ వీరాభిమాని పేరు కౌశిక్. కౌశిక్ వయసు 19 ఏళ్లే. కానీ విధి అతడి జీవితాన్ని తారుమారు చేసింది. కొంత కాలంగా అతడు బోన్ క్యాన్సర్ తో పోరాడుతున్నాడు. ఇటీవల ఆ కుర్రాడి తల్లిదండ్రులు తిరుపతిలో మీడియా ముందుకు వచ్చి, తమ కుమారుడి చివరి కోరిక ఏంటో చెప్పారు. చనిపోయేలాగా ఎన్టీఆర్ దేవర సినిమా చూడాలన్నదే తమ కుమారుడి ఆఖరి కోరిక అని, దేవర సినిమా చూసేంతవరకైనా తనను బతికించాలని తమ కుమారుడు డాక్టర్లను వేడుకుంటున్నాడని చెప్పి ఆ తల్లిదండ్రులు భోరున విలపించారు. కాగా, తన అభిమాని పరిస్థితి తెలుసుకున్న జూనియర్ ఎన్టీఆర్ వెంటనే స్పందించారు. తాజాగా కౌశిక్ కు వీడియో కాల్ చేసి అతడిని సంతోషసాగరంలో ముంచెత్తారు. నువ్వు ఎప్పుడూ నవ్వుతూనే ఉండాలి... నవ్వుతుంటే చక్కగా ఉన్నావు అని ఎన్టీఆర్ తన అభిమాని కౌశిక్ లో ఆత్మవిశ్వాసం నింపేందుకు ప్రయత్నించారు. మీతో మాట్లాడతానని అసలు అనుకోలేదు అని కౌశిక్ చెప్పగా... భలేవాడివే, అభిమానులతో మాట్లాడకుండా ఎలా ఉంటాను? అని ఎన్టీఆర్ బదులిచ్చారు. ఎలా ఉన్నావంటూ కౌశిక్ ఆరోగ్య పరిస్థితిపై ఎన్టీఆర్ అడిగి తెలుసుకున్నారు. క్యాన్సర్ ను జయించి రావాలని పేర్కొన్నారు. సినిమా సంగతి తర్వాత... ముందు నీ ఆరోగ్యం బాగుపడాలి... మీ అమ్మానాన్నలను చూసుకోవాలి అని ఆకాంక్షించారు. కాగా, కౌశిక్ తల్లిదండ్రులు తిరుపతి మీడియా సమావేశంలో మాట్లాడుతూ, తమ కుమారుడి వైద్యం కోసం రూ.60 లక్షలు ఖర్చు అవుతుందని... ప్రభుత్వం, దాతలు పెద్దమనసుతో ముందుకు వచ్చి సాయం చేయాలని కన్నీళ్లతో విజ్ఞప్తి చేశారు.

# ‘దళపతి 69’ అనౌన్స్‌మెంట్ వచ్చేసింది

**విశ్వంభర, సినిమా :** కోలీవుడ్ స్టార్ హీరో దళపతి విజయ్ నటించిన 'ది గోట్' ప్రస్తుతం థియేటర్లో రన్ అవుతోంది. ఇంతలోనే విజయ్ చివరి సినిమాకు సంబంధించిన అప్డేట్ సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతోంది. దీంతో నెట్టింట్లో #Thalapathy69 హ్యాష్ ట్యాగ్ ఫుల్ ట్రెండ్ అవుతోంది. విజయ్ ఫ్యాన్స్ అంతా దీని గురించే చర్చించుకుంటున్నారు. అయితే సినిమా గురించి ఇంకా అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రాలేదు కానీ, చిత్రానికి సంబంధించిన పలు విషయాలు, తారాగణం గురించి డీటెయిల్స్ బయటకు వచ్చాయి. విజయ్ 69వ చిత్రంగా రానున్న ఈ చిత్రాన్ని కె.వి.ఎన్ ప్రొడక్షన్స్ బ్యా నర్ లో రానుంది. డైరెక్టర్ హెచ్.వినోద్ దర్శకత్వం వహించనున్నారు. ఇప్పటికే దీనికి సంబంధించిన స్పెషల్ వీ డియో కూడా రిలీజైంది. ఈ చిత్రంలో టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత లేదా హీరోయిన్ పూజా హెగ్డే నటించే అవకాశం ఉన్నట్లు టాక్ వినిపిస్తోంది. ఈ చిత్రంలో సమంత, కాని పూజా హెగ్డే ఈ చిత్రంలో నటిస్తారని వార్తలు వినిపిస్తున్నాయి. ఇంకా ఈ చిత్రంలో సీనియర్ నటి సిమ్రన్ కూడా కీలక పాత్ర పోషిస్తుందని టాక్ వినిపిస్తుంది. అలాగే ప్రేమలు బ్యూటీ మమితా బైజు కూడా ఈ క్రేజీ ప్రాజెక్ట్‌లో భాగం అవుతుందని అంటున్నారు. అనిరుధ్ సంగీతం అందిస్తారట. మాస్టర్, తెలుగు 'దసరా' సినిమాలకు పని చేసిన సత్యన్ సూరన్ విజయ్ సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరించబోతున్నారట. బాలీవుడ్ నటుడు బాబీ డేఓల్ విలన్‌గా నటిస్తారట. ఏదేమైనా వీటన్నిటిపై ఓ క్లారిటీ రావాలంటే మూవీటీమ్ నుంచి అఫీషియల్ అనౌన్స్‌మెంట్ వచ్చే వరకు వేచి ఉండాల్సిందే. కాగా, దళపతి విజయ్ ఆ మధ్య 'తమిళగ వెట్రి కళగం' అనే రాజకీయ పార్టీని ప్రారంభించారు. 2026 ఎన్నికల్లో పోటీ చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. దీంతో సినిమాలకు గుడ్‌బై చెప్పి పూర్తిగా రాజకీయాల్లోకి వచ్చేందుకు ప్రణాళికలు చేసుకుంటున్నారు.






## ప్రియాంక భర్త నిక్‌తో కలిసి హాట్ హాలీడే..

**విశ్వంభర, సినిమా :** బాలీవుడ్ హస్కీ బ్యూటీ ప్రియాంక చోప్రా సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా ఉంటూ హాట్ హాట్ ఫోటోలతో కుర్రాళ్ల గుండెల్లో సెగలు రేపుతుంటారు. తాజాగా భర్త నిక్ జోనాస్, కుమార్తె మాల్తీ మేరీతో కలిసి వెకేషన్‌కు వెళ్లిన ప్రియాంక.. అక్కడ బికినీలో పరువాల విందు చేసింది. దీనికి సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. ప్రియాంక చోప్రా క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. భారత్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా ఆమెకు గుర్తింపు ఉంది. హిందీలో కాకుండా తమిళ సినిమా ద్వారా సినీరంగ ప్రవేశం చేసిన ప్రియాంక చోప్రా.. అతి తక్కువ కాలంలోనే తన అందం, అభినయంతో బాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా వెలుగొందారు. కొన్నేళ్ల పాటు బాలీవుడ్‌ని, భారతీయ చిత్ర పరిశ్రమను ఒక ఊపు ఊపింది. తన సినిమాలతోనే కాకుండా పెళ్లితోనూ ప్రియాంక చోప్రా సంచలనం సృష్టించారు. హాలీవుడ్ రేపర్ నిక్ జోనాస్‌ను 2018లో ఆమె వివాహం చేసుకున్నారు. ఆమె కంటే నిక్ దాదాపు పదేళ్లు చిన్నవాడు. ఎన్ని విమర్శలు వచ్చినా వాటిని ఏమాత్రం పట్టించుకోకుండా ఫ్యామిలీ లైఫ్‌ను ఎంజాయ్ చేస్తున్నారు ప్రియాంక చోప్రా. అనంతరం సరోగసీ ద్వారా కుమార్తె మాల్టీకి జన్మనిచ్చి.. భర్త, పాపతో గడుపుతోంది ప్రియాంక. ఇక తన సినిమాలు, షూటింగ్స్‌కు ఏమాత్రం విరామం దొరికినా సరే భర్త, కూతురితో కలిసి గడపటానికే ఈ ముద్దుగుమ్మ ఇంపార్టెన్స్ ఇస్తుంది. ప్రస్తుతం ఫ్యామిలీతో కలిసి సౌత్ ఫ్రాన్స్‌లో వెకేషన్‌కు వెళ్లింది ప్రియాంక. అక్కడి హోటల్ డూ క్యాప్‌లో వీరి కుటుంబం బస చేస్తున్నట్లుగా తెలుస్తోంది. అన్నింటికి మించి బికినీ వేసుకుని బీచ్‌లో పడవలో భర్త ఒళ్లో పడుకుని సెగలు రేపుతోంది ప్రియాంక. వైట్ కాలర్ బాడీకాన్ డ్రెస్సులో ఉన్న ఆమె ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. చాలా రోజుల తర్వాత మరాఠీలో తెరకెక్కిన పానీ మూవీలో ప్రియాంక చోప్రా నటించారు. ఈ సినిమా సెప్టెంబర్ 18న ప్రేక్షకుల ముందుకు రానుంది.







Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com